అక్షర కలం తెలుగు దిన పత్రికలో పదవి విరమణ, కోర్టు నోటీసులు, జన్మదిన, వ్యాపార అభివృద్ధి కొరకు మరియు అన్ని రకాల ప్రకటనలు ప్రచురించబడును.
సంప్రదించండి 93962 18955
aksharakalam@gmail.com
అక్షరకలం తెలుగు దినపత్రిక

epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

అక్షరకలం తెలుగు దినపత్రిక
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న 'అక్షర కలం'తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు మండలాల వారిగా, నియోకవర్గాలవారిగా, జిల్లాల వారిగా విలేకరులు, యాడ్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
గమనిక : డిగ్రీ ఉత్తీర్ణులు మరియు వివిధ పత్రికలలో పని చేసిన అనుభవం ఉన్నవారికి ప్రాముఖ్యత కలదు
epaper.aksharakalam.com
aksharakalam@gmail.com
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 93962 18955

సంపుటి : 17 సంచిక : 265 | 06-11-2025 గురువారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | హైదరాబాద్ | వరంగల్ | మహబూబ్‌నగర్ | పేజీలు : 12 వెల : రూ.1.00



## దమ్ముంటే అభివృద్ధిపై
# చర్చిద్దాం

- ఎవరి హయాంలో ఏం చేశామో వివరిద్దాం
- సిఎం రేవంత్‌కు కెటిఆర్ సవాల్

2 లో..

## బిజెపిలో త్వరలోనే
# బిఆర్ఎస్ విలీనం

- ఈ రెండు పార్టీలు ఒక్కటే అని రుజువయ్యింది
- గత పార్లమెంట్ ఎన్నికల్లో వీరి బంధం బట్టబయలు
- మైనార్టీలకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్న సిఎం
- రేవంత్‌తో భేటీ అయిన క్రైస్తవ సంఘాల నేతలు



బీఆర్ఎస్ పార్టీని బీజేపీకి మాజీ సీఎం కేసీఆర్ తాకట్టు పెట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు ఎనిమిది చోట్ల డిపాజిట్ కూడా రాకపోవడానికి కుమ్మక్కు రాజకీయాలే కారణమని విమర్శించారు. బిజెపిలో బిఆర్ఎస్ విలీనం ఎంతోదూరం లేదన్నారు. ఈ మేరకు ఈ రెండు పార్టీలు ఒక్కటే అంటూ బీఆర్ఎస్ బీజేపీ లపై రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధామంత్రి నరేంద్ర మోదీకి మద్దతు ఇస్తున్న కేసీఆర్ తెలంగాణకి అత్యంత ప్రమాదకరమని ఆక్షేపించారు.

వార్త 2లో

## తెలుగు రాష్ట్రాల్లో కార్తీక
# పౌర్ణమి సందడి

- సముద్రతీరాలు, నదీతీరాల్లో పుణ్యస్నానాలు
- ఆలయాల్లో శైవరాధన..కార్తీక దీపాల వెలిగింపు



వార్త 2లో

తెలుగు రాష్ట్రాల్లో కార్తీకపౌర్ణమిని ఘనంగా జరుపుకున్నారు. వేకువ జామునే సముద్ర, నదీస్నానాలు ఆచరించారు. దగ్గరలోని ఆలయాలకు వెళ్లి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. గోదావరి, కృష్ణానదుల్లో స్నానం చేయడంతో పాటు, తీరప్రాంతాల్లో ఆలయాల్లో సందడి నెలకొంది. ఇకపోతే శివాలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపారాధనలు జరిగాయి. ముఖ్యంగా ఉసిరి చెట్టు కింద దీపారాధన చేసి, అరటి డొప్పలలో దీపాలు వెలిగించి నదిలో వదిలారు. భక్తులు దానధర్మాలు, నదీ స్నానాలు చేసారు. శ్రీశైలంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా మల్లన్న దర్శనానికి భక్తులు పోటెత్తారు.

2 లో..



## బీహార్‌లో ఎన్‌డిఎ
# కూటమిదే విజయం

మరోమారు ప్రజలు పట్టం కట్టబోతున్నారు
ప్రజల్లో మార్పు గమనించానన్న మోడీ

## కాంగ్రెస్‌ను ప్రజలు
# నమ్మడం లేదు



జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి కాంగ్రెస్ ఏం చేస్తుందో చెప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రెండేళ్లలో ఏం చెప్పారో..ఏం జరిగిందో ప్రజలకు తెలిసిపోయిందని, కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్తితి లేదన్నారు.

వార్త 2లో



## జూబ్లీహిల్స్‌లో
# కాంగ్రెస్ బెదరింపులు

- అభ్యర్థి నవీన్ యాదవ్ తీరుపై బిఆర్ఎస్ మండిపాటు
- ఈ బెదరింపులు దేనికి సంకేతమన్న బాల్క సుమన్

2

## ఛత్తీస్‌ఘడ్‌లో మరో
# ఎన్‌కౌంటర్

### ముగ్గురు మావోయిస్టుల హతం

ఖమ్మం, అక్షరకలం ప్రతినిధి

ఛత్తీస్‌గఢ్ – తెలంగాణ సరిహద్దు బీజాపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు చనిపోయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తాళ్లగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నారం, మారిమల్ల అడవుల్లో భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. ఆ ప్రాంతంలోని మావోయిస్టులను భద్రతా దళాలు చుట్టుముట్టినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు హతమైనట్లు సమాచారం. భద్రతా దళాలు సంఘటనా స్థలంనుంచి పెద్ద సంఖ్యలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. ఇంకా అదే ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. అయితే, మావోయిస్టుల మృతిపై పోలీసులు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.



## బిఆర్ఎస్ తప్పుడు
# ప్రచారాలు

### మండిపడ్డ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల సందర్భంగా తనపై బీఆర్ఎస్ తప్పుడు ఆరోపణలు చేస్తోందని కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు తనపై తప్పుడు నిందలు వేస్తూ, అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ప్రజలు దొంగ సర్వేలను నమ్మరని పేర్కొన్నారు. ప్రజలకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉన్నానని, గతంలో ఓటమి చెందినా ప్రజలతో మమేకం అయ్యానని నవీన్ యాదవ్ మాట్లాడారు. తాను చదువుకున్న వ్యక్తినని, ప్రజల కోసం నిజాయితీగా పని చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. గతంలో తమ గల్లీకి ఎమ్మెల్యే కూడా రాలేదని, ఇప్పుడు సీఎం వస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తనను కుడి భుజంగా భావించడం తమ అదృష్టమని ఆయన



పేర్కొన్నారు. తన తండ్రి గతంలో కేసీఆర్‌కు సహాయం చేశారన్న నవీన్ యాదవ్, కేసీఆర్ తమ ఇంటికి వచ్చి సహాయం అడిగారని, శత్రువు ఇంటికి వచ్చినా సహాయం చేస్తామని నవీన్ యాదవ్ అన్నారు. 2018లో తనకు అవకాశం ఇవ్వకుండా బీఆర్ఎస్ అడ్డుకుందని ఆయన విమర్శించారు. తనపై వస్తున్న విమర్శలను పట్టించుకోనని, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి ఆధారంగా ఓట్లు అడగాలని ఆయన సూచించారు.

# దమ్ముంటే అభివృద్ధిపై చర్చిద్దాం

## ఎవరి హయాంలో ఏం చేశామో వివరిద్దాం

## సిఎం రేవంత్‌కు కెటిఆర్ సవాల్

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

హైదరాబాద్ అభివృద్ధి పై తనతో చర్చకు రావాలని సిఎం రేవంత్ రెడ్డికి కెటిఆర్ సవాల్ విసిరారు. హైదరాబాద్ అభివృద్ధి ఎవరి హయాంలో ఏం జరిగిందో వివరిస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీ, సచివాలయం, గాంధీ భవన్ ఎక్కడైనా సరే.. రేవంత్‌తో చర్చకు రెడీ అని ఛాలెంజ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరాశ, నిస్పృహతో ఉన్నారని విమర్శించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఓటమి ఖాయమని రేవంత్‌కు అర్ధమైందని సెటైర్లు గుప్పించారు. అందుకే తనపై రేవంత్‌రెడ్డి వ్యక్తిగత దూషణలకు దిగారని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి తప్పదని భావించి.. రేవంత్‌రెడ్డి తనపై విమర్శలు చేస్తున్నారని ÷ర్ అయ్యారు. ఆయన కంటే గట్టిగా తాను మాట్లాడగలనని... రేవంత్‌రెడ్డికి సమాధానం చెప్పే సత్తా తనకు ఉందని స్పష్టం చేశారు. కానీ తమ అధినేత కేసీఆర్ సూచనల తోనే రేవంత్‌రెడ్డిపై వ్యక్తిగత దూషణలకు తాను దిగటం లేదని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు చెప్పాలని కేసీఆర్ తనకు చెప్పారని పేర్కొన్నారు. తనను వ్యక్తిగతంగా విమర్శించిన.. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు కాబట్టి రేవంత్‌రెడ్డిని తాను గౌరవిస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్, జూబ్లీహిల్స్ అభివృద్ధిపై రేవంత్‌రెడ్డి చర్చకు రావాలని సవాల్ విసిరారు. హోంశాఖను పర్యవేక్షిస్తున్న రేవంత్‌రెడ్డి హయాంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఫైర్ అయ్యారు. హైదరాబాద్‌లో గన్, డ్రగ్ కల్చర్ పెరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్.. చెత్త సిటీ, క్రైం సిటీగా మారిందని విమర్శించారు. అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్లు కేసీఆర్ హయాంలోనే నిర్మించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్ని ఫ్లై ఓవర్లు కట్టారో చెప్పాలని సవాల్ విసిరారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో వంద లింకు రోడ్లు నిర్మించామని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రోడ్లపై ఉన్న ఒక గుంత కూడా ఎందుకు పూడ్చలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. సీఎం అంటే కటింగ్ మాస్టర్ మాదిరిగా రేవంత్ వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ సిటీలో మళ్లీ తాగునీటి కష్టాలు తెచ్చింది కాంగ్రెస్ సర్కార్‌నేనని విమర్శించారు. చెత్త సమస్య పరిష్కారానికి స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమానికి తాము శ్రీకారం చుట్టామని నొక్కిచెప్పారు. మెట్రో నిర్మించిన ఎల్అండ్ టీని సీఎం రేవంత్‌రెడ్డి బెదిరించారని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఫ్లైల ఓవర్లు, అండర్‌పాసులు నిర్మించామన్నారు. రేవంత్ ప్రభుత్వం కనీసం రోడ్లపై పడిన గుంతలనైనా పూడ్చిందా? అంటూ ప్రశ్నించారు. హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చేదెవరో ప్రజలందరికీ తెలుసునని, కాంగ్రెస్ హయాంలో మంచినీటి కష్టాలు మొదలయ్యాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో హైదరాబాద్‌ను క్లీన్ సిటీగా మార్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌ను మురికికూపంగా మార్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో పవర్ హాలీడేలు విధించేవారని, కేసీఆర్ పాలనలో24గంటలు నాణ్యమైన కరెంట్ అందించామన్నారు. కేసీఆర్ హయాంలో విద్యుత్ వెలుగులు నిండాయని, గ్రీన్ సిటీ ఆఫ్ ది వరల్డ్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దామన్నారు. 16వేల నర్సరీలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేశామన్నారు. హెచ్‌సీయూలో జీవవైవిధ్యాన్ని నాశనం చేసిన ఘనత రేవంత్‌రెడ్డిదని అన్నారు. రేవంత్ బెదిరింపులకు ఎన్నో పరిశ్రమలు తరలిపోతున్నాయని, రాష్ట్రంలో శాంతిభద్రతలు అధ్వాన్నంగా మారాయని విమర్శించారు. మహారాష్ట్ర పోలీసులు వచ్చి ఇక్కడ డ్రగ్స్ దందాను పట్టుకున్నారని, రూ.12వేల డ్రగ్స్ దొరికితే పట్టింపులేదా?.. తెలంగాణ ముఖ్యమంత్రి, పోలీసులు ఏం చేస్తున్నారని నిలదీశారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి రిపోర్ట్‌ను ఇంటింటికీ పంపిస్తామన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.5,328 కోట్లు ఖర్చు చేశామని.. మెట్రోపై రూ.1,722 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. స్ఆర్‌డీపీ కింద రూ.333కోట్లతో షేక్‌పేట ఫ్లై ఓవర్‌ను నిర్మించామని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేశామన్నారు. ఎర్రగడ్డలో రూ.900 కోట్లతో టిమ్స్ ఆసుపత్రిని నిర్మించామన్నారు. వెయ్యి పడకలతో టిమ్స్ ఆసుపత్రిని నిర్మించింది వాస్తవం కాదా? అంటూ ప్రశ్నించారు. జీహెచ్ఎంసీ పరిధిలో లక్ష డబుల్ బెడ్‌రూంలు కట్టామని, రెహ్మత్‌నగర్‌లో కట్టిన 3600 డబుల్ బెడ్‌రూంలను పంపిణీ చేశామన్నారు. ప్రైవేట్ వాళ్లు కడితే ఒక్కో డబుల్ బెడ్‌రూంకు రూ.కోటి ఛార్జ్ చేసేవారన్నారు. ఆసరా పెన్షన్, కల్యాణలక్ష్మి కింద దాదాపు రూ.600 కోట్లు అందించామన్నారు. 106 మందికి దళితబంధు అందించామన్నారు. పండుగల కోసం 14కోట్లు అందించామని, అన్నపూర్ణ భోజనాల కోసం రూ.2కోట్లు చెల్లించినట్లు వివరించారు. మైనారిటీల కోసం 204 గురుకులాలను ఏర్పాటు చేశామని, రూ.51కోట్లతో గురుకులాలన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బోరబండలో సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.87కోట్లు ఖర్చు చేశామని, రూ.17కోట్లతో ఫంక్షన్ హాలు నిర్మించినట్లు తెలిపారు. రూ.455 కోట్లతో పది సబ్‌స్టేషన్లను కట్టామని, జూబ్లీహిల్స్‌లో విద్యుత్ నిర్వహణ కోసం రూ.505కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఇంటింటికీ తాగునీరు ఇచ్చేందుకు రూ.30కోట్లు ఖర్చు చేశామన్న కేటీఆర్.. రూ.180కోట్లు మంచినీటి కోసం ఖర్చు చేసినట్లు చెప్పుకొచ్చారు. పార్కుల నిర్వహణకు రూ.20కోట్లు, డీఆర్ఎఫ్ పెట్టి ప్రజలకు సహాయక చర్యలు అందించామన్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.5328 కోట్లు ఖర్చు చేస్తే.. రెండేళ్ల రేవంత్ పాలనలో ఎంత ఖర్చు చేశారో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రెండేళ్లలో చేసిన అభివృద్ధిని చూపించి రేవంత్ ఓట్లు అడగాలని, గోపీనాథ్ వేసిన శిలాఫలకం జూబ్లీహిల్స్‌లో ఎక్కడికి పోయినా కనిపిస్తుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో 34 అవార్డులు వచ్చాయని.. రేవంత్ పాలనలో ఎన్ని వచ్చాయని ప్రశ్నించారు. ప్రజలే న్యాయనిర్ణేతలని.. జూబ్లీహిల్స్‌లో సరైన జవాబిస్తారన్నారు.

# బీహార్‌లో ఎన్‌డిఎ కూటమిదే విజయం

## మరోమారు ప్రజలు పట్టం కట్టబోతున్నారు

## ప్రజల్లో మార్పు గమనించానన్న మోడీ

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

బిహార్‌లో గత ఇరవై ఏళ్లలో కనీవినీ ఎరగని విజయాన్ని ఎన్డీయే కూటమి ఈసారి సాధించబోతోందని, ఓటర్లు ఆ మేరకు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. మరోమారు ఎన్‌డిఎదే బీహార్ అని అన్నారు. ప్రజల్లో కనిపిస్తున్న మార్పునకు ఇది సంకేతం అన్నారు. 'ఆటవిక రాజ్య' నేతలు చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. బిహార్లో తాను ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నప్పుడు ప్రతిచోటా మునుపటి సభ కంటే భారీగా ప్రజలు వస్తున్నారని, ముఖ్యంగా మహిళలు పెద్దఎత్తున పాల్గొంటున్నారని చెప్పారు. బిహార్‌లో భాజపా–ఎన్డీయే మహిళా కార్యకర్తల్ని ఉద్దేశించి మంగళవారం ఆయన నమో యాప్ ద్వారా ప్రసంగించారు. 'మేరే బూత్.. సబ్‌సే మజ్‌బూత్' అనే సంకల్పంతో భాజపా మహిళా కార్యకర్తలు అమోఘమైన కృషి చేస్తున్నారని ప్రధాని ప్రశంసించారు. బిహార్ ఎన్నికలను నేనెంతో క్షుణ్నంగా పరిశీలిస్తున్నాను. అందువల్ల ఎన్డీయేదే గెలుపు అని ఖాయంగా చెప్పగలను. విజయంపై నాకెలాంటి సందేహం లేదు. పోలింగ్ మాత్రం ఇంకా పెరగాలని కోరుకుంటున్నాను. మహిళల సులభతర జీవనాన్ని మెరుగుపరడానికి, వారికి సాధికారత కల్పించడానికి ఎన్డీయే సర్కారు కట్టుబడి ఉంటుందని ఆయన చెప్పారు. ఎన్డీయే విజయం కోసం బిహార్ ప్రజలు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారని చెప్పిన ఓ మహిళతో మోదీ మాట్లాడుతూ– పేదలు, దళితులు, మహాదళితులు, బీసీలు, అత్యంత వెనుకబడిన వర్గాల్లోనూ ఇదే భావన ఉందని అన్నారు.

# కూతురు కులాంతర వివాహం

## నమ్మించి కిడ్నాప్ చేయబోయిన తల్లిదండ్రులు

జగిత్యాల,

వాళ్లిద్దరు మనస్ఫూర్తిగా ఒకరినొకరు ఇష్టపడ్డారు. ఆరేళ్ల ప్రేమలో ఉన్న వారు కులాంతర వివాహం చేసుకొని పెళ్లిబంధంతో ఒక్కటయ్యారు. అయితే ఇది నచ్చని వధువు తల్లిదండ్రులు కూతురిని నమ్మించి కిడ్నాప్‌కు ప్రయత్నించారు. వివరాల్లోకి వెళ్తే..జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం రాజక్కపల్లికి చెందిన మర్రి రాకేష్‌తో పెద్దపెల్లి జిల్లా పాలకుర్తికి చెందిన ప్రియాంక ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కాగా, కులాంతర వివాహానికి ప్రియాంక తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో వారు ఓ గుడిలో పెళ్లి చేసుకున్నారు. అయితే కొన్ని నెలల తర్వాత ప్రియాంకకు ఆమె తల్లి ఫోన్ చేసి మాట్లాడి కలిసిపోయినట్లు నటించారు.

# బిజెపిలో త్వరలోనే బిఆర్ఎస్ విలీనం

## ఈ రెండు పార్టీలు ఒక్కటే అని రుజువయ్యింది

## గత పార్లమెంట్ ఎన్నికల్లో వీరి బంధం బట్టబయలు

## మైనార్టీలకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్న సిఎం

## రేంవత్‌తో భేటీ అయిన క్రైస్త్రవ సంఘాల నేతలు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి



బీఆర్ఎస్ పార్టీని బీజేపీకి మాజీ సీఎం కేసీఆర్ తాకట్టు పెట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు ఎనిమిది చోట్ల డిపాజిట్ కూడా రాకపోవడానికి కుమ్మక్కు రాజకీయాలే కారణమని విమర్శించారు. బిజెపిలో



బిఆర్ఎస్ విలీనం ఎంతోదూరం లేదన్నారు. ఈ మేరకు ఈ రెండు పార్టీలు ఒక్కటే అంటూ బిఆర్ఎస్ బీజేపీ లపై రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధామంత్రి నరేంద్రమోదీకి మద్దతు ఇస్తున్న కేసీఆర్ తెలంగాణకి అత్యంత ప్రమాదకరమని ఆక్షేపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కారు గుర్తుకు ఓటేస్తే కమలం గుర్తుకు వేసినట్లేనని ఆరోపించారు. జూబ్సీహిల్స్ క్రైస్త్రవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్స్ సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం కలిశారు. ఈ క్రమంలో సీఎంతో క్రైస్త్రవ సంఘాల ప్రతినిధులు సమావేశం అయ్యారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు క్రైస్త్రవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్స్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం కోసం పనిచేస్తామని వారు హామీ ఇచ్చారు. అలాగే, తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వారి సమస్యలపై సానుకూలంగా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. వారి సమస్యలని వెంటనే పరిష్కారిస్తానని మాటిచ్చారు. భారత్ జోడో పాదయాత్ర ద్వారా ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశంలోని మైనార్టీలకు ఒక భరోసా ఇచ్చారని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్‌లో మైనార్టీలను మభ్యపెట్టడానికి కుట్ర జరుగుతోందని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేసీఆర్ ఒక వైపు ఉన్నారని.. రాహుల్ గాంధీ, తాను మరోవైపు నిలబడ్డామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి కేసును సీబీఐకి అప్పగించి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కేంద్రప్రభుత్వం ఎందుకు స్పందించలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. కార్ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు తెలంగాణ గవర్నర్ ఇప్పటి వరకు ఎందుకు అనుమతి ఇవ్వలేదని నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రాజకీయ ఒప్పందం లేకపోతే ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈ కేసుల విషయంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులను ఎందుకు విచారణకు పిలవడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అయ్యే పరిస్థితి ఉందని ఆరోపించారు. గతంలో కవితనే ఈ విషయాన్ని స్పష్టం చేసిందని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసేందుకు జూబ్లీహిల్స్‌ను ప్రయోగశాలగా చూస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ మంత్రివర్గంలో ఒక్క దళితుడే మంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. తమ మంత్రివర్గంలో నలుగురు దళితులకు అవకాశం కల్పించామని ఉద్ఘాటించారు. అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్‌కి అవకాశం ఇచ్చామని అన్నారు. అత్యంత నిరుపేదలకు సంక్షేమ కార్యక్రమాలు అందించాలన్నదే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. దేశం కోసం సర్వం త్యాగం చేసిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీలని ఈడీ ఆఫీసుకు పిలిచి విచారణ చేశారని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. క్రైస్త్రవ సంఘాల ప్రతినిధులతో జరిగిన భేటీకి మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు లక్ష్మీకాంతరావు, శ్రీ గణేలిష్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, ఏఐసీసీ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు అనిల్ థామస్, తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో కార్తీక పౌర్ణమి సందడి

## సముద్రతీరాలు, నదీతీరాల్లో పుణ్యస్నానాలు

## ఆలయాల్లో శైవరాధన..కార్తీక దీపాల వెలిగింపు

హైదరాబాద్/విజయవాడ, అక్షరకలం ప్రతినిధి



తెలుగు రాష్ట్రాల్లో కార్తీకపౌర్ణమిని ఘనంగా జరుపుకున్నారు.



వేకువ జామునే సముద్ర, నదీస్నానాలు ఆచరించారు. దగ్గరలోని ఆలయాలకు వెళ్లి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. గోదావరి, కృష్ణానదుల్లో స్నానం చేయడంతో పాటు, తీరప్రాంతాల్లో ఆలయాల్లో సందడి నెలకొంది. ఇకపోతే శివాలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపారాధనలు జరిగాయి. ముఖ్యంగా ఉసిరి చెట్టు కింద దీపారాధన చేసి, అరటి డొప్పలలో దీపాలు వెలిగించి నదిలో వదిలారు. భక్తులు దానధర్మాలు, నదీ స్నానాలు చేసారు. శ్రీశైలంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా మల్లన్న దర్శనానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుండే పాతాళగంగలో పుణ్య స్ధానాలు ఆచరించి స్వామిఅమ్మవార్ల దర్శనార్ధం క్యూలైన్లలో బారులు తీరారు. స్వామిఅమ్మవార్ల దర్శనానికి 4 గంటల సమయం, ప్రత్యేక దర్శాన్నికి 2 గంటల సమయం పట్టింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు.. ఆలయాల్లో దీపాలు వెలిగించి, పూజలు, అభిషేకాలు చేసారు. వరంగల్ వేయిస్తంబాల దేవాలయం, కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం, రామప్ప దేవాలయం, కురవి వీరభద్రస్వామి, పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ కొనసాగింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు జరిగాయి. యాదాద్రి లక్ష్మీనరసింహుడి క్షేత్రంలో భక్తుల రద్దీ కనిపించింది. స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని భక్తులతో శైవ క్షేత్రాలు కిటకిటలాడాయి. శివనామస్మరణంతో శివాలయాలు మారుమోగాయి. తెల్లవారుజాము నుండే అలయాలకు చేరుకొని కార్తీక దీపాలు వెలిగించి, భక్తులు ప్రత్యేక అభిషేకాలు చేసారు. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు.. బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయంలో స్వామివారి దర్శనానికి బారులు తీరారు. బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి, ఝూరాసంగం కేతకి సంగమేశ్వర, సంగారెడ్డి సోమేశ్వర ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. కార్తీక పౌర్ణమి సందర్భంగా భద్రాచలం వద్ద గోదావరి నదిలో భక్తుల పుణ్య స్నానాలు ఆచరించారు. కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేసారు. మణుగూరు సబ్ డివిజన్ వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులతో శివాలయాలు కిటకిట లాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, పూజలు చేస్తున్నారు. ధర్మపురి,బాసర, కాళేశ్వరంల వద్ద గోదావరి స్నానాలకు భక్తుల రద్దీ పెరిగింది. అనంతరం ఆలాయాల్లో దీపారాధాన చేపట్టారు.

# కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడం లేదు

## ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న కిషన్ రెడ్డి

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి కాంగ్రెస్ ఏం చేస్తుందో చెప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రెండేళ్లలో ఏం



చెప్పారో..ఏం జరిగిందో ప్రజలకు తెలిసిపోయిందని, కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్తితి లేదన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా యూసఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ భాజపా అభ్యర్థి లంకల దీపక్ రెడ్డిని గెలిపించాలని కోరారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమకు, భారత రాష్ట్ర సమితికి మధ్య ఎలాంటి అవగాహనా ఒప్పందం జరగలేదని తేల్చిచెప్పారు. కేసీఆర్ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేశారని.. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి మధ్యనే అవగాహన కుదిరిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంతో పాటు జూబ్లీహిల్స్‌లోనూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ బెదరింపులు

## అభ్యర్థి నవీన్ యాదవ్ తీరుపై బిఆర్ఎస్ మండిపాటు

## ఈ బెదరింపులు దేనికి సంకేతమన్న బాల్క సుమన్

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి బెదిరింపులకు పాల్పడుతున్నాడని బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి మద్దతుతోనే ఆయన బెదిరింపులకు దిగుతున్నారని మండిపడ్డారు. ఈ బెదిరింపులు దేనికి సంకేతమని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో శాంతి భద్రతలు క్షీణించాయని విమర్శించారు. పట్టపగలే హత్యలు, దోపిడీలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో హైదరాబాద్‌లో చిన్న అవాంఛనీయ ఘటన జరగలేదని తెలిపారు. హైదరాబాద్‌లో బతుకుతున్న ప్రతి ఒక్కరూ హైదరాబాదీయులే అని.. వాళ్ల కాలికి ముళ్లు గుచ్చుకుంటే.. నా పంటితో తీస్తానని కేసీఆర్ సీఎం హోదాలో అన్నారని గుర్తుచేశారు.



శాంతి భద్రతలు కఠినంగా అమలుచేశారని తెలిపారు. దీనివల్ల హైదరాబాద్‌కు పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఐటీ రంగం విస్తరించిందని అన్నారు. కేసీఆర్ పాలనలో పారిశ్రామికరంగం, రియల్ ఎస్టేట్ రంగం పెరిగిందని తెలిపారు. కేసీఆర్ పాలనలో పెట్టుబడులకు తెలంగాణ గేట్‌వే ఆఫ్ ఇండియాగా ఉంటే.. కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ గన్ కల్చర్‌కు అడ్డగా మారిందని బాల్క సుమన్ విమర్శించారు. జూబ్లీహిల్స్ అనేది సంగమం లాంటి నియోజకవర్గమని బాల్క సుమన్ అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రవర్తన ఎలా ఉందో ఆలోచించుకోవాలని సూచించారు. కేసీఆర్ నాయకత్వంలో హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందిందని తెలిపారు. హైదరాబాద్ ప్రగతి తెలంగాణ పురోగతికి దోహదపడిందని అన్నారు. హైదరరాబాద్ లో ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేసినందుకు .. 2018లో అత్యధిక సీట్లు వచ్చాయని తెలిపారు. రెండు సందర్భా ల్లో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మేయర్, డిప్యూటీ మేయర్ బీఆర్ఎస్ కైవసం చేసుకుందని అన్నారు.

# గజాలా హష్మి హైదరాబాద్ వాసి

న్యూయార్క్,

వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా డెమోక్రాట్ గజాలా హష్మీ విజయం సాధించారు. అమెరికా రాష్ట్రాల్లో ఈ పదవికి ఎన్నికైన తొలి ముస్లిం మహిళగా ఆమె సరికొత్త రికార్డు సృష్టించారు. హైదరాబాద్‌కు చెందిన గజాలా నాలుగేళ్ల ప్రాయంలో తన తల్లి, సోదరుడితో కలిసి అమెరికాలోని జార్జియాకు వెళ్లారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో పీహెచ్‌డీ పూర్తి చేసిన ఆమె తండ్రి ప్రసిద్ధ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయుడిగా పనిచేసేవారు. చదువుల్లో అద్భుత ప్రతిభ కనబరుస్తూ అనేక స్కాలర్‌షిప్పులు, ప్రోత్సాహకాలు అందుకున్న గజాలా.. జార్జియా సదరన్ విశ్వవిద్యాలయంలో బీఏ ఆనర్స్ చదివారు. అట్లాంటాలోని ఎమరి వర్సిటీ నుంచి సాహిత్యంలో పీహెచ్‌డీ చేశారు. అజహర్‌తో వివాహం అనంతరం గజాలా 1991లో రిచ్‌మండ్ ప్రాంతానికి మారారు. 30 ఏళ్ల పాటు ఆమె అక్కడే రేనాల్డ్స్ కమ్యూనిటీ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. 2019లో ఆమె తొలిసారిగా అమెరికా ఎన్నికల్లో గెలుపొందారు. 2024లో ఆమె సెనేట్ విద్య, వైద్య కమిటీ ఛైర్‌పర్సన్‌గా డెమోక్రటిక్ పార్టీ తరఫున ఎన్నికయ్యారు.

# మార్పుకోసం..నవశకం కోసం ఈ ప్రస్థానం

### న్యూయార్క్‌లోని కొత్తతరానికి థాంక్యూ

### నెహ్రూ ప్రసంగం 'ట్రిస్ట్ విత్ డెస్టినీ'ని ప్రస్తావన

### న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్‌దాని

న్యూయార్క్,

అమెరికా స్థానిక ఎన్నికల్లో న్యూయార్క్ మేయర్ పదవిని డెమోక్రటిక్ పార్టీకి చెందిన జొహ్రాన్ మమ్‌దానీ సొంతం చేసుకున్నారు. ఆ స్థానాన్ని దక్కించుకున్న తొలి ఇండియన్-అమెరికన్ ముస్లింగా చరిత్ర సృష్టించారు. విజయానంతరం ఆయన మాట్లాడుతూ.. భారత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రస్తావన తీసుకువచ్చారు. మార్పు కోసం, నవ శకం కోసం ఈ రాత్రి తీర్పు వెల్లడైంది. జనవరి ఒకటిన నేను మేయర్‌గా ప్రమాణస్వీకారం చేస్తాను అని జొహ్రాన్ వెల్లడించారు. ఈ సందర్భంగా నెహ్రూ ప్రసంగం 'ట్రిస్ట్ విత్ డెస్టినీ'ని ప్రస్తావించారు. నవశకం వైపు అడుగువేసినప్పుడు, ఒక శకం ముగిసినప్పుడు, సుదీర్ఘ అణచివేతకు గురైన జాతి నుంచి గళం వినిపించినప్పుడు.. చరిత్రలో ఇలాంటి క్షణాలు అరుదుగా వస్తాయి' అని తన విజయానికి ఆపాదించి మాట్లాడారు. ఈ విజయాన్ని కట్టబెట్టిన తన మద్దతుదారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. న్యూయార్క్‌లోని కొత్తతరానికి థాంక్యూ. మేం మీకోసం పోరాడుతాం.. ఎందుకంటే మేం మీలాంటివాళ్లమే. మన చేతుల్లోనే భవిష్యత్ ఉంది. రాజవంశాన్ని కూల్చివేశాం. ట్రంప్.. ఇదంతా మీరు చూస్తున్నారని నాకు తెలుసు. మీకు చెప్పడానికి నా వద్ద నాలుగు మాటలు ఉన్నాయి. సౌండ్ పెంచండి. మీరు మాలో ఎవరినైనా చేరుకోవాలంటే మా అందరినీ దాటాలని మమ్‌దానీ నేరుగా ట్రంప్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఆయన అలా మాట్లాడుతుంటే.. ఇది ప్రారంభమ వుతుంది అని ట్రూత్ సోషల్‌లో అధ్యక్షుడు రాసుకొచ్చారు. అలాగే రిచర్డ్ అనే ట్యాక్సీ డ్రైవర్‌తో కలిసి సిటీ హాల్‌లో వెలుపల 15 రోజులు నిరాహార దీక్ష చేసిన స్టోరీని వెల్లడించారు. ఇది మీ నగరం, ప్రజాస్వామ్యం మీది.. అని వ్యాఖ్యానించారు. అలాగే తన తల్లిదండ్రులకు ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. నన్ను తీర్చిదిద్దింది మీరే. నేను మీ కుమారుడిని అయినందుకు గర్వంగా ఉందని అన్నారు. సోషలిస్ట్ భావజాలం ఉన్న మమ్‌దానీ న్యూయార్క్ మాజీ గవర్నర్ ఆండ్రూ క్యూమోపై విజయం సాధించడం విశేషం. ఉగాండా జాతీయుడైన మహమూద్ మమ్‌దానీ- భారతీయ సినీ డైరెక్టర్ మీరానాయర్‌కు జన్మించిన సంతానమే జొహ్రాన్. ఈ ఎన్నికను ట్రంప్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఆయనే స్వయంగా ప్రచారంలో పాల్గొన్నా కూడా ఫలితం లేకపోయింది. ఇక, అతిపిన్న వయస్సు (34 ఏళ్లు)లో న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన వ్యక్తిగా మమ్‌దానీ రికార్డ్ సృష్టించారు. విజయం తర్వాత మేయర్ ఆఫీస్ దృశ్యాలను సోషల్ మీడియాలో షేర్ చేశారు.

# కుటుంబ కలహాలతో బిడ్డతో సహా తల్లి ఆత్మహత్య

### హుస్సేన్ సాగర్‌లో లభించిన శవాలను గుర్తించన పోలీసులు

హైదరాబాద్,

కుటుంబ కలహాలతో వివాహిత తన కుమార్తెతో కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అయితే గుర్తు తెలియని శవంగా పోలీసులు భద్రపరిచారు. చివరకు దర్యాప్తులో ఆమెను కీర్తిక అగర్వాల్‌గా గుర్తించారు. లేక్ పోలీసుల వివరాల ప్రకారం..పాతబస్తీలో నివాసముంటూ వ్యాపారం చేస్తున్న పృథ్వీలాల్, చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న కీర్తిక అగర్వాల్(28) దంపతులు. వీరికి రెండేళ్ల కుమార్తె బియ్యారా ఉంది. దంపతుల మధ్య గొడవలతో ఆమె ఏడాదిన్నర కిందటే బహదూర్‌పురలో నివాసముంటున్న తల్లిదండ్రుల వద్ద కుమార్తెతో కలిసి ఉంటోంది. ఈనెల 2న హుస్సేన్‌సాగర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. సోమవారం నెక్లెస్ రోడ్డులోని నీరా కేఫ్ సమీపంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వివరాలు లభ్యం కాకపోవడంతో మార్చురీకి తరలించి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తమ కుమార్తె, మనుమరాలు కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఆత్మహత్యకు పాల్పడిన మహిళ కీర్తిక అగర్వాల్‌గా గుర్తించిన ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఆమె తన కుమార్తెతో కలిసి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని భావించి పరిశీలించగా మంగళవారం పాప మృతదేహాన్ని గుర్తించారు.

# సంగారెడ్డి జిల్లా వద్ద అదుపుతప్పిన బస్సు బ్రేకులు ఫెయిల్ అయి విద్యుత్ స్తంభానికి ఢీ

### ప్రమాదం నుంచి బయటపడ్డ ప్రయాణికులు

సంగారెడ్డి,

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల బస్సు ప్రమాదం ఘటన ఎంతటి విషాదాన్ని నింపిందో అందరికీ తెలిసిందే. బస్సును టిప్పర్ లారీ ఢీకొట్టడంతో అందులోని కంకర బస్సులో పడి దాదాపు 19 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన మరువక ముందే మరో ప్రమాదం చోటు చేసుకుంది. సంగారెడ్డి జిల్లాలో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. అయితే ప్రాణాపాయం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్సులోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. జాతీయ రహదారి 65 సమీపంలో పటాన్‌చెరు మండలం ముత్తంగి వద్ద ఆర్టీసీ బస్సుకు ప్రమాదం జరిగింది. ముందు ఉన్న కారును తప్పించబోయి బ్రేక్ ఫెయిల్ కావడంతో బస్సు డివైడర్‌పైకి దూసుకెళ్లి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే ప్రయాణికులు ఎవరూ కూడా గాయపడకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి గురైన బస్సు మేడ్చల్ డిపోకు చెందింది. మేడ్చల్ నుంచి ఇస్నాపూర్ వెళ్తుండగా ప్రమాదం జరిగింది. సమాచారం అందిన వెంటనే పటాన్‌చెరు పోలీసులు సంఘటనా స్థలికి చేరుకున్నారు. బస్సులో సాంకేతిక లోపం కారణంగా ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు. అయితే ఆర్టీసీ బస్సులకు వరుసగా జరుగుతున్న ప్రమాదాలతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్న పరిస్థితి.

# కర్నాటక రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి

సంగారెడ్డి,

కర్ణాటకలోని హల్లిఖేడ్‌లో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వ్యాను, కారు ఢీకొన్న ఈ ఘటనలో నలుగురు తెలంగాణవాసులు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులను సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్ గ్రామానికి చెందిన నవీన్ (40), రాచప్ప (45), కాశీనాథ్ (60), నాగరాజు (40)గా గుర్తించారు. వీరంతా గానుగాపూర్ దత్తాత్రేయ ఆలయానికి వెళ్లి కారులో తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది.

# కెనడాలోనూ తిరోగమన చర్యలు

### భారతీయులకు తాత్కాలిక వీసాల రద్దు

### విద్యార్థులకు కూడా భారీగా కోత విధింపు

న్యూఢిల్లీ,

భారతీయులకు జారీచేసిన తాత్కాలిక వీసాలను మూకుమ్మడిగా రద్దు చేయాలని కెనడా ప్రభుత్వం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. అమెరికా తరవాత అంతో ఇంతో ఆశగా ఉన్న కెనడాలో సైతం ఈ మధ్యజాత్యహంకారం పెరగింది. దీంతో పార్లమెంట్ ఆమోదం కోసం ఎదురుచూస్తున్న ఓ బిల్లు ప్రకారం కొవిడ్-19 వంటి మహమ్మారి లేదా యుద్ధ సమయాలలో విదేశీయులకు మంజూరు చేసే తాత్కాలిక వీసాలను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. అయితే కెనడా ప్రభుత్వం మాత్రం ప్రత్యేకించి కొన్ని దేశాలను లక్ష్యంగా చేసుకుని ఈ అధికారాలను ప్రయోగించాలని భావిస్తున్నట్లు సీబీసీ న్యూస్ వెల్లడించింది. విధానంలోని లోపాలను ఉపయోగించుకుని మోసపూరితంగా తాత్కాలిక వీసాలు పొందకుండా అడ్డుకునే అధికారాలను కూడా ఈ బిల్లులో పొందుపరచాలని కెనడా ప్రభుత్వం యోచిస్తున్నట్లు ఇమిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజెన్‌షిప్ కెనడా(ఐఆర్‌సీసీ), కెనడియన్ బార్డర్ సర్వీసెస్ ఏజెన్సీస్(సీబీఎస్ఏ) నివేదికలను ఉటంకిస్తూ సీబీసీ తెలిపింది. కెనడా ప్రభుత్వం ప్రత్యేకంగా భారత్, బంగ్లాదేశ్‌లను లక్ష్యంగా చేసుకుని ఈ ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పేర్కొంది. తాత్కాలిక నివాసులలో ఉద్యోగులు, అంతర్జాతీయ విద్యార్థులతోపాటు సందర్శకులు కూడా ఉంటారు. కెనడా సరిహద్దులను బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ బిల్లును పార్లమెంట్‌కు సమర్పించింది. సంబంధిత మంత్రికి అపారమైన అధికారాలను కట్టబెట్టే స్ట్రాం÷-రగ్ బార్డర్స్ బిల్లుకు లిబరల్ ప్రభుత్వం ఆమోదించిన పక్షంలో వీసా దరఖాస్తులు భారీ స్థాయిలో రద్దయ్యే అవకాశం ఉందని ఇమిగ్రేషన్ న్యాయవాది సుమిత్ సేన్ గతంలోనే ఆందోళన వ్యక్తం చేశారు. శాశ్వత, తాత్కాలిక వలసలకు అడ్డుకట్ట వేయాలని




కెనడా ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో ఈ బిల్లు పార్లమెంట్ ఆమోదం కోసం వేచి ఉంది. కెనడా కళాశాలల్లో చదువుకునేందుకు పర్మిట్ల కోసం వచ్చిన భారతీయ దరఖాస్తులలో దాదాపు 74 శాతం దరఖాస్తులు ఈ ఏడాది ఆగస్టులో తిరస్కరణకు గురైనట్లు రాయిటర్స్ వెల్లడించింది. దశాబ్ద కాలంగా కెనడాలో చదివే అంతర్జాతీయ విద్యార్థులలో అత్యధికులు భారతీయులే ఉంటున్నారు. అయితే ఈ ఏడాది ఆగస్టులో వీసా దరఖాస్తుల తిరస్కరణకు గురైన విద్యార్థులలో కూడా భారతీయులే అత్యధికంగా ఉండడం గమనార్హం. 2023 ఆగస్టులో సుమారు 32 శాతం దరఖాస్తులు మాత్రమే తిరస్కరణకు గురయ్యాయి. కెనడా ప్రభుత్వం ఈ నెలలోనే తన ఇమిగ్రేషన్ ప్రణాళికను వెల్లడించనున్నది. దేశంలోకి విదేశీయుల ప్రవేశాన్ని తగ్గించాలని ప్రభుత్వంపై దేశీయంగా ఒత్తిడి పెరుగుతున్నది. జారీ అయిన తాత్కాలిక వీసాలను మూకుమ్మడిగా రద్దు చేసేందుకు ప్రభుత్వానికి అధికారాలు కట్టబెట్టే బిల్లుపై 300కి పైగా పౌర సంఘాలు తీవ్ర నిరసన తెలియచేశాయి. మూకుమ్మడిగా వీసాలను రద్దు చేయడం ద్వారా కెనడా ప్రభుత్వానికి దేశంలో ఉంటున్న విదేశీయులందరినీ ఇక్కడి నుంచి తరలించే అధికారాలు లభిస్తాయని ఆ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. మూకుమ్మడిగా వీసాలను రద్దు చేసే అధికారాన్ని పొందడం ద్వారా ప్రభుత్వం పెరిగి పోతున్న పెండింగ్ వీసా దరఖాస్తుల సంఖ్యను తగ్గించాలని భావిస్తోందని ఇమిగ్రేషన్ న్యాయవాదులను ఉటంకిస్తూ బీబీసీ తెలిపింది. ఆశ్రయం కోరుతూ భారతీయులు సమర్పిస్తున్న దరఖాస్తులు భారీగా పెరిగిపోవడమే భారతీయులను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకోవడానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. 2023 మేలో కేవలం నెలకు 500 లోపలే ఈ దరఖాస్తుల సంఖ్య ఉండగా 2024 జూలైలో ఇది దాదాపు 2,000కి పెరిగిపోయింది. భారత్ నుంచి వచ్చే తాత్కాలిక వీసా దరఖాస్తులను తనిఖీ చేయడం వల్లే దరఖాస్తుల ప్రాసెసింగ్ కుంటుపడుతున్నట్లు ప్రభుత్వం భావిస్తోంది. 2023 జూలై చివరి నాటికి వీసా దరఖాస్తుల ప్రాసెసింగ్ సగటు సమయం 30 రోజులు ఉండగా మరుసటి సంవత్సరానికి అది 54 రోజులకు పెరిగింది. ఈ కారణంగా వీసా ఆమోదాలు 2024లోనే బాగా తగ్గిపోయాయి. జనవరిలో 63 వేల దరఖాస్తులను ఆమోదించగా జూన్‌లో అది 48 వేలకు పడిపోయింది.

# డొనాల్డ్ ట్రంప్ పార్టీకి గట్టి షాక్

### న్యూయార్క్, వర్జీనియా మేయర్లుగా డెమాక్రట్లు

### న్యూయార్క్ మేయర్‌గా జోహ్రాన్ మమ్దానీ

### వర్జీనియాలో లెఫ్టినెంట్ గవర్నర్‌గా గజాలా హాష్మీ

### ఇద్దరూ భారతీయ మూలాలు ఉన్న వ్యక్తులే కావడం విశేషం

న్యూయార్క్,


అమెరికాలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పార్టీకి గట్టి షాక్



తగిలింది. అగ్రరాజ్యం అమెరికాలో పలు పదవులకు జరిగిన ఎన్నికల్లో భారతతి సంతతికి చెందిన వ్యక్తులు, డెమోక్రాట్లు తమ హవా కొనసాగించారు. యూఎస్ ఆర్థిక రాజధాని న్యూయార్క్, వర్జీనియాలో జరిగిన తాజా ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థులు, భారత సంతతికి చెందిన వ్యక్తులు విజయం సాధించారు. న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో భారత సంతతికి చెందిన జోహ్రాన్ మమ్దానీ విజయం సాధించారు. ఈ ఘనత సాధించిన తొలి ముస్లిం, భారత సంతతి, ఆఫ్రికన్ సంతతికి చెందిన తొలి మేయర్‌గా ఆయన రికార్డు సృష్టించారు. 34 ఏండ్ల మమ్దానీ జూన్‌లో జరిగిన డెమోక్రాటిక్ ప్రైమరీ ఎన్నికల్లో ఘన విజయం సాధించి మేయర్ అభ్యర్థిగా నిలిచారు. తాజాగా జరిగిన మేయర్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ గవర్నర్ ఆండ్రూ క్యూమోపై మమ్దానీ విజయం సాధించారు. ఒక ఉన్నత కుటుంబం నుంచి స్వయం ప్రకటిత ప్రజాస్వామ్య సోషలిస్ట్ అయిన మమ్దానీ భారత సంతతికి చెందిన తల్లిదండ్రులకు ఉగాండాలో జన్మించాడు. ఏడేళ్ల నుంచి అమెరికాలో ఉంటున్నారు. 2018లో సహజ పౌరసత్వం పొందారు. మరోవైపు వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్ రేసులో భారత సంతతికి చెందిన డెమోక్రటిక్ అభ్యర్థిని గజాలా హాష్మీ విజయం సాధించారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి జాన్ రీడ్‌పై భారీ మెజారిటీతో గెలుపొందారు. హష్మీ 15వ సెనెటోరియల్



జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వర్జీనియా సెనేట్‌లో పనిచేసిన మొదటి ముస్లిం, తొలి దక్షిణాసియా అమెరికన్ గజాలా. ఇలా న్యూయార్క్ నగర మేయర్ పదవికి జరిగిన ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీకి చెందిన జొహ్రాన్ మమ్‌దానీ గెలిచి చరిత్ర సృష్టించారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎత్తులను చిత్తు చేస్తూ 34 ఏళ్ల జొహ్రాన్ మేయర్ గా విజయం సాధించారు. ఈ పదవి దక్కించుకున్న తొలి భారత-అమెరికన్ ముస్లిం ఈయనే. భారతీయ మూలాలున్న మమ్‌దానీ మరెవరో కాదు.. బాలీవుడ్ ప్రముఖ దర్శకురాలు మీరా నాయర్ కుమారుడే. జొహ్రాన్ మమ్‌దానీ 1991 అక్టోబరులో ఉగాండాలోని కంపాలాలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులిద్దరూ భారత మూలాలున్న వ్యక్తులే కావడం విశేషం. తల్లి మీరా నాయర్ పంజాబీ హిందూ మహిళ. భారత దిగ్గజ దర్శకుల్లో ఆమె ఒకరు. 'సలామ్ బాంబే', 'మాన్‌సూన్ వెడ్డింగ్' వంటి ప్రముఖ చిత్రాలతో అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు. తండ్రి మహ్మద్ మమ్‌దానీ గుజరాతీ ముస్లిం. బాంబేలో జన్మించిన మహ్మద్ మమ్‌దానీ ఆ తర్వాత ఉగాండాకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ఈయన విద్యావేత్త. జొహ్రాన్ మమ్‌దానీకి ఐదేళ్ల వయసు ఉన్నప్పుడు ఆయన కుటుంబం దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌కు మారింది. ఆ తర్వాత రెండేళ్లకే న్యూయార్క్‌కు మకాం మార్చి అక్కడే స్థిరపడింది. సైన్స్, ఆఫ్రికన్ స్టడీస్‌లో జొహ్రాన్ మమ్‌దానీ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. జొహ్రాన్ మమ్‌దానీ రాజకీయ విజయాల వెనుక తల్లిదండ్రుల పాత్రే ఎక్కువ. ముఖ్యంగా తల్లి మీరా నాయర్ జీవితం నుంచే ఆయన ఎన్నో పాఠాలు నేర్చుకున్నారు. నాలుగు దశాబ్దాల తన




సుదీర్ఘ కెరీర్‌లో ఆమె ఎన్నో ఎత్తుపల్లాలు చూశారు. సంప్రదాయ వాద, మూస సిద్ధాంతాలను సవాల్ చేస్తూ ముందుకుసాగారు. తన జీవిత అనుభవాలను ఒక్కగానొక్క కొడుకు జొహ్రాన్‌కు పాఠాలుగా చెప్పారు. 'మన కథలను తర్వాతి తరానికి మనం చెప్పకపోతే ఇంకెవరు చెబుతారు' అనేది ఆమె సిద్ధాంతం. ఆమె చెప్పిన కథలే జొహ్రాన్ రాజకీయ ప్రయాణానికి మూలస్తంభాలుగా నిలిచాయి. అణచివేతకు గళమెత్తాల్సిందే అనే నినాదంతో జొహ్రాన్ రాజకీయాల్లోకి వచ్చారు. 2020లో తొలిసారి న్యూయార్క్ అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఇప్పుడు న్యూయార్క్ నగర మేయర్‌గా విజయం సాధించి మరో చరిత్ర సృష్టించారు. మమ్‌దానీ విజయం అధ్యక్షుడు ట్రంప్ పాలనకు గట్టి ఎదురుదెబ్బగా మారింది. ఈ ఎన్నికల్లో ఆయనను అడ్డుకునేందుకు రిపబ్లికన్ నేతలు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించ లేదు. రిపబ్లికన్ల విధానాలను తీవ్రంగా వ్యతిరేకించే మమ్‌దానీ.. తన ప్రచారంలో పదునైన విమర్శలతో ఓటర్లను ఆకట్టుకున్నారు. దీంతో ట్రంప్ స్వయంగా రంగంలోకి దిగాల్సి వచ్చింది. మమ్‌దానీ ఎన్నికల్లో గెలిస్తే న్యూయార్క్ సిటీకి ఫెడరల్ సాయం అందదని ఓ దశలో అధ్యక్షుడు హెచ్చరించారు కూడా..! యూదు వ్యతిరేకి అంటూ రిపబ్లికన్లు ఆయనపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. వాటన్నింటికి ఎదురొడ్డి నిలిచిన మమ్‌దానీ.. ఓటర్ల దృష్టిని ఆకర్షించడం పైనే ప్రధానంగా దృష్టిపెట్టారు. ఉచితాలు, హామీలతో ప్రచారం చేశారు. అవన్నీ కలిసొచ్చి మమ్‌దానీ విజయం సాధించారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# పాక్‌ను ఎగదోసే పనిలో ట్రంప్ !

ట్రంప్‌కు పిచ్చిపట్టిందని ఎవరైనా అనుకుంటే పొరపాటే..ఎందుకంటే ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు, ఆయన చర్యలు కేవలం భారత్‌ను టార్గెట్ చేస్తున్నవిగా గుర్తించాలి. భారత్ ఆర్థికంగా ఎదగడం ఒక ఎత్తయితే..సైనికపాటవంలో అమెరికాను ధిక్కరించే స్థాయికి చేరుకుంటుందన్న భయం కూడా కనిపిస్తుంది. ముఖ్యంగా ఆపరేసన్ సిందూర్‌లో భారత్ సైనిక పాటవం అజేయంగా నిలిచింది. పాక్‌కు అమెరికా ఇచ్చిన యుద్ధవిమానాలను కూడా తుత్తినియలు చేసింది. ఇదే ప్రధాన కారణంగా ట్రంప్‌ను నిద్రలేకుండా చేస్తోంది. అందుకే ఇటీవల ఆయన తీసుకున్న నిర్ణయాలన్నీ భారత్‌ను ఏకాకిని చేయాలన్న బలమైన సంకల్పంతో తీసుకున్నవేనని గుర్తించాలి. అన్నింటికి మించి పాక్‌ను బూచిగా చూపి బెదిరించాలన్న ధోరణి బాగా కనిపి స్తోంది. ఇందులో భారత్‌తో సమానంగా పాక్‌ను కూడ చేర్చి రెండు అణ్వాయుధ దేశాలు అంటూ పదేపదే వ్యాఖ్యానించారు. ఇప్పుడు పాక్ కూడా అణ్వాయుధ పరీక్షలు చేస్తోందన్నారు. దంతా కూడా పాక్‌లో పాగావేసి, అక్కడి నుంచి అవసరమైతే భారత్, చైనాలపై దాడులకు దిగాలన్న కుయుక్తులు పన్ను తున్నారు. అందుకే భారత్ వ్యతిరేక చర్యలకు ట్రంప్ స్పీడ్ పెంచారు. సుంకాలు కావచ్చు.. వీసాలు కావచ్చు,

అక్కడ అనధికారికంగా ఉన్నవారిని వేధించి, వెక్కరించి తిప్పిపంపడం కావచ్చు..ఉద్యోగాల్లో భారీతయులను తొలగించాలన్న డిమాండ్ కావచ్చు..ఇవన్నీ కూడా ఆపరేషన్ సింధూర్ తరవాత తీసుకున్న గట్టి నిర్ణయాలు గా చూడాలి. తాజాగా అణ్వాయుధ పరీక్షలు చేస్తామని చెప్పడం ద్వారా పాక్ కూడా అ÷-వాయుధాలు పరీక్షిస్తోందని చెప్పడం కూడా కేవలం భారత్‌ను బెదిరించే చర్య తప్ప మరోటి కాదు. ప్రపంచాన్ని 150 సార్లు నాశనం చేసే అణ్వాయుధాలు అమెరికా వద్ద ఉన్నాయని స్వయంగా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఆదివారం నాడు ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక నుండి అమెరికా అణ్వాయుధాలను పరీక్షిస్తుందని, చాలా దేశాలు అణు పరీక్షలు చేస్తున్నాయని అన్నారు. తమ వద్ద అత్యుత్తమమైన అణ్వాయుధాలున్నాయని, అయినా పెంచుకోవల్సిన అవసరం ఉందని అన్నారు. అవి ఎలా పని చేస్తున్నాయో పరీక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. చైనా, రష్యా, ఉత్తర కొరియా దేశాల వద్ద కూడా అణ్వాయుధాలున్నాయని, కాని వారు బయటకు చెప్పరని అన్నారు. గత 30 సంవత్సరాల నుండి ఎటువంటి పరీక్షలు అమెరికా చేయలేదన్నారు. వారు అణు పరీక్షలు చేస్తునప్పుడు అమెరికా ఎందుకు చేయని దేశంగా ఉండాలని అన్నారు. ఆ దేశాలు రహస్యంగా భూగర్భంలో పరీక్షిస్తారు వాటి గురించి ప్రపంచానికి తెలియదని చెప్పుకొచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా, కేవలం పాక్ కూడా అణ్వాయుధ పరీక్షలు చేస్తోందని చెప్పడంలో మతలబు ఉంది. ఇకపోతే ఇదే సందర్భంలో పుతిన్, జిన్‌పింగ్ చాలా కఠినాత్ములు, బలమైన నాయకులు, తీవ్రంగా పరిగణించాల్సిన వ్యక్తులు అని వ్యాఖ్యానించారు. చైనాతో వాణిజ్య ఒప్పందం కుదిరింది కదా అని ఇంటర్వ్యూ చేస్తున్న జర్నలిస్టు ప్రశ్నించగా ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. 'మేము చైనాని ఓ కంట కనిపెడతాం. వారు అమెరికాను ఎల్లప్పుడూ కనిపెడ్తూ ఉంటారని అన్నారు. గత 8 నెలల కాలంలో 8 యుద్ధాలను ఆపానని, భారత్, పాక్‌ల మధ్య అణుయుద్ధాన్ని నివారించానని మరోసారి వ్యాఖ్యానించారు. ఇప్పటికే ట్రంప్ మీద స్వదేశంలో తీవ్రమైన వ్యతిరేకత వస్తోంది. విదేశాల్లో కుట్రలు చేస్తున్నారని, భారత్ లాంటి మిత్రదేశాన్ని దూరం చేసుకుంటున్నారని మండిపడు తున్నారు. ఇవేవీ ఆయన పట్టించుకోవడం లేదు. అంతెందుకు న్యూయార్క్ మేయర్ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ట్రంప్ డెమొక్రాట్స్ సోషలిస్టు అభ్యర్థి జోహ్రాన్ మమ్దానిపై విమర్శలు చేశారు. అతను సోషలిస్టు కాదు, కమ్యూనిస్టు అని అన్నారు. 'మమ్దాని గెలిస్తే అధ్యక్షుడిగా నేనే నిధులు కేటాయించను. ఎందుకంటే న్యూయార్క్‌ను నడిపించేది కమ్యూనిస్టు అయినప్పుడు పంపించడం వృథా' అని అక్కసు వెళ్లగక్కారు. డెమొక్రాట్స్‌లో చెడ్డవారు, కమ్యూనిస్టులు ఉంటే నేను చెడ్డవారి పక్కనే నిలబడతానని మరో మేయర్ అభ్యర్థి క్యూమోను ఉద్దేశించి ట్రంప్ పేర్కొన్నారు. ఇలా రాజకీయంగా కూడా ట్రంప్ అమెరికాలో విపరీత వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ సందర్భంగా పాకిస్తాన్ ఇదే అవకాశంగా అణ్వాయు ధాలపై వ్యాఖ్యలు చేసింది. రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్ వంటి దేశాలు అణ్వాయు ధాలను పరీక్షిస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇస్లామాబాద్ స్పందించింది. ఈ విషయంపై పాకిస్థాన్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి అంతర్జాతీయ మీడియాకు వివరణ ఇస్తూ.. తామెప్పుడు ఇతర దేశాల కంటే ముందుగా అణు పరీక్షలను పునరుద్ధరించబోమన్నారు. అణు పరీక్షలను నిర్వహించిన మొదటి దేశం పాక్ కాదని.. అదేవిధంగా అణు పరీక్షలను తిరిగి ప్రారంభించే మొదటి దేశంగానూ తాము ఉండబోమని స్పష్టం చేశారు. ఈ విషయంపై చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి మావో నింగ్ సైతం స్పందించారు. బాధ్యతాయుతమైన అణ్వాయుధ దేశంగా చైనా ఎల్లప్పుడూ ఆత్మరక్షణ అణువ్యూహాన్ని సమర్థిస్తుందన్నారు. అణు పరీక్షలు నిలిపివేయాలనే విషయంలోనూ తాము అదే నిబద్ధతకు కట్టుబడి ఉంటామన్నారు. అమెరికా చేస్తున్న అణు పరీక్షలను సమర్థించుకున్న ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో చాలా దేశాలు చురుగ్గా అణ్వాయుధాలను పరీక్షిస్తున్నా యన్నారు. ఈ జాబితాలో పాకిస్థాన్ కూడా



ఉందని పేర్కొన్నారు. అణ్వాయుధాలకు ఉన్న విధ్వంసకర శక్తి కారణంగా ఆ పరీక్షలు చేయకూడదని గతంలో అధికారంలో ఉన్నప్పుడు నిర్ణయించుకున్నా. ఇప్పుడు పరిస్థితులు మారాయని ట్రంప్ అన్నారు. రష్యా, చైనా సహా ఇతర దేశాలు వేగంగా తమ అణుసామర్థ్యాలను పెంచుకుంటున్న నేపథ్యంలో మళ్లీ అణ్వాయుధ పరీక్షలు ప్రారంభించాల్సిందిగా అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మొత్తంగా అమెరికా అణుపరీక్షల వ్యవహారం ఎలా ఉన్నా రష్యాచ,చైనాల సరసన పాక్‌ను కూడా చేర్చడం వెనక భారత్‌ను బెదిరించే ధోరణిని ట్రంప్ ప్రకటించారు. ఎందుకంటే పాక్‌ను బల్లెంగా ఎగదోసే పనిలో ట్రంప్ బిజీగా ఉన్నాడని గుర్తించాలి. అందువల్ల ట్రంప్‌తో జాగ్రత్తగా ఉండాల్సిందే.

## పంచారామాల్లో భక్తుల రద్దీ

**విజయవాడ,**

కార్తిక సోమవారం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామునుంచే ఆలయాలకు భక్తులు బారులు తీరారు. పంచారామాలకు భారీగా భక్తులు తరలివచ్చారు. విజయవాడ దుర్గా ఘాట్ వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. భక్తిశ్రద్ధలతో ప్రమిదలు వెలిగించి, అభిషేకాలు నిర్వహించారు. దీంతో అంతటా ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఖమ్మం జిల్లా కూసుమంచిలో ఆలయాలకు పోటెత్తారు. తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో.. పంచారామాల్లో భక్తులు భారీగా తరలివచ్చారు. అలంపూర్ ఆలయాల్లో..జోగులాంబ ఆలయంలో భక్తులు శివుడి అభిషేకంలో పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లా మెట్‌పల్లి, కామారెడ్డి జిల్లా బీర్కూర్, ఎన్టీఆర్ జిల్లా నందిగామలో.ఏలూరు జిల్లా పోలవరం మండలం పట్టిసీమ వద్ద అఖండ గోదావరి మధ్యలో ఉన్న భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో.. బాపట్ల జిల్లా చినగంజాంలో..పల్నాడు జిల్లాలో అమరేశ్వర ఆలయానికి భారీగా తరలి వచ్చిన పంచారామాల భక్తులు అభిషేకాలు నిర్వహించారు. యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దంపతులు పూజలు చేసారు. శ్రీశైలం, మహానంది వంటి పుణ్యక్షేత్రాల్లోనూ భక్తుల తాకిడి పెరిగింది.

## లండన్ పర్యటనలో సిఎం చంద్రబాబు బిజీ

### పారిశ్రామికవేత్తలతో వరుస భేటీలు
### ఎపిలో 20వేల కోట్ల పెట్టుబుడులకు హిందూజా గ్రూపు అంగీకారం

**అమరావతి**

లండన్ పర్యటనలో సిఎం చంద్రబాబు బిజీగా గడిపారు. పలువురు పారిశ్రామికవేత్తలతో వరుసగా భేటీలు అయ్యారు. ఏపీకి పెట్టుబడులు ఆహ్వానించేందుకు లండన్ పారిశ్రామికవేత్తల తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వరుసగా సమావేశాలు నిర్వహించారు. లండన్‌లో ఆక్టోపస్ ఎనర్జీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ క్రిస్ ఫిట్జ్‌గెర్లడ్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం భేటీ అయ్యారు. లండన్‌లో ఆక్టోపస్ ఎనర్జీ ఇంటర్నేషనల్ సంస్థ అతిపెద్ద విద్యుత్ సరఫరాదారుగా ఉంది. ఈ నేపథ్యంలో పునరుత్పాదక విద్యుత్ రంగంలో ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆక్టోపస్ ఎనర్జీని సీఎం చంద్రబాబు ఆహ్వానించారు. అమరావతి, విశాఖపట్నంలలో నూతన టెక్నాలజీ ద్వారా విద్యుత్ సరఫరా నియంత్రణ రంగంలో పనిచేసేందుకు అవకాశాలు ఉన్నాయని సీఎం వివరించారు. క్లీన్ ఎనర్జీ, స్మార్ట్ గ్రిడ్, డేటా అనలిటిక్స్ రంగాల్లో ఏపీలో పని చేసేందుకు అవకాశాలు ఉన్నాయని ఆక్టోపస్ ఎనర్జీ ప్రతినిధులకు స్పష్టం చేశారు సీఎం. 160 గిగావాట్లు గ్రీన్‌ఎనర్జీ ఉత్పత్తి చేసేలా ఏపీ లక్ష్యం పెట్టుకుందని వెల్లడించారు. అలాగే. విద్యుత్ రంగంలో ప్రభుత్వ పాలసీలు వివరించారు ముఖ్యమంత్రి. ఈ రంగంలో ఏపీ నిర్దేశిరచుకున్న మన లక్ష్యాలను వెల్లడించారు ముఖ్యమంత్రి. ఏపీకి వచ్చి పెట్టుబడులు పెట్టాలని ఆక్టోపస్ ఎనర్జీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ క్రిస్ ఫిట్జ్‌గెర్లడ్‌ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానించారు. ఇకపోతే యూకే పర్యటనలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు హిందుజా గ్రూప్ ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో రూ.20వేల కోట్ల పెట్టుబడులు పెట్టాలని ఆ సంస్థ నిర్ణయించింది. విశాఖలో హిందుజా పవర్‌ప్లాంట్ సామర్థ్యాన్ని 1,600 మెగా వాట్లు పెంచడం, రాయలసీమ విద్యుత్ ఎ÷-లాంట్లు, మల్లవల్లిలో ఎలక్ట్రిక్ బస్సులు, తేలికపాటి వాహనాల తయారీ ఎ÷-లాంట్, ఏపీ వ్యాప్తంగా విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్ల నెట్‌వర్క్, గ్రీన్ ట్రాన్స్‌పోర్ట్ ఎకో సిస్టమ్ అభివృద్ధికి ఆ సంస్థ దశవారీగా పెట్టుబడులు పెట్టనుంది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం, హిందుజా గ్రూప్ మధ్య ఒప్పందం కుదిరింది.

## బస్సు ప్రమాదం నుంచి బయపడ్డ యువకుడు

**రంగారెడ్డి,**

చేవెళ్ల మండలం మిర్జాగూడ సమీపంలో సోమవారం జరిగిన బస్సు ప్రమాదంలో తాండూరు మండలం గౌతపూర్‌కు చెందిన బాలప్పొల్ల వినయ్ కుమార్(30) అనే యువకుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వినయ్‌కుమార్ హైదరాబాద్ సన్ సిటీలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం సెలవుదినం కావడంతో ఇంటికి వెళ్లాడు. సోమవారం విధులకు హాజరయ్యేందుకు ఆర్టీసీ బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరాడు. డ్రైవర్ వెనుక భాగంలోని ఆరో సీట్లో కూర్చున్నాడు. క్షణాల వ్యవధిలో జరిగిన ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన ఆయన.. అప్రమత్తమై కిటికీలోంచి బయటకు దిగినట్లు చెప్పారు. తన ముందు సీట్లో కూర్చున్న ముగ్గురు అక్కాచెల్లెళ్లు, పక్కన కూర్చున్న మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయినట్లు వివరించాడు. యువకుడు ప్రాణాలతో బయటపడటంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆనందం వ్యక్తం చేశారు.

## ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు

**రంగారెడ్డి**

చేవెళ్ల సమీపంలో 19 మందిని కబళించిన రోడ్డు ప్రమాదం..పలు కుటుంబాలను చిన్నాభిన్నం చేసింది. ఇద్దరు చిన్నారులకు తల్లిద్రండులను దూరం చేసి అనాథలుగా మార్చింది. ఈ ప్రమాదంలో వికారాబాద్ జిల్లా యాలాల్ మండలం హాజీపూర్‌కు చెందిన భార్యాభర్తలు బండప్ప, లక్ష్మి మృతి చెందారు. దీంతో వారి కుమార్తెలు భవాని, శివలీల ఒంటరిగా మిగిలిపోయారు. తల్లిదండ్రుల మృతితో చిన్నారు లు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ప్రమాదంలో ఓ బాలుడి తల్లి చనిపోగా తండ్రికి గాయాలయ్యాయి. బాలుడు ప్రాణాలతో బయటపడ్డాడు. గచ్చిబౌలిలో చదువుకుంటున్న ఓ యువతి ప్రమాదంలో చనిపోవడంతో వారి కుటుంబసభ్యులు బోరున విలపించారు. ఆదివారం సెలవు కావడంతో ఇంటికి వచ్చిందని.. తిరిగి వెళ్లేటప్పుడు ఈ ప్రమాదం జరిగిందని కన్నీరుమున్నీరయ్యారు.

## నడుములోతు కంకరలో కూరుకుపోయిన టీచర్

**రంగారెడ్డి,**

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. ఆర్టీసీ బస్సును కంకర లారీ ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగింది. కంకర లోడు ఒక్కసారిగా బస్సుపై పడిపోవడంతో పలువురు మృతిచెందారు. మరికొందరు కంకర కింద కూరుకుపోయి తీవ్రగాయాలతో నరకయాతన అనుభవించారు. తోల్కట్టలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మ్యాథ్స్ కాంట్రాక్ట్ టీచర్‌గా పనిచేస్తున్న జయసుధతో పాటు మరికొందరు నడుములోతు కంకరలో ఇరుక్కుని బయటకు రాలేకపోయారు. కేరెల్లి గ్రామానికి చెందిన జయసుధ వికారాబాద్‌లో బస్సు ఎక్కారు. ఆమెతో పాటు మరో నలుగురు ఉపాధ్యాయులూ అదే బస్సులో రావాల్సింది. వారు బయల్దేరడం ఆలస్యం కావడంతో వేరే బస్సులో వచ్చి ప్రమాదం నుంచి బయటపడ్డారు. జయసుధకు కాళ్లు వాచిపోవడంతో కుటుంబసభ్యులు నిమ్స్‌కు తరలించారు.

## తుపాన్ బాధితులకు బియ్యం పంపిణీపై ఆందోళన

**కాకినాడ,**

తుఫాను సమయంలో నష్టపోయిన తీర ప్రాంత వాసులను కులాలవారీగా విభజించి రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారని ఆరోపిస్తూ ? పలువురు మూలపేట రేషన్ షాప్ ల వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. కొంతమంది కులస్తులకు 50 కేజీలు అందిస్తుండగా ఎస్సీ, శెట్టిబలిజ, యాదవ కులస్తులకు 25 కేజీల బియ్యం మాత్రమే అందివ్వడం దారుణమని వాపోయారు. తుఫాను సమయంలో పునరావాస కేంద్రాల్లో కులాలతో సంబంధం లేకుండా తరలించారని, అదేవిధంగా ఉచిత రేషన్ కూడా వ్యత్యాసం లేకుండా అందివ్వాలని అధికారులను కోరుతున్నారు. ఈ ధర్నాలో కాకాడ లాజర్, వీరబాబు, రవికుమార్, సవరం వీరబాబు, సుబ్బారావు, రాజు, గండేపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రాజస్థాన్‌లో మరో ఘోర రోడ్డు ప్రమాదం

**జయపుర,**

వరుస రోడ్డు ప్రమాదాలతో దేశం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. రెండు రోజుల వ్యవధిలో దేశ వ్యాప్తంగా మూడు ఘోర రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఆదివారం రాజస్థాన్‌లోని ఫలోడి జిల్లాలో ఓ టెంపో కారు రోడ్డు పక్కన ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో 18 మంది చనిపోయారు. సోమవారం తెలంగాణ రంగారెడ్డి జిల్లాలో బస్సు ప్రమాదానికి గురైంది. దీంతో 20మంది మృతిచెందగా.. పదుల సంఖ్యలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ రెండు సంఘటనల నుంచి తేరుకోక ముందే మరో ప్రమాదం సంచలనం సృష్టిస్తోంది. రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఓ ట్రక్ డ్రైవర్ తాగిన మత్తులో బీభత్సం సృష్టించాడు. ట్రక్కుతో ఆగి ఉన్న వాహనాలను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో 10 మంది వరకూ ప్రాణాలు కోల్పోగా.. మరో 50 మంది తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇక, ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు ప్రమాదం జరిగిన లోహమండి రోడ్‌లోని ఓ షాపులో రికార్డు అయ్యాయి. ఆ సీసీటీవీ ఫుటేజీ వీడియోలో భీకర దృశ్యాలు ఉన్నాయి. ఆ ట్రక్ అడ్డం వచ్చిన వాహనాన్ని వాయు వేగంతో ఢీకొట్టుకుంటూ వెళ్లి పలువురి ప్రాణాలు తీసింది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో ఓ దారుణమైన విషయం బయటపడింది. ట్రక్ అదుపు తప్పిన తర్వాత ఆ డ్రైవర్ అర కిలోమీటర్ వరకు బ్రేకులు వెయ్యలేదు. అడ్డం వచ్చిన వాహనాలను ఢీకొట్టుకుంటూనే వెళ్లిపోయాడు. పోలీసులు డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. అతడ్ని విచారిస్తున్నారు.

## గంజాయి ముఠా పట్టివేత

**మహబూబ్‌నగర్,**

దాడులు చేస్తున్నా గంజాయి తరలింపు ఆగడం లేదు. వరుసగా పలు జిల్లాల్లో గంజాయి రవాణా సాగుతూనే ఉంది. తాజాగా నారాయణపేట జిల్లాలో అంతరాష్ట్ర గంజాయి ముఠా పట్టుబడింది. ఈ ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నారాయణపేట జిల్లా ఎస్పీ వెల్లడించారు. కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ వినీత్ మీడియాకువివరించారు. కృష్ణ మండల పోలీసులు కున్సి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు ద్విచక్రవాహనాలపై అనుమానాస్పదంగా వెళ్తున్న వారిని తనిఖీ చేశారు. వారి వద్ద నుంచి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని ఇచ్చిన సమాచారంతో కృష్ణ మండలం రైల్వేస్టేషన్‌లో మరో 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి సరఫరా చేస్తున్న వారితో పాటు ఓ మహిళ, మరో తొమ్మిది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో గంజాయి విక్రయిస్తున్న వారు, సేవిస్తున్న వారు ఉన్నారన్నారు. వారందరూ తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన వారిగా గుర్తించినట్లు చెప్పారు. ఎక్కడైనా గంజాయి అమ్ముతున్నట్లు, తీసుకున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. గంజాయి వాడినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## జోగి బ్రదర్స్ నెల్లూరు జైలుకు తరలింపు

**అమరావతి**

కల్తీ మద్యం కేసులో అరెస్ట్ అయిన మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన బ్రదర్ రామును నెల్లూరు సెంట్రల్ జైలుకు పోలీసులు సోమవారం తరలించారు. తెల్లవారుజామున న్యాయాధికారి రిమాండ్ విధించిన అనంతరం జోగి రమేశ్ ఆయన సోదరుడు రామును విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. అయితే, కోర్టు ఆదేశాల మేరకు జోగి సోదరులని మధ్యాహ్నం నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. ప్రత్యేక ఎస్కార్ట్‌తో జోగి బ్రదర్స్‌ను పోలీసులు నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు . తామే నకిలీ మద్యం వ్యవహారాన్ని వెలికి తీయించామని.. మేం లేకపోతే కూటమి ప్రభుత్వం నీరుగార్చేది అంటూ ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం యూనిట్, సీసాలను స్వాధీనం చేసుకున్న సమయంలో మాజీ మంత్రి జోగి రమేష్ అక్కడకు వచ్చి నానా యాగీ చేశారు. చివరకు ఆయన పాత్ర బయట పడడంతో ఆదివారం అరెస్టయ్యారు. గత నెల 6న ఇబ్రహీంపట్నంలోని జనార్దన్‌రావుకు చెందిన పాత ఏఎన్ఆర్ బార్‌లో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేసి నకిలీ మద్యం తయారీ గుట్టురట్టు చేశారు. ఆ సమయంలో జోగి.. తన అనుచరులను వెంటబెట్టుకుని అక్కడకు వచ్చారు. నానా హడావుడి చేశారు. నకిలీ మద్యం డంపు వెలుగులోకి వచ్చేందుకు తామే కారణమని చెప్పుకొచ్చారు. ఈ వ్యవహారంలో తనకున్న లింకులను దాచి పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించారు. పెద్దఎత్తున ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. నారా వారి సారా అంటూ చలోక్తులు విసిరారు. ప్రభుత్వమే నకిలీ మద్యం తయారు చేయిస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు లొంగుబాటుతో జోగి రమేష్ వ్యవహారమంతా బయటకు వచ్చింది. మద్యం తయారీ ముడిసరకులను స్వాధీనం చేసుకునే సమయంలోనూ ఎక్సైజ్ పోలీసుల విధులకు జోగి రమేష్ ఆటంకం కలిగించారు. చివరకు వారి ఫిర్యాదుతో ఆయనపై ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది.

## వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్న రెడ్ బుక్ రాజ్యాంగం

### ఇష్టానుసారంగా అరెస్టులతో బెదరింపులు
### ఆర్గనైజింగ్ క్రైమ్‌కు పాల్పడుతున్న పెద్దలు
### పాలన పక్కన పెట్టిచన చంద్రబాబు
### జోగి రమేశ్ అరెస్ట్‌తో పరాకాష్టకు చేరింది
### మండిపడ్డ వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి

**అమరావతి**

:రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వానికి అర్థమే మారిపోయిందని వైసీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు.. రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని, కక్షసాధింపు ధోరణిలో ప్రభుత్వం నడుస్తోందని మండిపడ్డారు. ప్రజల ఆకాంక్షల మేరకు ఏ ప్రభుత్వాలు అయినా పనిచేస్తాయి.. మానిఫెస్టోలు అమలు చేయటంతో పాటు వ్యవస్థలకు అనుగుణంగా పనిచేయాలి.. కానీ, కూటమి ప్రభుత్వం మాత్రం వ్యవస్థలను గాలికి వదిలేసింది.. ప్రభుత్వమే నేరస్వభావం కలిగి ప్రత్యర్థి పార్టీల నేతలను టార్గెట్ చేస్తుందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి పరిస్థితులు లేవు.. ప్రభుత్వం లోని పెద్దలే ఆర్గనైజ్డ్ క్రైమ్ కు పాల్పడుతున్నారు.. శాంతిభద్రతల పరిరక్షణ విషయం డొల్లగా మారిపోయింది.. చంద్రబాబు పొలిటికల్ గవర్నెన్స్ వికృత రూపంలోకి వెళ్ళిపోయింది.. మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్ట్ తో వీరి వికృత చేష్టలు పీక్ స్టేజ్ కు వెళ్లాయి.. అసలు ఈ ప్రభుత్వంలో ఏం జరుగుతుందని చూపించిన వ్యక్తిపై కేసులు పెట్టారు అంటూ మండిపడ్డారు.. నకిలీ మద్యం తయారు చేసి అమ్మే బ్యాచ్ ని పట్టుకున్నారు.. ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర తర్వాత కూడా మా నేతలపై నెపాన్ని వేయటం శోచనీయం అన్నారు సజ్జల.. టీడీపీ నేత జయచంద్రారెడ్డి ప్రత్యక్ష ప్రమేయంపై సాక్ష్యాధారాలు ఉన్నాయి.. టీడీపీ వాళ్ల పాత్ర క్లియర్ గా కనిపిస్తున్నా తిరిగి వైసీపీ నేతలపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాపై అనేక ఆధార రహిత ఆరోపణలు చేశారు.. సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు పెట్టారు.. లడ్డూ కల్తీ అంటూ దాన్ని వివాదం చేశారు.. టీడీపీ గ్రూపుల్లో గొడవలతో జంట హత్యలు జరిగినా మా పార్టీ నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరులపై కేసులు పెట్టారు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.. సోషల్ మీడియా కేసులో గంజాయి పెట్టి అక్రమ అరెస్టులు చేయటంతో హైకోర్టు కూడా ముట్టికాయలు వేసిందన్నారు సజ్జల.. తుని మైనర్ బాలికపై టీడీపీ నేత అత్యాచారానికి పాల్పడ్డ ఘటనలో నిందితుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు అన్నారు.. ఆ కేసుతో సంబంధం లేకపోయినా వైసీపీ కార్యకర్తలను స్టేషన్ కి పిలిచి ఇబ్బందులు పెడుతున్నారు.. తప్పు జరిగిన చోట యాక్షన్ తీసుకోకుండా సంబంధం లేని చోట మా పార్టీ నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారు.. నకిలీ మద్యం తయారు చేసింది టీడీపీ నేతలు అని అన్నీ ఆధారాలు ఉన్నాయి.. అయినా అసంబద్ధంగా జోగి రమేష్ ను అరెస్ట్ చేశారు.. కేసు కోర్టుల్లో నిలిచినా.. లేకపోయినా కొన్నాళ్లు వైసీపీ వాళ్లను జైళ్లలో పెట్టొచ్చని ఆరాట పడుతున్నారు. జయచంద్రారెడ్డి గత ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేశారని అందరికీ తెలుసు.. ఆయన మనుషులే నకిలీ మద్యం ఫ్యాక్టరీలు నడిపి వాళ్ల షాపుల్లోనే అమ్మకాలు జరిగాయని ఆధారాలు ఉన్నాయి.. జయచంద్రారెడ్డి, జనార్ధన్ ఇద్దరికీ ఆఫ్రికాలో వ్యాపారాలు ఉన్నాయి.. ఎలక్షన్ అఫిడవిట్ లో కూడా జయచంద్రారెడ్డి తనకు ఆఫ్రికాలో వ్యాపారాలు ఉన్నాయని స్పష్టంగా ఇచ్చారని తెలిపారు.. రాష్ట్రంలో మద్యం విచ్చలవిడిగా ఉందని చంద్రబాబు ఒప్పుకున్నారు.. కట్టుదిట్టం చేస్తామని చెప్పారే కానీ పట్టించుకోలేదన్నారు సజ్జల రామకృష్ణారెడ్డి.. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం మద్యం షాపులు పొందిన టీడీపీ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తుంది.. జోగి రమేష్ అరెస్ట్ వ్యవహారం అసలు నియంతల పాలనలో కూడా ఉండదు అన్నారు. రాష్ట్రంలో లోకేష్ రెడ్ బుక్ పాలనలో వ్యవస్థలు నీరుగారిపోతున్నాయి.. తమ స్వప్రయోజనాల కోసం ప్రత్యర్థుల గొంతుక వినిపించకూడదు అని ఇష్టం వచ్చినట్లు చేస్తున్నారు..

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# స్పోర్ట్స్



## షెఫాలీ వర్మ అరుదైన రికార్డులు

మహిళల వన్డే ప్రపంచ కప్ 2025 ఫైనల్లో అరుదైన రికార్డును టీమిండియా ఓపెనర్ షఫాలీ వర్మ చేజార్చుకుంది. నవంబర్ 2న నవీ ముంబైలోని డివై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచులో ఇండియా స్టార్ ఓపెనర్ షెఫాలీ వర్మ ఫైనల్‌లో సెంచరీ చేయడంలో విఫలమైంది. అయితే షఫాలీ 87 పరుగులు చేసి మహిళల వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డు తన ఖాతాలో వేసుకుంది. ఫైనల్‌లో సెంచరీ చేసింటే ఈ ఘనత సాధించిన తొలి భారతీయ క్రికెటర్ రికార్డు ఆమె ఖాతాలో చేరేది. ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్లో దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో భారత్ విజయం సాధించింది. 2017 వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో భారత ఓపెనర్ పూనం రౌత్ చేసిన 86 పరుగులే ఇప్పటివరకూ అత్యధికం. తాజాగా షఫాలీ వర్మ 87 పరుగులతో వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో అత్యధిక వ్యక్తిగత పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా నిలిచింది. ఈ మ్యాచులో షఫాలీ వర్మ బంతితోనూ అద్భుతం చేసింది. కీలక సమయంలో బౌలింగ్ చేసి రెండు వికెట్లు పడగొట్టింది. వరల్డ్ కప్ ఫైనల్లో రెండో వేగవంతమైన హాఫ్ సెంచరీ చేసింది. వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో హాఫ్ సెంచరీ చేసిన యంగెస్ట్ ఉమెన్ బ్యాటర్‌గా షఫాలీ వర్మ రికార్డులు క్రియేట్ చేసింది. భారత విధ్వంసకర ఓపెనర్ షెఫాలీ వర్మ దక్షిణాఫ్రికాతో జరిగిన ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌లో 78 బంతుల్లోనే 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 87 పరుగులు చేసింది. షెఫాలీ దూకుడుగా ఆడుతూ ఇండియాకు మంచి ఆరంభం ఇచ్చింది. మరో ఓపెనర్ స్మృతి మంధానాతో కలిసి మొదటి వికెట్‌కు 104 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. షెఫాలీ తన దూకుడైన బ్యాటింగ్‌తో దక్షిణాఫ్రికాను ఒత్తిడిలోకి నెట్టింది. ఈ క్రమంలో షఫాలీ.. అయాబోంగా ఖాకా బౌలింగ్‌లో సునే లూస్‌కు క్యాచ్ ఇచ్చి ఔటైంది.

## ప్రపంచ విజేతలపై ప్రశంసల వర్షం

భారత్ ప్రపంచ ఛాంపియన్?గా నిలిచింది. ఫైనల్?లో సౌతాఫ్రికాను ఓడించి సగర్వంగా కప్పును ముద్దాడంది. దీంతో ప్రపంచ కప్ గెలిచిన భారత మహిళాల జట్టుపై ప్రశంసల జల్లు కురుస్తుంది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ టీమ్?ఇండియాకు అభినందనలు తెలిపారు. మహిళల జట్టు అసమాన ప్రతిభ, అద్వితీయ ప్రదర్శనకు తగిన ఫలితం లభించిందని మోదీ అన్నారు. విశ్వవిజేతగా నిలిచిన భారత జట్టుకు అభినందనలు తెలిపిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము భారత అమ్మాయిలు చరిత్ర సృష్టించారని ఎక్స్ వేదికగా కొనియాడారు. 'మహిళల అసమాన ప్రతిభ, అద్వితీయ ప్రదర్శనకు తగిన ఫలితం లభించింది. ఈ గెలుపు మహిళల క్రికెట్‌ను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళుతుంది. ఫైనల్‌లో గొప్ప నైపుణ్యం, ఆత్మవిశ్వాసంతో ప్రదర్శన చేశారు. ప్లేయర్లందరికీ శుభాకాంక్షలు. ఈ చరిత్రాత్మక విజయం భవిష్యత్ తరాలను క్రీడలవైపు మళ్లిస్తుంది' అని మోదీ ట్వీట్ చేశారు. 'టోర్నీ ఆసాంతం ఆటగాళ్లు అసాధారణ సమష్టి కృషి, పట్టుదలను ప్రదర్శించారని మెచ్చుకున్నారు. ఈ చారిత్రాత్మక విజయం భవిష్యత్తు ఛాంపియన్లకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. భారత జట్టుకు శుభాకాంక్షలు' తెలిపిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా. "ఈ విజయం లక్షలాది మంది అమ్మాయిలకు స్ఫూర్తిదాయక మార్గాన్ని సుగమం చేస్తుందన్నారు. ఉమెన్ ఇన్ బ్లూ చరిత్ర సృష్టించింది"– లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. 'అమ్మాయిల తెగువ, పోరాటం భారత్‌కు కీర్తిని తెచ్చిపెట్టాయని, వారు కేవలం ట్రోఫీని మాత్రమే పొందలేదని జాతీయ స్ఫూర్తిని రగిల్చారని ప్రశంసించారు. అమ్మాయిలు కేవలం కప్పును గెలుచుకోవడమే కాదు ప్రతి భారతీయుడి హృదయాన్ని గెలుచుకున్నారని' కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొనియాడారు. భారత మహిళా క్రికెట్ ప్రయాణంలో ఇదోక అద్భుతమైన క్షణమని క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ అన్నాడు. దేశంలోని యువతులకు ఈ విజయం ప్రేరణగా నిలుస్తుందన్నారు. నిర్భయంగా, నమ్మకంతో ఆడిన ఆట ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేసిందని స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ అన్నాడు. ప్రశంసలకు వారంతా పూర్తి అర్హులు అని ఈ విజయం రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. రెండు దశాబ్దాల కలను హర్మన్‌ప్రీత్ బృందం నిజం చేసిందని భారత మహిళ క్రికెట్ దిగ్గజం మిథాలీ రాజ్ అన్నారు. చారిత్రాత్మక విజయం సాధించిన భారత జట్టుకు ఐసీసీ ఛైర్మన్ జై షా అభినందనలు తెలిపారు. భారత మహిళల క్రికెట్ ప్రయాణం అద్భుతంగా సాగుతోందన్నారు. విజేతగా నిలిచిన భారత జట్టుకు గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ అభినందనలు తెలిపారు. హర్మన్ బృందం భారత మహిళ క్రికెట్‌లో సరికొత్త అధ్యాయాన్ని లిఖించిందని మైక్రోసాఫ్ట్ సత్య నాదేళ్ల కొనియాడారు. మ్యాచ్‌ను ఆస్ట్రేలియాలో సిరీస్ ఆడుతున్న భారత పురుషుల జట్టు చాలా ఆసక్తికరంగా వీక్షించింది. కోచ్ గౌతమ్ గంభీర్, పేసర్ బుమ్రా, రింకు సింగ్ తదితరులు మ్యాచ్ చూస్తున్న దృశ్యాన్ని బీసీసీఐ షేర్? చేసుకున్నారు.

## ఈ కల కోసం 20 ఏళ్లు ఎదురుచూశా..

### విజయంపై మిథాలీ రాజ్ ఎమోషనల్ పోస్ట్

భారత మహిళా క్రికెట్ జట్టు తొలిసారిగా ఐసీసీ ప్రపంచకప్ టైటిల్‌ను గెలుచుకోగానే, రెండు దశాబ్దాలుగా ఆ కలను మోసిన దిగ్గజ క్రీడాకారిణి, మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ భావోద్వేగానికి లోనయ్యారు. ఆదివారం నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో జరిగిన థ్రిల్లింగ్ ఫైనల్‌లో భారత్ 52 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించి విశ్వ విజేతగా నిలిచింది. 2005, 2017లో భారత్‌ను రెండు ప్రపంచకప్ ఫైనల్స్‌కు నడిపించిన మిథాలీకి, ఈ విజయం ఆమె జీవితకాలపు స్వప్నం నెరవేరిన మధుర క్షణం. రెండు దశాబ్దాలకు పైగా భారత మహిళా క్రికెట్‌కు సేవ చేసిన దిగ్గజ బ్యాటర్ మిథాలీ రాజ్, జట్టు ప్రపంచకప్ గెలిచిన వెంటనే తన భావోద్వేగాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. "వరల్డ్ ఛాంపియన్.. భారత మహిళల జట్టు ఆ ప్రపంచకప్ ట్రోఫీని ఎత్తుకోవడం చూడాలని నేను రెండు దశాబ్దాలకు పైగా ఈ కల చూశాను. నేడు ఆ కల ఎట్టకేలకు నిజమైంది" అని మిథాలీ %శ%లో పోస్ట్ చేశారు. "2005లో గుండె పగిలిన బాధ నుంచి 2017లో పోరాటం వరకు.. ప్రతి కన్నీరు, ప్రతి త్యాగం, ఇక్కడ మనం ఉన్నామని నమ్మి బ్యాట్ పట్టిన ప్రతి యువతి.. ఇవన్నీ ఈ క్షణానికి దారితీశాయి. మీరు కేవలం ఒక ట్రోఫీని గెలవలేదు, భారత మహిళల క్రికెట్ కోసం కొట్టుకున్న ప్రతి హృదయాన్ని మీరు గెలిచారు. జై హింద్" అని మిథాలీ ముగించారు. మిథాలీ రాజ్ పోరాట పటిమ, మహిళా క్రికెట్‌కు ఆమె చేసిన అసాధారణ కృషిని హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని జట్టు గుర్తించింది. విజయోత్సవ ర్యాలీ సమయంలో హర్మన్‌ప్రీత్ కౌర్ జట్టు సభ్యులు ప్రపంచకప్ ట్రోఫీని మిథాలీ రాజ్ చేతికి అందించారు. తమ విజయం ఆమె కృషికి దక్కిన ఫలితమేనని ఆటగాళ్లు కీర్తించారు. ఈ చారిత్రక విజయం తర్వాత మిథాలీ మీడియాతో మాట్లాడుతూ.. "భారత్ ఎట్టకేలకు ప్రపంచకప్ గెలవడం పట్ల నేను చాలా సంతోషంగా, భావోద్వేగంగా ఉన్నాను. ఇది సంవత్సరాలుగా మేమంతా ఎదురుచూస్తున్న విషయం చివరకు మేము దానిని చూశాం" అని అన్నారు. భారత జట్టు అమోల్ మజుందార్ కోచ్‌గా, హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా గ్రూప్ దశలో మూడు వరుస ఓటముల నుంచి పుంజుకుని చరిత్ర సృష్టించడం విశేషం. ఫైనల్‌లో భారత్ తొలుత బ్యాటింగ్ చేసి 298/7 పరుగులు చేసింది. షఫాలీ వర్మ (87), దీప్తి శర్మ (58) కీలక ఇన్నింగ్స్‌లు ఆడగా, స్మృతి మంధాన, రిచా ఘోష్ కూడా పటిష్టమైన సహకారాన్ని అందించారు. అనంతరం దీప్తి శర్మ బంతితో అద్భుత ప్రదర్శన చేస్తూ 5/39 వికెట్లు తీసి సౌతాఫ్రికాను ఆలౌట్ చేసింది. రెండు దశాబ్దాలకు పైగా మిథాలీ, మిలియన్ల మంది అభిమానులు చూసిన కల ఈ విజయం ద్వారా పూర్తయింది.



## యువరాజ్ సింగ్ నా ఆరాధ్య క్రికెటర్

### లెఫ్టార్మ్ స్పిన్నర్ నల్లపురెడ్డి శ్రీచరణి

దిగ్గజ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ తన ఆరాధ్య క్రికెటర్ అని టీమిండియా మహిళల జట్టు లెఫ్టార్మ్ స్పిన్నర్ నల్లపురెడ్డి శ్రీచరణి తెలిపింది. యువరాజ్ సింగ్ కొట్టిన 6 బంతుల్లో 6 సిక్స్‌ల వీడియోను లెక్కలేనన్ని సార్లు చూశానని చెప్పింది. యువరాజ్ సింగ్‌లా సిక్స్‌లు కొట్టడం తన కోరిక అని ఈ కడప అమ్మాయి తన మనసులోని మాటను బయట పెట్టింది. మహిళల వన్డే ప్రపంచకప్ 2025 గెలిచిన హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టులో నల్లపు రెడ్డి శ్రీచరణి కీలక సభ్యురాలు. ఈ లెఫ్టార్మ్ స్పిన్నర్ అద్వితీయమైన ప్రదర్శనతో భారత విజయంలో కీలక పాత్ర పోషించింది. 9 మ్యాచ్‌ల్లో 4.96 ఎకానమీతో 14 వికెట్లు పడగొట్టింది. అత్యుత్తమ ప్రదర్శన(3/41). దీప్తి శర్మ(19) తర్వాత భారత తరఫున సెకండ్ హయ్యెస్ట్ వికెట్ టేకర్‌గా నిలిచింది. ప్రత్యర్థికి పరుగులివ్వకుండా కట్టడి చేయడం శ్రీచరణి ప్రత్యేకత. ఫైనల్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పూర్తిగా శ్రీచరణిపైనే ఆధారపడింది. ఒక ఎండ్‌లో శ్రీ చరణితో కట్టడిగా బౌలింగ్ చేయించి.. మరో ఎండ్‌లో వికెట్ల కోసం హర్మన్ ప్రయత్నించింది. సౌతాఫ్రికా బ్యాటర్ బోష్‌ను శ్రీ చరణి డకౌట్‌గా పెవిలియన్ చేర్చిన తీరు అద్భుతం. 21 ఏళ్ల వయసులోనే ఎలాంటి ఒత్తిడి లేకుండా సరైన లైన్ అండ్ లెంగ్త్‌లో బౌలింగ్ చేసిన శ్రీ చరణి అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఈ టోర్నీ ప్రారంభానికి ముందు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో శ్రీ చరణి తన ఆరాధ్య క్రికెటర్ ఎవరో చెప్పింది. యువరాజ్ సింగ్‌తో పాటు స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా తన ఫేవరేట్ క్రికెటర్లని తెలిపింది. 'క్రికెట్‌లో యువరాజ్ సింగ్, స్మృతి మంధాన, హర్మన్, జెమీమా అంటే నాకు చాలా ఇష్టం. యువరాజ్ సింగ్ ఆరు బంతుల్లో ఆరు సిక్సులు కొట్టిన వీడియో అయితే ఇప్పటివరకు ఓ లక్ష సార్లు చూడొచ్చు. ఎప్పటికైనా యువరాజ్ సింగ్‌లా సిక్సర్లు కొట్టాలనేది నా కోరిక. ప్రస్తుతానికైతే బౌలింగ్ పైనే ఫోకస పెట్టాను. జట్టు అవసరానికి తగ్గట్టు బ్యాటింగ్‌లోనూ సత్తా చాటడానికి ప్రయత్నిస్తాను.'అని చెప్పుకొచ్చింది. ఆంధ్రప్రదేశ్, కడప జిల్లాలోని యర్రంపల్లి గ్రామానికి చెందిన శ్రీచరణి అనూహ్యంగా క్రికెట్‌వైపు అడుగులు వేసింది. ఆమె జీవిత ప్రయాణం గురించి వింటే ప్రపంచకప్ గెలిపించడానికే ఆమె క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకుందా అనిపిస్తోంది. శ్రీ చరణి తొలుత ఖోఖోలో జాతీయస్థాయిలో రాణించింది. అథ్లెటిక్స్‌లోనూ అవకాశం అందుకుంది. కానీ పదోతరగతి చదువుతున్న సమయంలో క్రికెట్‌పై ఉన్న మక్కువతో ఈ ఆటను కెరీర్‌గా ఎంచుకుంది. ముందుగా తన నిర్ణయాన్ని తండ్రి చంద్రశేఖర రెడ్డి, తల్లి రేణుక వ్యతిరేకించారు. కానీ కూతురు పట్టుదల చూసి ఆ దిశగా ప్రోత్సహించారు.

## చరిత్ర సృష్టించిన హర్మన్‌ప్రీత్ కౌర్

ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో భారత మహిళల జట్టు సాధించిన చారిత్రక విజయాన్ని రాబోయే తరాలు గుర్తుంచుకుంటాయి. 1983లో కపిల్ దేవ్ నాయకత్వంలో పురుషుల జట్టు సాధించిన అద్భుతాన్ని హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత మహిళల జట్టు పునరావృతం చేసింది. ఈ విజయంతో హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా ఓ అరుదైన ప్రపంచ రికార్డును నెలకొల్పింది. మహిళల క్రికెట్ చరిత్రలో హర్మన్‌ప్రీత్ కౌర్ వన్డే అంతర్జాతీయ (%వాణ×%) ప్రపంచ కప్‌ను గెలిచిన అత్యధిక వయస్సు గల కెప్టెన్‌గా చరిత్ర సృష్టించింది. హర్మన్‌ప్రీత్ కౌర్ 36 సంవత్సరాల, 239 రోజుల వయస్సులో ఈ అద్భుతమైన విజయాన్ని సాధించింది. మహిళల క్రికెట్‌లో ఏ కెప్టెన్ కూడా ఇంత ఎక్కువ వయస్సులో ప్రపంచ కప్‌ను గెలుచుకోలేదు. మహిళల ప్రపంచ కప్ 2025లో హర్మన్‌ప్రీత్ తన బ్యాటింగ్‌తో కూడా జట్టుకు అండగా నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో హర్మన్?ప్రీత్ కౌర్ 9 మ్యాచ్‌లలో 8 ఇన్నింగ్స్‌లలో 32.50 సగటుతో మొత్తం



260 పరుగులు చేసింది. ఆమె స్ట్రైక్ రేట్ 89.04గా ఉంది. ఐసీసీ మహిళల వన్డే వరల్డ్ కప్ నాకౌట్ మ్యాచ్‌లలో అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా ఆస్ట్రేలియాకు చెందిన బెలిండా క్లార్క్ రికార్డును కూడా హర్మన్‌ప్రీత్ అధిగమించింది. చారిత్రక విజయం తర్వాత హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడింది. "ఇది ఒక గొప్ప విజయం, ఈ ఘనత మొత్తం జట్టు కృషికి దక్కుతుంది. బీసీసీఐ, సహాయక సిబ్బంది జట్టుపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు. ఇది ముగింపు కాదు, మొదలు మాత్రమే. వచ్చే ఏడాది మరో ప్రపంచ కప్ ఉంది, ఛాంపియన్స్ ట్రోఫీ కూడా ఉంది. మేము మా అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలనుకుంటున్నాము." అని ఆమె అన్నారు. ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ ఈ విజయాన్ని 1983లో పురుషుల జట్టు కపిల్ దేవ్ నాయకత్వంలో సాధించిన ప్రపంచ కప్ విజయంతో పోల్చారు. "భారత మహిళల క్రికెట్‌కు ఇది ఒక చిరస్మరణీయమైన రోజు. 1983లో పురుషుల జట్టు సాధించిన ఘనతను భారత మహిళలు ముంబైలో పునరావృతం చేశారు. ఈ చారిత్రక విజయం దేశంలో మహిళల క్రికెట్‌కు భారీ ప్రోత్సాహాన్ని ఇచ్చి, కొత్త శిఖరాలను చేరుకునేలా చేస్తుంది." అని ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ స్పష్టం చేశారు.



## భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలిచారు

### ట్వీట్ చేసిన టీమిండియా క్రికెటర్ కోహ్లీ

మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో విజేతగా నిలిచిన భారత మహిళల జట్టుపై టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ప్రశంసల జల్లు కురిపించాడు. ఈ విజయంతో ఎన్నో తరాలకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడాడు. ఈ గెలుపుతో ప్రతీ భారతీయుడు గర్వ పడుతున్నాడని, ఈ విజయానికి భారత అమ్మాయిలు పూర్తి అర్హులని పేర్కొన్నాడు. ఈ మేరకు కోహ్లీ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్‌ను షేర్ చేశాడు. ప్రపంచకప్‌తో ఉన్న మహిళల జట్టు ఫొటోను కూడా పంచుకున్నాడు.'భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలిచారు. మీ ఫియర్‌లెస్ క్రికెట్, ఆత్మ



విశ్వాసంతో ప్రతి భారతీయుడి గర్వించేలా చేశారు. మీరు అన్ని ప్రశంసలకు అర్హులు. ఈ క్షణాన్ని పూర్తి స్థాయిలో ఆస్వాదించండి. హర్మన్ సేన అద్భుత ప్రదర్శన కనబర్చింది. జై హింద్.'అని విరాట్ కోహ్లీ ట్వీట్ చేశాడు. విరాట్ కోహ్లీతో పాటు క్రీడా, సినీ, రాజకీయ ప్రముఖులు కూడా భారత విజయాన్ని సోషల్ మీడియా వేదికగా కొనియాడారు.'1983 సంవత్సరం ఒక తరాన్ని పెద్ద కలలు కనడానికి, వాటిని నెరవేర్చుకునేందుకు స్ఫూర్తినిచ్చింది. నేడు మన మహిళల క్రికెట్ అద్భుతమైన విజయాన్ని అందుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న యువతులు బ్యాట్, బాల్ పట్టి మైదానంలో అడుగుపెట్టడానికి, తాము కూడా ఒక రోజు ట్రోఫీని గెలవగలమనే నమ్మకం కలిగిలే ఈ విజయం స్ఫూర్తినిచ్చింది. భారత మహిళల క్రికెట్ ప్రయాణంలో ఇది ఒక చారిత్రాత్మక ఘట్టం. టీమిండియా చాలా బాగా ఆడింది. దేశం మొత్తం గర్వపడేలా చేసింది.'అని సచిన్ ట్వీట్ చేశాడు. భారత మహిళల జట్టు కేవలం చరిత్ర సృష్టించలేదని, భవిష్యత్తులో ఆడపిల్లలకు స్ఫూర్తినిచ్చే ఒక మహత్తర వారసత్వాన్ని నెలకొల్పారని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నాడు. 'భారత క్రికెట్‌కు ఇదో చారిత్రక ఘట్టం. మన మహిళల జట్టు పట్టుదల, ఓర్పు, విశ్వాసంతో ఏదైనా సాధిస్తుందని ప్రపంచానికి చూపించారు. వారికి నా అభినందనలు'అని టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ట్వీట్ చేశాడు. 'ఈ జట్టు చూపిన అసాధారణ ధైర్యం, విశ్వాసం అద్భుతం. మీరు దేశం మొత్తాన్ని గర్వపడేలా చేశారు. ఛాంపియన్స్, మీకు హృదయపూర్వక అభినందనలు'అని టీమిండియా వన్డే, టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ పేర్కొన్నాడు.

## పెరిగిన మహిళా క్రికెటర్ల బ్రాండ్ విలువ

?కప్? ఫైనల్?లో భారత మహిళల క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. 52 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను మట్టికరిపించి తొలిసారిగా విశ్వవిజేతగా నిలిచింది. పురుష క్రికెటర్ల మాదిరిగానే తమ ప్రభావాన్ని చూపి వన్డే ప్రపంచకప్‌ను తమ సొంతం చేసుకుంది భారత మహిళా జట్టు. తమ సత్తా ఏంటో ప్రపంచానికి చాటి చెప్పింది. ఈ విజయంతో మహిళా క్రికెటర్లపై దేశవ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుసింది. వరల్డ్‌కప్ విజయంతో టీమ్‌ఇండియా మహిళా క్రికెటర్లకు గౌరవం, గుర్తింపు మాత్రమే కాకుండా, వాణిజ్య విలువ కూడా ఆకాశాన్నంటింది. ఇప్పుడు వీరిని బ్రాండ్ ప్రపంచం కొత్త స్టార్‌లుగా చూస్తోంది. మొత్తంగా చూస్తే ఈ ప్రపంచ కప్? విజయం భారత మహిళా క్రీడాకారిణులకు ఒక కొత్త శకానికి నాంది పలికింది. మహిళా వరల్డ్‌కప్ ఫైనల్ ముగిసిన 24 గంటల వ్యవధిలోనే హర్మన్‌ప్రీత్, స్మృతి మంధాన, షెఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ వంటి ఆటగాళ్ల బ్రాండ్ విలువలు 25 నుంచి 100 శాతం వరకూ పెరిగినట్లు సమాచారం. అదే సమయంలో వీరి సోషల్ మీడియా ఫాలోవర్లు కూడా విపరీతంగా పెరిగారు. సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాపై అద్భుత ప్రదర్శనతో 127 పరుగులు (134 బంతుల్లో, 14 ఫోర్లతో) చేసి నాటౌట్‌గా నిలిచిన జెమీమా రోడ్రిగ్స్ ప్రస్తుతం అత్యంత డిమాండ్‌లో ఉన్న మహిళా స్టార్ క్రికెటర్?గా ముందంజలో ఉంది. సెమీ ఫైనల్? ముగిసిన తర్వాత ఆమెకు బ్రాండ్?ల నుంచి విపరీతమైన ఆసక్తి కనిపించింది. ఆమె బ్రాండ్ విలువ 100 శాతం పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడు ఆమె ఒక్కో బ్రాండ్‌కు రూ.75 లక్షల నుంచి రూ.1.5 కోట్ల వరకు ఛార్జ్ చేస్తోందట. జెమీమా ఇప్పటికే రెడ్‌బుల్, బోట్, సర్ఫ్ఎక్స్‌ఎల్



వంటి ప్రముఖ బ్రాండ్‌లకు అంబాసడర్‌గా వ్యవహరిస్తోంది. దేశంలో అత్యధిక పారితోషికం పొందుతున్న మహిళా క్రికెటర్‌గా స్మృతి మంధాన కొనసాగుతోంది. ప్రస్తుతం ఆమె రక్సోనా, నైక్, హ్యుందాయ్, హెర్బాలైఫ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గల్ఫ్ ఆయిల్, పీఎన్‌బీ మెట్‌లైఫ్ ఇన్సూరెన్స్ వంటి 16 ప్రముఖ బ్రాండ్‌లకు అంబాసడర్‌గా ఉంది. ఒక్కో బ్రాండ్ ఎండార్స్‌మెంట్ ద్వారా రూ.1.5 నుంచి రూ.2 కోట్ల వరకు సంపాదిస్తున్నట్లు తెలిసింది. మొదటి సారిగా ఐసీసీ ప్రపంచ కప్?ను గెలుచుకున్న తర్వాత మైదానంలో భావోద్వేగపూరితమైన దృశ్యం ఆవిష్కృతమైంది. గెలుపు అనంతరం భారత మహిళా జట్టు కెప్టెన్ హర్మన్?ప్రీత్ ?కోచ్? అమోల్? మజుందార్? పాదాలను తాకి నమస్కరించింది. దీంతో భారత గురు– శిష్య సంప్రదాయానికి నిలువెత్తు నిదర్శనంగా ఈ చర్య నిలిచింది. మజుందార్? వెంటనే ఆమెను ఆప్యాయంగా పైకిలేపారు. కాగా ఈ విజయం కోచ్?, కెప్టెన్? ఇద్దరి కళ్లలో ఆనంద బాష్పాలను నిపింది.

## హిందూపురంలో వందేభారత్ స్టాప్

### వెల్లడించిన ఎంపి బికె పార్థసారథి

**హిందూపురం,**

వందే భారత్ రైలు పది రోజుల్లోపు హిందూపురంలో ఆగుతుందని ఎంపీ బీకే పార్థసారథి తెలిపారు. హిందూపురానికి వచ్చిన ఆయన విలేకరలుతో మాట్లాడారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, తాను రైల్వేశాఖ సహాయమంత్రి సోమన్నతో మాట్లాడామని తెలిపారు. హిందూపురంలో వందే భారత్ రైలును ఆపేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని అన్నారు. రైల్వే స్టేషన్‌లో ఆధునికీకరణ పనులు చేపడుతున్నామని అన్నారు. బళ్లారి నుంచి మడకశిర మీదుగా రైల్వే ట్రాక్ పనులు వేగంగా సాగుతాయని అన్నారు. చాకర్లపల్లి రైల్వే గేటువద్ద ÷÷-ల ఓవర్ బ్రిడ్జి పనులు త్వరలో ప్రారంభం అవుతాయని, దీనికి రూ.29 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఏడాదిలోపే పనులు పూర్తవుతాయని అన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని, రూ.92 కోట్లతో పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం అవుతాయని అన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, పార్టీ కన్వీనర్ శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు ఆనంద్, చంద్రమోహన్, పట్టణాధ్యక్షులు వెంకటేశ్, మంగేష్ తదితరులు పాల్గొన్నారు.

## యూపిలో ఘోర రోడ్డు ప్రమాదం

### కారును ఢీకొన్న ట్రక్కు..ఆరుగురు దుర్మరణం

**లక్నో,**

ఉత్తరప్రదేశ్‌లో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బారాబంకిలోని దేవా-ఫతేపూర్ రహదారిపై ట్రక్కు కారును బలంగా ఢకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. ఇద్దరికి గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి బారాబంకి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అర్పిత్ విజయవర్గియ తెలిపిన వివరాల ప్రకారం.. ఎనిమిది మందితో వెళుతున్న కారును దేవా పోలీస్ స్టేషన్ ప్రాంతంలో ట్రక్కు బలంగా ఢకొ?ట్టింది. దీంతో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఆరుగురు మృతి చెందారు. మెరుగైన చికిత్స కోసం ఇద్దరినీ వేరే ఆసుపత్రికి తరలించాము. కారు, ట్రక్కు రెండు వాహనాలు వ్యతిరేక దిశలో వస్తున్నాయి. అందువల్లే ఈ ప్రమాదం జరిగింది అని ఆయన అన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని టీచర్‌కు గాయాలు

**అల్లూరి,**

మక్కువ మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద సాలూరు నుండి వయా మామిడిపల్లి మీదుగా దుగ్గేరు వెళ్లేందుకు వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మక్కువ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఆకుల తవిటి నాయుడు గాయపడ్డారు. మంగళవారం తవిటి నాయుడు మధ్యాహ్నం ఇంటికి సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చి తిరిగి వెళుతుండగా, అదే సమయంలో దుగ్గేరు వెళ్లేందుకు మక్కువ ప్రధాన రహదారి వద్ద డ్రైవర్ బస్సును టర్న్ తీసుకోను సందర్భంలో అతనిని ఢకొన్నట్లు తెలుస్తుంది. కవిటి నాయుడు కాలుకు తీవ్ర గాయం కావడంతో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించిన ట్లు సమాచారం. పోలీసులు దర్యాప్తులో మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## విజయగరంలో స్వల్ప ప్రకంపనలు

**విజయనగరం,**

విజయనగరం పట్టణ, మండల పరిధిలో మంగళవారం వేకువజామున 4 గంటల 19 నిమిషాల సమయంలో భూమి కొన్ని సెకండ్ల పాటు కనిపించినట్లు స్థానికులు తెలిపారు. ఆ సమయంలో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. విజయనగరం పట్టణ ప్రాంతం ఆర్ఎంబి జంక్షన్ , కేఎల్ పురం, టౌన్ లో మరికొన్ని ప్రాంతాల్లోను, విజయనగరం మండల పరిధిలో ముడుదాం, అంబటి వలస , చెల్లూరు మరికొన్ని గ్రామాల్లో కూడా భూమి కనిపించినట్లు ప్రజలు తెలిపిన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## రైతుల త్యాగంతోనే అమరావతి నిర్మాణం

### తుళ్లూరులో డీఎస్పీ కార్యాలయం ప్రారంభం

### ఫేక్ వీడియోలు సృష్టిస్తే కేసులు తప్పవన్న అనిత

**అమరావతి,**

రైతుల త్యాగంతోనే రాజధాని అమరావతి నిర్మాణం జరుగుతోందని రాష్ట్ర హోంమంత్రి అనిత అన్నారు. తుళ్లూరులో డీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమరావతి నిర్మాణం పూర్తిచేస్తాం. పోలీసులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. వారి ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యమిస్తాం. ప్రతిపక్షాల ఆరోపణలను దీటుగా ఎదుర్కొంటాం. పోలీసులపై తప్పుడు ప్రచారం చేయడం తగదు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులను సహించం. పోలీసులకు నూతన సాంకేతికతను అందిస్తాం. 6100 పోస్టులను భర్తీ చేస్తున్నాం అని అనిత అన్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ... తుళ్లూరు పోలీస్ సభ డివిజన్ కొత్త ఆఫీస్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందని.. దీని గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలని అన్నారు. 2014లో సీఎం చంద్రబాబు అమరావతి నిర్మాణం ప్రారంభించారని గుర్తుచేశారు. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ కార్యాలయం పూర్తి కాకుండా ఉందని తెలిపారు. రాజధాని కొరకు రైతులు ఉచితంగా భూములు త్యాగం చెయ్యడం గొప్ప విషయమన్నారు. అమరావతి రైతుల కష్టం.. ప్రతి ఫలమే ఇవాళ అందరూ చూస్తునారని హోంమంత్రి అన్నారు. ఈ బిల్డింగ్ పూర్తి చేయడానికి ఎస్పీ వకుల్ జిందల్, డీఎస్పీ మురళీ కృష్ణ చాలా కృషి చేశారని కొనియాడారు. పోలీస్ వ్యవస్థను బాగా బలోపేతం చేసేందుకు డీజీపీ కృషి చేస్తున్నారని తెలిపారు. పోలీసులకు కావాల్సిన అన్ని ఫెసిలిటీస్ కూడా ఈ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని చెప్పారు. పోలీసులకు కోటి రూపాయలు వరకు భీమా కల్పిచామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే 6100 మంది కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక్క కానిస్టేబుల్ ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు. పోలీసు చనిపోతే.. వారి కుటుంబానికి అండగా ఉంటామని.. భీమా ద్వారా కనిష్టంగా రూ.15 లక్షలు ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. ఈ సబ్ డివిజన్‌లో సిబ్బంది కొరత ఉందని.. త్వరలో అన్నీ ఫుల్ ఫిల్ చేస్తామని హోంమంత్రి స్పష్టం చేశారు. కల్పిత వీడియోల ద్వారా చాలా మంది ఇబ్బంది పెడుతున్నారని.. అలాంటి వాటిని ఏపీ పోలీసులు సమర్థవంతంగా ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ మధ్య కాలంలో ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓ లారీపై రాళ్లు వేసిన వీడియోను.. ఆంధ్రప్రదేశ్‌లో జరిగినట్లు వైసీపీ ప్రచారం చేసిందని మండిపడ్డారు. ఇలాంటి తప్పుడు వార్తలను ఏపీ పోలీసులు సమర్థవంతంగా ఎదుర్కొన్నారని తెలిపారు. టెక్నాలజీ ఉపయోగించి.. తప్పుడు వార్తలు స్ప్రెడ్ కాకుండా చూడాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

### మరోమారు స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**హైదరాబాద్,**

గత కొన్ని రోజులుగా బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. సోమవారం స్వల్పంగా పెరిగి రూ.1.23 లక్షల మార్కు దాటిన బంగారం ధర మంగళవారం మళ్లీ దిగొచ్చింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో దేశంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.710 మేర తగ్గి రూ.1,22,460కు చేరుకుంది. 22 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధరలో రూ.650 మేర కోత పడి రూ..1,12,250కు దిగింది. వెండి ధర ఏకంగా రూ.3 వేల మేర తగ్గింది. ప్రస్తుతం కిలో వెండి రూ.1,51,000గా ఉంది .హైదరాబాద్, విజయవాడల్లో ప్రస్తుతం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,22,460గా ఉంది. 22 క్యారెట్ ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,12,250గా ఉంది.

# భద్రాచలం గ్రామ పంచాయతీలు తెలంగాణలో కలపాలి

### కేంద్ర హెూంమంత్రి అమిత్ షా,

### రెండు రాష్ట్రాల సీఎంలకు తుమ్మల లేఖ

### ఏపీలో జిల్లాల పునర్విభజన నేపథ్యంలో లేఖ

### భద్రాద్రి రాముడు

### తెలంగాణలో ...

### శ్రీ రాముడి భూములు ఆంధ్రాలో....

### పరిపాలనా సమస్యలు,గిరిజనుల ఇబ్బందులు

### డంపింగ్ యార్డ్ కు సైతం స్థలం లేని దుస్థితి

### చారిత్రక అనుబంధం ప్రస్తావించిన మంత్రి తుమ్మల

**అక్షర కలం/ ఖమ్మం బ్యూరో:**

కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా , తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు రేవంత్ రెడ్డి లకు తెలంగాణ వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు బుధవారం కీలక లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్లో జిల్లాల పునర్విభజన నేపథ్యంలో భద్రాచలం పరిసర ఐదు గ్రామాలను తెలంగాణ రాష్ట్రంలో కలపాలని, పునర్విభజన చట్టంలోని ఉభయ రాష్ట్రాల చర్చల సందర్భంగా ఈ అంశాన్ని సానుకూలంగా చర్చించి తెలుగు ప్రజల ముఖ్యంగా భద్రాద్రి, ఐదు గ్రామాల ప్రజల తీరని వేతలు తీర్చేలా ప్రత్యేక చొరవ చూపాలని మంత్రి తుమ్మల విన్నవించారు. పునర్విభజన చట్టంలోని భద్రాచలం పట్టణాన్ని ఆనుకుని ఉన్న యాటపాక, కన్నాయిగూడెం, పిచుకలపాడు, పురుషోత్తపట్నం, గుండాల పంచాయతీలను తిరిగి తెలంగాణ రాష్ట్రానికి చేర్చే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు.

### భద్రాచలం చారిత్రక



### అనుబంధం....

తుమ్మల లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం2014 రాష్ట్ర విభజన సమయంలో భద్రాచలం పట్టణం తెలంగాణలోకి వచ్చినప్పటికీ, దీని చుట్టుపక్కల ఉన్న ఐదు గ్రామ పంచాయతీలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపారని పేర్కొన్నారు.

### గిరిజనుల కష్టాలు

### అంతర్రాష్ట్ర తనిఖీలు

ఈ గ్రామాల ప్రజలు, ముఖ్యంగా ఆదివాసీ కుటుంబాలు, ఆరోగ్యం-విద్య-రవాణా వంటి అవసరాల కోసం సహజంగానే భద్రాచలం పైనే ఆధారపడుతున్నారని తుమ్మల వివరించారు. అయితే రాష్ట్ర సరిహద్దు మార్పుతో ప్రతి చిన్న పనికీ అంతర్రాష్ట్ర తనిఖీలు,వైద్య అత్యవసరాల్లో ఆలస్యం, పాఠశాలలు, హాస్టళ్లకు చేరడంలో ఇబ్బందులు,అభివృద్ధి పనుల్లో అధికార పరిధి గందరగోళం లాంటివి ప్రజలను తీవ్రంగా వేధిస్తున్నాయని మంత్రి తుమ్మల వెల్లడించారు.
తీవ్రవాద ప్రభావిత ప్రాంతం - సమన్వయ లోపం
ఈ మండలాల పరిధి ఎల్‌డబ్ల్యూఈ సున్నిత ప్రాంతం కావడంతో శాంతిభద్రతల సమన్వయంలో రెండు రాష్ట్రాలకు సవాళ్లు పెరిగాయని తుమ్మల తన లేఖలో స్పష్టం చేశారు. పరిపాలనా సులభతరం కోసం ఈ ప్రాంతం ఒకే రాష్ట్రానికి చెందడం ఉత్తమమని ఆయన అభిప్రాయపడ్డారు.

### దేవస్థానం భూములు ఏపీలో ....

ప్రసిద్ధ భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం తెలంగాణలో ఉండగా, అనుబంధ ఆలయ ఆస్తులు, భూములు పురుషోత్తపట్నం ఆంధ్రప్రదేశ్లో ఉండటం వల్ల రికార్డులు, పరిపాలన, అభివృద్ధి ప్రణాళికల్లో చిక్కులు ఎదురవుతున్నాయని తుమ్మల పేర్కొన్నారు.డంపింగ్ యార్డ్, ఇతర దేవాలయ అవసరాల కోసం భూములు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు ఉన్నాయని వివరించారు. ప్రస్తుతం భద్రాచలం పట్టణం మాత్రమే ఇక్కడ ఉందని ఐదు గ్రామాలను తెలంగాణలో కలిపి భద్రాచలానికి అనుసంధానం చేస్తే భద్రాద్రి రామయ్య ఆలయం అభివృద్ధి, గిరిజన సాంప్రదాయ చారిత్రాత్మక వైభవం అలారారుతుందన్నారు. ప్రస్తుతం తెలంగాణ మధ్యలో ఆంధ్ర మళ్ళీ తెలంగాణ ఉండటం వల్ల అనేక చిక్కులు ఎదురవుతున్నాయని ప్రస్తావించారు. ప్రజల దశాబ్దాల డిమాండ్ -రాజకీయ కోణం కాదని స్పష్టం గత పదేళ్లుగా ఈ గ్రామాల కలయికపై గిరిజన సమాజం, ప్రజా సంఘాలు,స్థానిక గ్రామ సభల నుంచి తరచూ అభ్యర్థనలు వస్తూనే ఉన్నాయని, ఇది రాజకీయ కోణం కాదని , పూర్తిగా ప్రజల మనోభావాలు, పరిపాలనా ప్రయోజనాలపై ఆధారపడిన డిమాండ్ అని తుమ్మల లేఖలో చెప్పారు.

### ఏపీ జిల్లాల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో పరిశీలించాలని అభ్యర్థన

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న జిల్లా సరిహద్దుల పునర్విభజన ప్రక్రియను దృష్టిలో ఉంచుకుని, ఈ ఐదు గ్రామాలను ఆంధ్రప్రదేశ్ నుంచి మినహాయించి, కేంద్ర ప్రభుత్వం సహకారంతో వాటిని తెలంగాణకు పునరుద్ధరించే అంశాన్ని పరిశీలించాలని తుమ్మల కోరారు.

### “ప్రజల దశాబ్దాల ఆకాంక్షకు న్యాయం చేయాలి” ౦ తుమ్మల విశ్వాసం

దశాబ్ద కాలంగా తెలంగాణ లోని భద్రాచలం ఐదు పరిసర గ్రామాల ప్రజలు ఆకాంక్ష నెరవేర్చేలా అటు కేంద్ర ప్రభుత్వం ఇటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెద్ద మనసుతో అంగీకరించాలని మంత్రి తుమ్మల అభ్యర్థించారు. రెండు రాష్ట్రాల కలసి పని చేసే భావంతో ఈ అంశం పరిష్కార దిశగా అడుగులు పడతాయని తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులు రెవిన్యూ శాంతి పద్ధతుల సమస్యలు పరిష్కారానికి ఈ అవకాశం ఎంతగానో ఉపయోగపడుతుందని తుమ్మల పేర్కొన్నారు. భద్రాద్రి రాముడు తెలంగాణలో భూములు మాత్రం ఏపీలో ఉండటంవల్ల రామయ్య సేవలకు తీవ్ర విఘాతం కలుగుతుందన్నారు. పునరుభజన చట్టం ఉభయ రాష్ట్రాల చర్చలలో కేంద్రం ప్రభుత్వం ఈ అంశాన్ని సానుకూలంగా చర్చించి భద్రాచలం పట్టణానికి పరిసర గ్రామాలను అనుసంధానం చేసేలా ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.

## దాడిచేసి డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న పోలీసులు

**హైదరాబాద్,**

ముషీరాబాద్‌లో ఓ వైద్యుడి ఇంట్లో డ్రగ్స్ పట్టుబడటం తీవ్ర కలకలం రేపుతోంది. దాదాపు మూడు లక్షల విలువైన డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ముగ్గురు యువకులతో కలిసి జాన్ పాల్ అనే డాక్టర్ ఢిల్లీ, బెంగళూరు నుంచి డ్రగ్స్ తెప్పించి అమ్మకాలు సాగిస్తున్నారు. ముషీరాబాద్‌లో ఓ ఇంట్లో ఉంటూ డ్రగ్స్ అమ్మకాలు జరుపుతున్నాడు. పక్కా సమాచారంతో డాక్టర్ ఇంట్లో సోదాలు జరిపిన ఎక్సైజ్ ఎస్టీఎఫ్‌బీ బృందానికి భారీగా డ్రగ్స్ లభించింది. వైద్యుడి ఇంట్లో డ్రగ్స్‌ను చూసి ఎక్సైజ్ పోలీసులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈజీగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ముగ్గురు స్నేహితులు కలసి డ్రగ్స్ దందా చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన ప్రమోద్, సందీప్, శరత్ అనే యువకులు.. బెంగుళూరు, ఢిల్లీ నుంచి డ్రగ్స్‌ను తీసుకొచ్చి.. డాక్టర్ జాన్‌పాల్ నివాసంలో పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. ఇందుకు డాక్టర్ సహకరించాడు. డాక్టర్ స్వయంగా డ్రగ్స్ వాడటంతో పాటు వాటిని అమ్మకాలు జరుపుతున్నట్లు ఎస్టీఎఫ్ టీం గుర్తించింది. డ్రగ్స్ దందాపై సమాచారం అందిన వెంటనే ఎస్టీఎఫ్ బృందం డాక్టర్ జాన్ పాల్ ఇంట్లో సోదాలు నిర్వహించారని.... ఈ సోదాల్లో భారీగా డ్రగ్స్ పట్టుబడినట్లు ప్రదీప్ తెలిపారు. డాక్టర్ జాన్ పాల్ ఇంట్లో ఓజి కుష్, ఎండిఎంఎ, ఎల్ఎస్‌డి బాస్ట్స్, కొకైన్, గుమ్మస్, హాసిస్ ఆయిల్‌ను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ డ్రగ్స్ విలువ రూ. మూడు లక్షలు ఉంటుందని తెలిపారు. అయితే డ్రగ్స్ తెప్పిస్తున్న ప్రమోద్, సందీప్, శరతులు ప్రస్తుతం పరారీలో ఉండగా.. వీరిపై కూడా కేసు నమోదు అయ్యింది.

## ఛత్తీస్‌ఘడ్‌లో ఎదురెదురుగా ఢీకొన్న ప్యాసింజర్ గూడ్స్ రైలు

**రాయపూర్,**

ఛత్తీస్‌గఢ్‌లో రెండు రైళ్లు ఢీకొన్నాయి. మంగళవారం బిలాస్‌పుర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పలువురు మృతి చెందినట్లు తెలుస్తోంది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో లాల్‌ఖదాన్ ప్రాంతంలో మెము ప్యాసింజర్-గూడ్స్ రైళ్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దాంతో పలు బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ప్రమాదంతో బిలాస్‌పుర్-హావ్‌డా లైన్ మార్గంలో రైళ్లరాకపోకలకు పూర్తి అంతరాయం ఏర్పడింది. దాంతో పలు సర్వీసులను రద్దు చేశారు. మరికొన్నింటిని దారిమళ్లించారు. ఈ ఘటన వల్ల ఆ మార్గంలో ఎలక్ట్రిక్ వైర్లు, సిగ్నల్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ప్రమాదంపై సమాచారం అందుకున్న అధికారులు ఘటనాస్థలికి చేరుకొని సహాయచర్యలు చేపట్టారు. వైద్య సిబ్బంది ప్రమాదస్థలికి చేరుకున్నారు. దెబ్బతిన్న కోచ్‌లను పట్టాల నుంచి తొలగిస్తున్నారు.

## శ్రీశైలంలో మరోమారు భారీ వర్షాలు

**శ్రీశైలం,**

ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలంలో మరోసారి భారీ వర్షాలు కురియడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.. శ్రీశైలం రాకపోకలు సాగించే భక్తులు అప్రమత్తంగా ఉండాల్సిన సమయం వచ్చింది.. శ్రీశైలం-హైదరాబాద్ ఘాట్ రోడ్డులో భారీ స్థాయిలో కొండచరియలు విరిగిపడ్డాయి.. మంగళవారం ఉదయం నుంచి శ్రీశైలంలో భారీ వర్షం కురుస్తోంది.. ఈ వర్షానికి శ్రీశైలం -హైదరాబాద్ ఘాట్‌రోడ్డులోని డ్యామ్, స్విచ్ యార్డ్ సమీపంలో ఒక్కసారిగా పెద్ద పెద్ద కొండ చరియలు, బండరాళ్లు, చెట్లు విరిగి రోడ్డుపై అడ్డుగా పడిపోయాయి.. దీంతో ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.. అయితే, కొండచరియలు, బండరాళ్లు, చెట్లు విరిగినపడిన ప్రాంతంలో.. ఆ సమయంలో వాహనాలు ఏమి లేకపోవడంతో.. పెను ప్రమాదం తప్పినట్టు అయ్యింది.. కొండచరియలు విరిగినపడిన సమయంలో.. ఆ ప్రాంతంలో కారు, బస్సు, లారీలు ఏదైనా ఉంటే భారీ నష్టం జరిగి ఉండేదని.. ప్రాణనష్టం కూడా జరిగి ఉండేదని.. ఆ సమయంలో అక్కడ ఏ వాహనం, భక్తులు ఎవరూ లేకపోడంతో.. అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.. వర్షం కురిసే సమయంలో ఘాట్ రోడ్డులో వచ్చే భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు అధికారులు..

## గ్రామీణ రహదారుకలు మహర్దశ

### సాస్కి నిధులతో రోడ్ల పునర్నిర్మాణం

### తోణమే పంచాయితీరాజ్ రోడ్ల పునరుద్ధరణ

### నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాలు జరగాలి

### అధికారులను ఆదేశించిన డిప్యూటి సిఎం పవన్

**హైదరాబాద్,**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గ్రామీణ రహదారుల పరిస్థితిని మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించింది.. సాస్కి.. పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.2వేల కోట్లు మంజూరు చేశారు.. ఈ నిధులను వినియోగించి గ్రామాల్లో దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్లను పునర్నిర్మిం చాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ , గ్రామీణాభి వృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. రహదారుల నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీ ఉండదు అని స్పష్టం చేశారు..రహదారుల నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులు ప్రమాణాలకు అనుగుణంగా పని చేయాలని ఆదేశించారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. నిర్మాణం ప్రారంభమైన తర్వాత పలు దశల్లో క్వాలిటీ చెక్ తప్పనిసరి.. ప్రమాణాలకు విరుద్ధంగా పనులు జరిగినా, అవకతవకలు నమోదైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, పుట్టపర్తిలో జరిగే శ్రీ సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో అక్కడి పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధికి రూ.35 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారం, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంతో ప్రతి గ్రామానికీ పటిష్టమైన, బలమైన రహదారులు అందించడమే లక్ష్యమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.. సాస్కి'పథకం ద్వారా నిధులను సద్వినియోగం చేసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు. ప్రజలకు 'సాస్కి' నిధుల ఫలాలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ శాఖల అధికారులకి పవన్ కల్యాణ్ దిశానిర్దేశర చేశారు.గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులకు రూ.2 వేల కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం సమకూర్చిందని స్పష్టం చేశారు పవన్ కల్యాణ్. సాస్కి నిధులతో నిర్మించే రోడ్లలో ఎక్కడ నాణ్యతా ప్రమాణాలు తగ్గకూడదని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో బాధ్యత అధికార యంత్రాంగానిదేనని ఆజ్ఞాపించారు. రోడ్ల నిర్మాణ దశ నుంచి పూర్తయ్యే వరకూ అధికారులు పరిశీలించాలని హుకుం జారీ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకంలో మరో ముందడుగు వేశామని పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. ఏపీలోని గ్రామాల్లో రహదారుల స్థితిగతులను మార్చి నూతన రోడ్లు నిర్మించడానికి కేందప్రభుత్వం 'సాస్కి' పథకం ద్వారా ఆంధప్రదేశ్‌కు రూ. 2 వేల కోట్లు నిధులు సమకూర్చిందని వ్యాఖ్యానించారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక








## ప్రభాస్‌పై మనసు పారేసుకున్న నేషనల్ క్రష్..

### ఉత్సాహంగా ఎదురు చూస్తున్నానంటూ కామెంట్

టాలీవుడ్‌కి 'ఛలో' సినిమాతో ఎంట్రీ ఇచ్చి నేషనల్ క్రష్‌గా మారిన రష్మిక మందానా ఇప్పుడు వరుస సినిమాలతో ప్రేక్షకులని అలరిస్తుంది. సౌత్ నుంచి బాలీవుడ్ వరకు తన అందం, నటన, చిలిపితనంతో అభిమానులను అలరిస్తున్న రష్మిక తన తాజా చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్' ప్రమోషన్లలో బిజీగా ఉంది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా నవంబర్ 7న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. అగ్ర నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో, ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో దీక్షిత్ శెట్టి హీరోగా నటించాడు. రీసెంట్‌గా విడుదలైన ట్రైలర్ ప్రేమలోని సంక్లిష్టత, భావోద్వేగాలను అద్భుతంగా చూపుతూ ప్రేక్షకుల మనసులను దోచుకుంటోంది.





## ట్రాజెడీ క్వీన్ బయోపిక్‌లో కియారా

మహానటి సావిత్రి జీవితకథంతా సంఘర్షణే.. బాలీవుడ్ మహానటి మీనాకూమారి జీవితంలోనూ అంతటి సంఘర్షణ దాగుందన్న విషయం చాలామందికి తెలీదు. సావిత్రి కథలా మీనాకుమారి కథ కూడా విషాదాంతం. నక్షత్రమండలం నుంచి నేల రాలిన ధృవతారగా, ట్రాజెడీ క్వీన్‌గా మీనాకుమారిని అభివర్ణిస్తుంటారు ఉత్తరాది ప్రేక్షకులు. త్వరలోనే ఆమె కథ తెరకెక్కనున్నది. సిద్ధార్థ్ సి.మల్హోత్రా రూపొందించనున్న ఈ చిత్రానికి 'కమల్ ఔర్ మీనా' అనే పేరును కూడా ఖరారు చేశారు. ఇందులో మీనాకుమారిగా ఎవరు నటిస్తారు? అనే విషయంలో మాత్రం మొన్నటివరకూ స్పష్టత లేదు. తొలుత కృతి సనన్ పేరు బాగా వినిపించింది. తర్వాత కియారా అద్వానీ పేరు వెలుగులోకి వచ్చింది. కానీ అధికారికంగా మాత్రం ఎలాంటి కన్ఫర్మేషన్ లేదు. అయితే.. తాజాగా ఈ విషయంపై నటి కైరా అద్వానీ క్లారిటీ ఇచ్చారు. 'కమల్ ఔర్ మీనా'లో తానే మీనాకుమారి పాత్ర పోషిస్తున్నట్టు ఆమె అధికారికంగా వెల్లడించారు. మీనాకుమార్ భర్త కమల్ పాత్ర ఎవరు పోషిస్తారనేది ఇప్పుడు ఆసక్తికరమైన అంశం. స్టోరీతో సహా ప్రీప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.



## ఆ వార్తలను నమ్మొద్దు!

ఎన్టీఆర్, ప్రశాంత్‌నీల్ కాంబినేషన్‌లో 'డ్రాగన్' (టైటిల్ ఇంకా ఖరారు కాలేదు) చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. హైఇంటెన్సిటీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రంలో ఎన్టీఆర్ పాత్ర అత్యంత శక్తివంతంగా ఉంటుందని చెబుతున్నారు. మాఫియా నేపథ్య కథాంశమిదని సమాచారం. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఓ కీలకమైన షెడ్యూల్ కోసం చిత్రబృందం ఈ నెల రెండో వారంలో యూరప్‌కు పయనం కానుంది. తాజాగా ఈ సినిమాపై సోషల్‌మీడియాలో వస్తున్న ఓ రూమర్‌పై దర్శకుడు ప్రశాంత్‌నీల్ స్పష్టతనిచ్చారు. ఈ సినిమా నిడివి ఎక్కువ కావడంతో రెండో భాగాన్ని కూడా తీసే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని ప్రచారం జరుగుతున్నది. ప్రశాంత్‌నీల్ డైరెక్ట్ చేసిన 'కేజీఎఫ్' రెండు భాగాలుగా తెరకెక్కింది. 'సలార్' రెండో భాగం కూడా 'శౌర్యాంగపర్వం'గా రానుంది. ఈ నేపథ్యంలో 'డ్రాగన్' కూడా రెండు భాగాలుగా వస్తుందని రూమర్ మొదలైంది. ఈ వార్తలను ప్రశాంత్‌నీల్ టీమ్ ఖండించింది. సినిమాపై వస్తున్న ఊహాగానాలను నమ్మొద్దని, కేవలం ఒకే భాగంగా రానున్న శక్తివంతమైన కథ ఇదని పేర్కొంది. దాంతో రూమర్స్‌కు చెక్ పడినట్లయింది.






## రవితేజతో మాస్‌గీతం

ఇటీవలే యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మాస్ జాతర' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు హీరో రవితేజ. ప్రస్తుతం ఆయన కిషోర్ తిరుమల దర్శకత్వంలో ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నారు. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఇందుకోసం ఓ ప్రత్యేకమైన సెట్‌ని తీర్చిదిద్దారు. నాయకానాయికలు రవితేజ, అషికా రంగనాథ్‌లపై ఈ గీతాన్ని తెరకెక్కిస్తున్నామని, శేఖర్ మాస్టర్ నృత్యరీతుల్ని సమకూర్చుతున్నారని, హుషారెత్తించే మాస్ నంబర్‌గా ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. చాలా విరామం తర్వాత రవితేజ నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇదని, కుటుంబ భావోద్వేగాలు, వినోదం ప్రధానంగా మెప్పిస్తాయని చిత్రబృందం పేర్కొంది.

## ప్రేమకథల్లో ఇది మరో కోణం

'ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. అనేక లేయర్లున్న పాత్ర ఇది. 'ఈ క్యారెక్టర్‌లో ఏదో నెగిటివిటీ ఉంది.. ఇతనో టాక్సిక్ బోయ్.' అనే ఇంప్రెషన్ ట్రైలర్ చూసిన వారికి కలుగుతుంది. అయితే.. ఈ పాత్ర చేసేటప్పుడు 'దీన్ని నెగిటివ్ క్యారెక్టర్‌గా ఫీలై చేయొద్దు..' అని క్లియర్‌గా చెప్పేవారు దర్శకుడు రాహుల్ రవీంద్రన్. ఇదో చిత్రమైన పాత్ర. నాది ఫిల్మ్ స్కూల్ బ్యాగ్రౌండ్ కాబట్టి తేలిగ్గా అర్థం చేసుకున్నా. పర్సనల్‌గా నాకు బాగా నచ్చిన స్క్రిప్ట్ ఇది.' అని హీరో దీక్షిత్ శెట్టి చెప్పారు. రష్మిక మందన్నా ప్రధాన పాత్రధారిగా రూపొందిన ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ 'ది గర్ల్ ఫ్రెండ్'. ఈ పాన్‌ఇండియా సినిమాలో దీక్షిత్ శెట్టి మేల్ లీడ్ పోషించారు.



## వందో చిత్రంలో ముగ్గురు హీరోయిన్లు?

అగ్ర హీరో అక్కినేని నాగార్జున ప్రస్తుతం తన 100వ సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు. తమిళ దర్శకుడు రా.కార్తీక్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఓ మినీ షెడ్యూల్‌ని కూడా పూర్తి చేశారని సమాచారం. ఇదిలావుంటే.. ఈ సినిమాలో నాగ్‌కు జోడీగా ముగ్గురు కథానాయికలు నటిస్తారట. వారిలో ఒకరుగా టబు ఇప్పటికే ఫైనల్ అయ్యారు. తాజాగా మరో హీరోయిన్ పాత్రకు సుస్మితాభట్‌ను ఖరారు చేసినట్టు తెలిసింది. మూడో కథానాయికగా ఓ స్టార్ హీరోయిన్‌ని ఎంపిక చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. పవర్‌ప్యాక్డ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉండబోతున్నదని, మునుపెన్నడూ చూడని కొత్త నాగార్జునను ఇందులో చూస్తారని చిత్రబృందం చెబుతున్నది. నాగచైతన్య, అఖిల్ కూడా ఇందులో ఓ కీలక పాత్రలు పోషించనున్న విషయం తెలిసిందే. ప్రతిష్టాత్మక అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై రూపొందుతున్న ఈ పాన్ ఇండియా సినిమా వచ్చే ఏడాది చివర్లో విడుదల కానున్నది.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**అక్షర కలం, మందమర్రి నవంబర్ 05:**

మండలంలోని అందుగుల పేట 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ లో 8 ఎంవిఏ పిటిఆర్ పెడుతున్నందున గురువారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ బి శ్రీనివాస్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సబ్ స్టేషన్ పరిధిలోని జిఎం కార్యాలయం, యాపల్, కేకే 2, ఊరు మందమర్రి, టోల్ ప్లాజా, మార్కెట్, దీపక్ నగర్, పాలచెట్టు, దొరల బంగ్లా, ఊరు రామకృష్ణాపూర్, కాళీ క్యాంప్, అందుగులపేట, పులి మడుగు, కోటేశ్వరరావు పల్లె, బొక్కల గుట్ట, నార్లాపూర్ తదితర సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

# టేకుల సోమారం గ్రామ చెరువులో ప్రత్యేక పూజలు



**వలిగొండ నవంబర్ 05 అక్షరకలం**

:మండల పరిధిలోని టేకులసోమారం గ్రామ చెరువు నిండి అలుగు పోయడంతో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా బునాది కాలువ ద్వారా వచ్చే నీళ్లు కరివేనుకుంట చెరువు నిండి,నల్లచెరువు అలుగు పోయాడంతో, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చెగురి మల్లేష్ గ్రామ పెద్దలు, చెరువును పరిశీలించి అనంతరం కట్ట మైసమ్మ ఆలయంతో పాటు,చెరువు వద్ద గంగమ్మకి గ్రామస్థులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం రైతులు,గ్రామస్థులు చేగూరి మల్లేశంను శాలువతో సత్కరించారు.రైతులు మాట్లాడుతూ బూనాది గాని కాలువ చేగూరి మల్లేశం తన సొంత నిధులతో కాల్వను తవ్వించడం వలన చెరువు నిండి అలుగు పోస్తుందని చేగూరి మల్లేశంకి రైతులు పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,మల్లేషన్న యువసేన సభ్యులు పాల్గొన్నారు..

# సంస్కృతి సాంప్రదాయాలను గౌరవిస్తూ, సనాతన ధర్మాన్ని ఆచరించాలి




**మందమర్రి/చెన్నూరు నవంబర్ 05 అక్షర కలం**

దేశంలోని ప్రతి ఒక్క హైందవుడు సనాతన ధర్మాన్ని పాటిస్తూ, భక్తి మార్గంలో ఆధ్యాత్మికత వైపు పయనించాలని, భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని పట్టణ ఎస్సై రాజశేఖర్ పట్టణంలోని పాలచెట్టు ఏరియా పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం పురోహితుడు డింగరి కృష్ణ చైతన్య ఆచార్యులు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బండారు సూరిబాబు లు తెలిపారు. కార్తీక పౌర్ణమి ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం నుండి బెల్లంపల్లి మండలంలోని బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం వరకు చేపట్టిన మహా పాదయాత్ర ప్రారంభోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై, పాదయాత్రను ప్రారంభించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు భారతీయ సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ, సనాతన ధర్మాన్ని ఆచరించాలని కోరారు. అత్యంత పవిత్రమైన కార్తీక పౌర్ణమి రోజున పాదయాత్రగా ఆ మహా శివుని కొలిచేందుకు తరలి వెళ్లడం శుభప్రదమని తెలిపారు. ప్రజల్లో భక్తి భావం వెల్లివిరిసేలా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. అనంతరం భక్తులకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేసి, పాదయాత్ర భక్తులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రాంటెంకి దుర్గరాజ్, చెలిమేటి చంద్రమౌళి, కొలేటి శివప్రసాద్ లు భక్తులు పాల్గొన్నారు.

# మల్టీప్లెక్సుల్లో మండుతున్న ధరలు

## ఇలా అయితే థియేటర్ల మూత తప్పదు

## హెచ్చరించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ,**

దేశంలోసింగిల్ స్క్రీన్ థియేటర్లు బాగా తగ్గిపోయాయి. మల్టీప్లెక్స్‌ల హవా నడుస్తోంది. అయితే, టికెట్ రేట్ల దగ్గరినుంచి తినే వస్తువుల వరకు మల్టీప్లెక్స్‌లో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మినిమం టికెట్ ధర 200 రూపాయలు పైనే ఉంటోంది. కొన్ని మల్టీప్లెక్స్‌లలో వాటర్ బాటిల్ ధర 100 రూపాయలు.. కాఫీ ధర 700 రూపాయలు ఉంటోంది. సాధారణ, మధ్య తరగతి కుటుంబాలు మల్టీప్లెక్స్‌లకు వెళ్లే పరిస్థితి కనిపించటం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మల్టీప్లెక్స్‌లపై భారత అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. అత్యధిక ధరలు ఇలానే కొనసాగితే సినిమా హాళ్లు మూసుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది. మల్టీప్లెక్స్‌లలోని టికెట్ రేట్లు 200 రూపాయల వద్ద ఉండాలని కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాతో పాటు మరికొంతమంది హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ప్రభుత్వ నిర్ణయంపై స్టే విధించింది. కానీ.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా అమ్మే ప్రతీ టికెట్‌కు సంబంధించిన ఆడిటబుల్ రికార్డ్స్ మెయిన్‌టేన్ చేయాలని ఆదేశించింది. అంతేకాదు.. ఆఫ్‌లైన్‌లో టికెట్ కొనే వారి నుంచి ఐడీ ప్రూఫ్ తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు నిర్ణయంపై ఓ పిటిషన్ వేసింది. ఆ పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహ్తా బెంచ్ తాజాగా విచారణ జరిపింది. ఇఃుచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్ నాథ్ మాట్లాడుతూ.. 'మీరు వాటర్ బాటిల్‌కు 100 రూపాయలు, కాఫీకి 700 రూపాయలు తీసుకుంటున్నారు' అని అన్నారు. ఇందుకు మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తరపున కేసు వాదిస్తున్న అడ్వకేట్ ముకుల్ రోహత్గీ స్పందిస్తూ.. 'తాజ్ హోటల్‌లో కాఫీకి 1000 రూపాయలు తీసుకుంటున్నారు. మరి మీరు ఆ రేట్‌ను ఫిక్స్ చేస్తారా?' అని అడిగారు. ఇందుకు విక్రమ్ నాథ్ బదులిస్తూ.. 'ఈ రేట్లు స్థిరంగా ఉండాలి. సినిమా రంగం రోజురోజుకు దెబ్బ తింటోంది. ఇలాంటి సమయంలో జనం వచ్చి సినిమాను ఎంజాయ్ చేసేలా రేట్లు ఉండాలి. లేకపోతే సినిమా హాళ్లు ఖాళీగా ఉండాల్సి వస్తుంది' అని అన్నారు. ముకుల్ స్పందిస్తూ..'కర్ణాటక హైకోర్టు తీసుకున్న నిర్ణయం సరైనది కాదు. ఆఫ్‌లైన్‌లో టికెట్ కొనే వారి నుంచి ఐడీ ప్రూఫ్ తీసుకోమంటే ఎలా?. ఐడీ కార్డులు పెట్టుకుని థియేటర్లకు ఎవరు వస్తారు?' అని ప్రశ్నించారు.

# ఓరి.. దేవుడా..!

## పత్తి రైతును వీడని కష్టాలు

## మొదట్లో విత్తనాలు, ఎరువుల కొరత

## ఆపై భారీ వర్షాలతో అతలాకుతలం

## పంట అమ్మే క్రమంలో తేమ, పరిమితి కొర్రీలు

## నేటి నుండి కొనుగోళ్ల ట్రేడర్స్ బ్రేక్..!

## నాలుగు రోజుల గడువు కోరిన ప్రభుత్వం

## సీసీఐ కొనుగోళ్లపై ప్రభావం



**అక్షరకలం ప్రతినిధి, నల్గొండ**

**నల్లగొండ జిల్లాలోని దేవరకొండకు చెందిన ఓ రైతు తనకున్న ఆరెకరాలకు తోడు మరో 22 ఎకరాలు రూ.7 లక్షలకు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాడు. పెట్టుబడి రూ.16 లక్షల వరకు అయ్యింది. 130 క్వింటాళ్ల దిగు బడి వచ్చింది. ఇంట్లో నిల్వ ఉంచాడు. మద్దతు ధరకు విక్రయిద్దామంటే సీసీఐ విధించిన తేమ, పరిమితి నిబంధనలు అడోస్తున్నాయి. ఈ క్రమంలో ఆందోళనలో ఉండగా తాజాగా పిడుగులాంటి వార్త ఇతడి చెవిన పడింది. మార్కెట్లో కొనుగోళ్లే బందయ్యే పరిస్థితి ఉందని తెలియడంతో దేవుడా.. ఏంటి ఈ పరిస్థితి అంటూ నిట్టూరుస్తున్నాడు. ఇతనొక్కడే కాదు..నల్గొండ జిల్లాలో అనేక మంది రైతులది ఇదే పరిస్థితి.**

## వెంటాడుతున్న సమస్యలు...

ఈ సీజన్లో పత్తి రైతును సమస్య లు వెంటాడుతూనే ఉన్నాయి. మొదట్లో విత్తనాల కోసం ఇక్కట్లు తప్పలేదు. తర్వాత అధిక వర్షాలతో సతమతమయ్యాడు. పంట ఎదుగుదలకోసం యూరియా వినియోగిద్దామంటే సరిపడా దొరకని దుస్థితి. పంట చేతికొచ్చే సమయంలో ఆకాల వర్షాలతో తల్లడిల్లిపోయాడు. అష్టకష్టాలకోర్చి అరకొరగా వచ్చిన దిగుబడిని విక్రయిద్దామంటే సీసీఐ నిబంధనలు శాపంగా మారాయి. నల్గొండ జిల్లాలో గతనెల 24న పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. 9 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు సీసీఐ ప్రకటించింది. మిగతా కేంద్రాల్లో ప్రారంభించాల్సి ఉంది.

## వీడని కష్టాలు...

ఎంతోకొంత దిగుబడులు వచ్చాయని, వాటిని విక్రయిస్తే వచ్చే డబ్బులతో అప్పు తీర్చడంతో పాటు ఇంటి ఖర్చులు నెట్టుకొద్దామని రైతులు భావిస్తుంటే కొనుగోళ్లలో మొదటి నుంచి పేచీయే నెలకొంది. మద్దతుధరతో పంట కొనుగోలు చేస్తుందని భావించినా సీసీఐ.. తేమ, పరిమితి పేరిట కొర్రీలు విధించడంతో సతమతం అయ్యారు. వీటి నుంచి ఎలా బయట పడదామని ఆలోచిస్తున్న క్రమంలో మరో వార్త వారిని ఆందోళనకు గురిచేస్తోంది. తాజాగా ప్రైవేట్ వ్యాపారులు సీసీఐ నిబంధనలను వ్యతిరేకిస్తూ తాము జిన్నింగ్లు నడపలేమని, సమస్యను పరిష్కరించకపోతే ఈనెల 6 నుంచి కొనుగోళ్లు చేయమని రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలకు రెండు రోజుల క్రితం లేఖ పంపారు. ఈ విషయంలో సీసీఐ సీఎండీతో చర్చిస్తానని మంత్రి ట్రేడర్స్ కు హామీ ఇచ్చారు. కొనుగోళ్లు ప్రారంభించే సమయంలోనే తాము ఈ నిబంధనల విషయంలో





చెప్పామని, వాటిని పరిష్కరిస్తామని చెప్పినప్పటికీ కొలిక్కి తేలేదని వ్యాపారులు పేర్కొన్నారు. కపాస్ కిసాన్ యాప్, ఎల్-1, ఎల్-2, ఎల్-3 నిబంధనల కారణంగా తాము జిన్నింగ్ మిల్లులు నడపలేని పరిస్థితి ఉందంటూ అల్టిమేటమ్ జారీ చేశారు. ఒక వేళ ప్రైవేట్ ట్రేడర్స్ జిన్నింగ్ మిల్లులు నడపకపోతే సీసీఐ కొనుగోలు చేసే పరిస్థితి కూడా ఉండదు. ఈ క్రమంలో పత్తి రైతుల్లో ఆందోళన కనిపిస్తుంది. మరోవైపు దీన్ని ఎలా పరిష్కరించాలనే సందిగ్ధంలో యంత్రాంగం పడింది. సీసీఐ నిబంధనల విషయంలో సడలింపులు ఇస్తేనే దీనికి పరిష్కారం ఉంటుందని ట్రేడర్స్ అభిప్రాయ పడుతున్నారు.

## సమావేశంలో సరే అని... ఛాయాదేవి (మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి)

సీసీఐ నిబంధనలు వ్యతిరేకిస్తూ ట్రేడర్స్ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 6 నుంచి పత్తి కొనుగోళ్లు చేయమని చెప్పారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సీసీఐతో సంప్రదింపులు చేస్తుంది. ట్రేడర్స్ ని పిలిపించి జిల్లా కలెక్టర్ మంగళవారం సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కొనుగోలు చేస్తామని, సరే అని చెప్పిన ట్రేడర్స్ మళ్లీ సమ్మె చేస్తామని చెబుతున్నారు.






## అసోసియేషన్ పిలుపు మేరకు.. శ్రీధర్ రెడ్డి (తెలంగాణ కాటన్ అసోసియేషన్ కోశాధికారి నల్గొండ)

రాష్ట్ర అసోసియేషన్ ఈనెల 6 నుంచి పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అందులో మేము కూడా భాగస్వాములయ్యాం. ఎల్-1, ఎల్-2, ఎల్-3 నిబంధనల కారణంగా జిన్నింగ్ మిల్లులు నడపలేము. సీసీఐ ఈ నిబంధనల విషయంలో సడలింపులు చేయాలి.మహారాష్ట్ర, బీహార్, ఒరిస్సా నుండి ఐదారు లక్షలు పెట్టి లేబర్స్ ను తీసుకొస్తాము. ఈ నిబంధనలు పెట్టడం వల్ల లేబర్స్ వెళ్లిపోయే అవకాశం ఉంది. రైతులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారు. దూరాబారం పెరిగింది. ప్రతిరోజు 75 నుండి 80 బండ్లు బుక్ అవుతున్నాయి. కానీ అందులో అయిదారు మాత్రమే పాస్ అవుతున్నాయి. రైతులు చాలా ఇబ్బందుల్లో ఉన్నారు. వచ్చే సారి పత్తి వేస్తారనే నమ్మకం కూడా లేదు. గతంలో ఎకరానికి 12 క్వింటాళ్లు కొనేది, ప్రస్తుతం దాన్ని ఏడు క్వింటాలు చేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం నాలుగు రోజుల గడువు ఇవ్వమని రాష్ట్ర అసోసియేషన్ కోరింది. 11వ తేదీన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది.

## భక్తులతో కిటకిటలాడిన చెరువుగట్టు ఆలయం



**నకిరేకల్ నియోజకవర్గం: అక్షర కలం,**

నల్గొండ జిల్లా నార్కట్ పల్లి మండలంలో ఉన్న తెలంగాణ శ్రీశైలం గా పిలువబడుతున్న శ్రీ జడల పార్వతి రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పరిసర ప్రాంతాలలో వేకువజాము నుండి శివనామస్మరణతో మారుమోగాయి. ఆలయ పరిసర ప్రాంతాలలో కార్తీకదీపం వెలిగించి భక్తులు తమ మొక్కలను చెల్లించుకున్నారు. రామలింగేశ్వర స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.

# విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలి

# ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు .. ఎర్ర శ్రీనివాసరావు

### పెండింగ్ స్కాలర్షిప్స్ ఫీజు రిబర్స్మెంట్ విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వీడనాడాలి ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు.. వై.విక్రమ్

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**





ఎస్ఎఫ్ఐ ఖమ్మం డివిజన్ 48వ మహాసభలు ఖమ్మం నగర కేంద్రంలోని సత్తెనపల్లి రామకృష్ణ భవన్ ఇందిరానగర్ నందు నిర్వహించారు మహాసభల ప్రారంభ సూచికగా స్వాతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం ఆశయాలు గల పతాకాన్ని రాష్ట్ర కమిటీ సభ్యురాలు సంగీత ఆవిష్కరించారు. తదనంతరం మహాసభ ప్రారంభ సభకు ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఎర్ర శ్రీనివాసరావు వై విక్రం లు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అలంబిస్తున్నటువంటి విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగావిద్యార్థులు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం విద్యారంగంలోకి మతోన్మాద భావాజాలను చోప్పించే ప్రయత్నం చేస్తుందని అటువంటి మతతత్వ భావజాలానికి మతతత్వ పోకడలకు వ్యతిరేకంగా పోరాడుతూ శాస్త్రీయ విద్యావిధానానికై భవిష్యత్తు పోరాటాలు చేయాలని అన్నారు తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ విద్యార్థులకు ఇవ్వవలసినటువంటి స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయడంలో నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తూ విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంలో పడేసే విధంగా ఉందని విద్యార్థులకు స్కాలర్షిప్స్ ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వకుంటే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు చెందినటువంటి విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోకుండా చదువులను మధ్యలోనే ఆపేసే కుట్ర ఈ రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని నిమ్న వర్గాలకు చెందినటువంటి విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుంటే వాళ్లకు ఉద్యోగ భద్రత కల్పించాల్సి వస్తుందేమో అన్న భయంతో ఈ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్షిప్స్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయడంలో జాప్యం చేస్తూ పైశాచిక ఆనందం పొందుతుందని అన్నారు. ప్రభుత్వం ఇదే విధానాలు అమలు చేస్తే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించేటువంటి పోరాటాలలో భాగస్వాములు అవ్వడం కోసం విద్యార్థి లోకమంతా కదిలి రావాలని తెలియజేశారు. ఈ మహాసభలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుధాకర్ ప్రవీణ్ మాజీ నాయకులు ఎంఏ జబ్బర్ దొంగల తిరుపతిరావు జిల్లా ఉపాధ్యక్షులు వంకాయల రాజు నాయకులు త్రినాధ్, లోకేష్, భరత్, పూజిత, సింధు, సాత్విక, రమణ,కావ్య, శ్రావ్య, మౌనిక,త్రివేణి పాల్గొన్నారు.

## పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన నిందితుల అరెస్ట్

### తాళ్లగురిజాల ఎస్ఐ బి రామకృష్ణ



**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 05:**

జిల్లాలోని తాళ్లగురిజాల పోలీస్ స్టేషన్ పరిధిలోని బుధకలాన్ గ్రామంలో గణేష్ నిమజ్జన ఉత్సవాల సందర్భంగా విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరు నిందితులను బుధవారం అదుపులోకి తీసుకోవడం జరిగిందని తాళ్లగురిజాల ఎస్ఐ బి రామకృష్ణ తెలిపారు. సోమవారం తాళ్లగురిజాల పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సెప్టెంబర్ 6, 2025న బుధకలాన్ గ్రామంలో గణేష్ నిమజ్జన ఉత్సవాల దగ్గర గొడవ జరుగుతుందని డయల్ 100 కు ఫోన్ రావడంతో వెంటనే పోలీస్ కానిస్టేబుల్ శివశంకర్, హెూంగార్డ్ శివకృష్ణ లు బుధకలాన్ లోని గణేష్ నిమజ్జన ఉత్సవాలు జరుగుతున్న ప్రాంతం వద్దకు వెళ్లి అక్కడ గొడవ పడుతున్న వారిని, గొడవలు పడవద్దని వారించగా, ఆ గుంపులో నుండి ఇద్దరు వ్యక్తులు వచ్చి, దౌర్జన్యంగా యూనిఫాంలో ఉన్న కానిస్టేబుల్ పై దాడి చేసి, పోలీస్ విధులకు ఆటంకం కల్పించారు. ఈ విషయమై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయగా అదే గ్రామానికి చెందిన చింతకుంట్ల గణేష్, చింతకుంట్ల మహేష్ లను నిందితుల గుర్తించగా, పరారి లో వారిని బుధవారం వారి నివాసంలో అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రజాశాంతికి భంగం కలిగించిన, పోలీసుల పైన దాడులకు పాల్పడిన చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

### మూడవరోజు కొనసాగిన డిగ్రీ విద్య సంస్థల బంద్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 05:**

గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ నిధులు వెంటనే విడుదల చేయాలని జిల్లాలోని డిగ్రీ కళాశాలల యాజమాన్య సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య (ఫతి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక బంద్ 3వ రోజు బుధవారం సైతం కొనసాగింది. ఈ సందర్భంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సభ్యులు బుధవారం జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పిఏ శ్రీధర్ కు బకాయిలు విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వెంటనే బకాయిలు విడుదల చేసేలా ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లి, పరిష్కరించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర చీఫ్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు, సివి రామన్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ గడిపల్లి నర్సయ్య, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎస్వి రమణ, మిమ్స్ కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసరాజు, డైరెక్టర్ శ్రీధర్, వివేకవర్ధిని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, శ్రీ హర్ష డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్ రెడ్డి, వాగ్దేవి డిగ్రీ కళాశాల డైరెక్టర్ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.



# కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులతో కిటికీటలాడిన భీమలింగం

### - శివనామస్మరణతో మారుమోగిన భీమలింగం..

**వలిగొండ నవంబర్ 05 అక్షరకలం**

:కార్తీక పౌర్ణమి సందర్భంగా మండల పరిధిలోని సంగెం గ్రామంలో గల భీమలింగం భక్తులతో కిటకిటలాడింది. మూసి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపాలను వెలిగించారు. ఈ ప్రదేశం మూడు కాలువల సంగమం కావడం





విశేషం,ఇక్కడ కొలువై ఉన్న భీమలింగేశ్వరుడు ఎంతో మహిమాన్వితం కలిగిన వాడుగా భక్తులు చెబుతుంటారు. పెళ్ళికాని యువతీ,యువకులు ఇకడ కొలువై ఉన్న భీమలింగేశ్వరున్ని హతుక్కుంటే త్వరగా పెళ్లిళ్లు జరుగుతాయని,భక్తుల గట్టి నమ్మకం. సుమారు 255 సంవత్సరాల చరిత్ర కలిగి ఉన్న గౌరీనమేత భీమలింగేశ్వరస్వామి వద్దకు ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమి రోజున వేలాది మంది భక్తులు వచ్చి వెళుతుంటారు. ఈ సందర్భంగా బుధవారం కార్తీక మాసాన్ని పురస్కరించుకొని సుమారు 50 వేలకు పైగా భక్తులు ఇక్కడికి వచ్చి మూసీనదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకొని మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం చుట్టు ప్రక్కల ప్రదేశమంతా శివనామ స్మరణతో మారు మోగిపోయింది. ఈ సందర్భంగా కమిటి సభ్యులు మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన ఈ భీమలింగేశ్వరునికి ఎన్నో ఏళ్ల చరిత్ర ఉందన్నారు. ప్రతి సంవత్సరం కార్తీక మాసం రోజున ఇక్కడ కుంభమేళాను తలపించే రీతిలో ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఇక భక్తుల తాకిడి ఏటేటా పెరుగుతూ వస్తుందని,గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈసారి భక్తుల తాకిడి ఎక్కువగా ఉందన్నారు. కానీ ఇక్కడ ప్రభుత్వం భక్తులకు ఎక్కడ ఎటువంటి మౌళిక సదుపాయాలను కల్పించడం లేదన్నారు. ఇక్కడికి వచ్చే భక్తులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, స్వామివారి చెంతకు చేరాలంటే వెంటనే ప్రభుత్వం స్పందించి భీమలింగం వద్దకు రోడ్డుమార్గాన్ని నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. భక్తులకు నోముల జంగారెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లా డీసీపీ అక్షాంశ్ యాదవ్ భీమలింగేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా డిసిపి అక్షాంశ్ యాదవ్ ను కమిటి సభ్యులు ఘనంగా సన్మానించారు. స్థానిక ఎస్ఐ యుగంధర్ గౌడ్ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 25 మంది పోలీస్ సిబ్బందితో పాటు ట్రాఫిక్ పోలీసులతో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కీసరి రాంరెడ్డి,కాసుల కృష్ణ,బాతరాజు బాల నరసింహ,నోముల జంగారెడ్డి, సురకంటి మురళిధర్ రెడ్డి,వాసుదేవ రెడ్డి,మల్లారెడ్డి, బద్దం రాఘవేందర్ రెడ్డి,వరికుప్పల మల్లేష్,మంద నరసింహ,కిరణ్ రెడ్డి,గిరిధర్ చారి,జక్కుల వెంకటేష్,వరీకుప్పల మల్లయ్య,నరసింహరావు, వెంకట్ రావు,సాయి కుమార్,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన సింగరేణి స్థాయి సాంస్కృతిక పోటీలు

### ఆద్యాంతం అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

### కోలిండియా పోటీల్లో రాణించాలి

### ౧- ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ

### పోటీలో పాల్గొన్న విజేతలకు బహుమతుల ప్రధానం

**అక్షర కలం, మందమర్రి నవంబర్ 05:**

పట్టణంలోని సీఈఆర్ క్లబ్ లో వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ (డబ్ల్యుపిఎస్ అండ్ జిఏ) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన సింగరేణి స్థాయి సాంస్కృతిక పోటీలు బుధవారం ముగిశాయి. మణుగూరు నుండి గోలేటి ఏరియాల వరకు సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాలోని కళాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కళా ప్రదర్శనలు ఆద్యాంతం వీక్షకులను విశేషంగా అలరించాయి. పోటీల అనంతరం నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ ఏరియా ఉన్నతాధికారులు, యూనియన్ ప్రతినిధులతో కలిసి హాజరై, విజేతలకు



బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ మాట్లాడుతూ, సింగరేణి కళాకారులు, క్రీడాకారులు కోలిండియా స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో, సాంస్కృత కార్యక్రమాల్లో రాణించి, సింగరేణి ఖ్యాతిని చాటాలని తెలిపారు. సింగరేణి యాజమాన్యం కార్మికుల ఉద్యోగుల సంక్షేమ కొరకు నిరంతరం కృషి చేస్తూ, ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తుందని వివరించారు. ఉద్యోగుల ఆరోగ్య విషయంలో, శారీరక, మానసిక ఉల్లాసం కొరకు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. విజయవంతంగా కంపెనీ లెవెల్ సాంస్కృతిక పోటీలు నిర్వహించుకోవడం చాలా ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. గెలుపొందిన కళాకారులు కోలిండియా స్థాయి పోటీల్లో తమ ప్రతిభ ప్రావీణ్యాలను కనబరిచి, బహుమతులు సాధించి, సింగరేణికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఫోక్ డాన్స్ లో మందమర్రి, బెల్లంపల్లి ఏరియా ఎన్ శ్రీనివాస్ బృందం మొదటి బహుమతి గెలుపొందడం సంతోషకరమని తెలిపారు. ఈ సందర్భంగా జిఎం వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, సిఎంఓఏఐ ఏరియా అధ్యక్షుడు రమేష్, ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, ఏరియా క్రీడల గౌరవ కార్యదర్శి, సీనియర్ పిఓ ఎం కార్తీక్, ఏరియాల క్రీడా సూపర్వైజర్లు డి జాన్ వెస్లీ, సిహెచ్ అశోక్, ఎం నరేందర్ రెడ్డి, పరస శ్రీనివాస్, హెచ్ రమేష్, ఏరియా క్రీడల సంయుక్త కార్యదర్శి శివకృష్ణ, అన్ని ఏరియాల కల్చరల్ కోఆర్డినేటర్లు, కళాకారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



# అభివృద్ధికి ఆమడ దూరంలో బొమ్మన్ పాడ్ గ్రామం?





**అక్షర కలం/ నారాయణపేట జిల్లా ప్రతినిధి, నవంబర్, 05**

నారాయణపేట మండలం బొమ్మను పాడు గ్రామం గత 25 సంవత్సరాలుగా బీసీ కాలనీలో అభివృద్ధికి నోచుకపోవడమే, కనీస సౌకర్యాలకు కూడా కరువైన దుస్థితి ఉన్నది, చెత్త చెదారంతో కంప చెట్లతో మురికి కాలువలతో 100 కుటుంబాలు నివసిస్తున్న పట్టించుకోని గత సర్పంచులు ఎంపీటీసీలు, ఆ గ్రామంలో గత ఐదు సంవత్సరాల కిందట వైస్ ఎంపీపీగా పనిచేసిన చరిత్ర గ్రామానికి ఉంది, రాజకీయంగా పోటీతత్వం ఉన్న అభివృద్ధిలో మాత్రం ఆమడ దూరంలో నిలిచి ఉన్నది బొమ్మను పాడు , ఎన్నికలు వస్తే లక్షలు లక్షలు ఖర్చ చేసే రాజకీయ నాయకులు ఉన్నారు కానీ గ్రామం అభివృద్ధికి చేసే నాయలు లేకపోయాడని ఆ గ్రామ యువకులు కి వారి బాధను తెలియజేశారు, అధికారం కోసం పాలకులు అది చేస్తాం ఇది చేస్తామని చెప్పే నాయకులు తప్ప గ్రామం అభివృద్ధిని పట్టించుకునే వారే కరువయ్యారని అన్నారు, గత ఎమ్మెల్యేకు ప్రస్తుత స్థానిక ఎమ్మెల్యేకు జిల్లా కలెక్టర్ కు తమ సమస్యలను వివరించిన మా గ్రామ సమస్యలను పరిష్కారం కావడం లేదని అని అన్నారు, గ్రామపంచాయతీ కార్యాలయంలో 22 లక్షల అమౌంట్ ఉన్న గ్రామం అభివృద్ధి చెందడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు, ముఖ్యంగా బీసీ కాలనీలో రోడ్ దాటాలంటే మురికి కాలువ మురికి కంప చెట్లు అడవిలాంటి ప్రాంతంగా మారిపోయింది, కాబట్టి ఇప్పటికైనా ప్రజా పాలకులు ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ గ్రామపంచాయతీ అధికారులు గ్రామ లో నీ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు వారి ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

# చిట్యాల లో ఘనంగా గురునానక్ జయంతి వేడుకలు



**చిట్యాల: అక్షర కలం**

నల్గొండ జిల్లా చిట్యాల పట్టణ కేంద్రంలోని సిక్కు మత గురుద్వారాలో బుధవారం సిక్కు మత వ్యవస్థాపక గురువైన గురునానక్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురుద్వారాలో ప్రముఖ సంకీర్తనచార్యులు భాయి రవీందర్ సింగ్ హైదరాబాద్ బృందం ఆధ్వర్యంలో శబద్ బాణి కీర్తనలు, భజనలు చేయడంతో పాటు సామూహిక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ వేడుకలకు సూర్యాపేట భువనగిరి ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గురుధర్మ ప్రచారపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు బహదూర్ సింగ్, ప్రేమ్ సింగ్, అంగత్ సింగ్, పరమేశ్వర్ సింగ్, జీవన్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద కాపర్తి చెరువులో చేప పిల్లల విడుదల




**చిట్యాల : (నవంబర్ 5) అక్షర కలం,**

నల్గొండ జిల్లా చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి చెరువులో తెలంగాణ ప్రభుత్వం చే ఉచితంగా మంజూరైన 72 వేల చేప పిల్లలను బుధవారం వెలిమినేడు సింగిల్ విండో చైర్మన్ రఘుమారెడ్డి చెరువులోకి వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదేశం మేరకు మత్స్య, కార్మిక సంఘం పెద్దకాపర్తి గ్రామానికి మంజూరైన 72 వేల బొచ్చ, రవ్వ, పెరిక చేప పిల్లలను చెరువులోకి వదిలామని అన్నారు. మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని అందులో భాగంగానే స్థానిక ఎమ్మెల్యే చెరువులను అభివృద్ధి చేసి మత్స్య పరిశ్రమ అభివృద్ధి అయ్యేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య సహకార శాఖ ఏడి రాజారామ్, సూపరింటె%శీ%డెంట్ వీరమల్ల శ్రీనివాస్ పెద్ద కాపర్తి మత్స్య కార్మిక సంఘం సొసైటీ అధ్యక్షులు బుంగపట్ల తిమ్మయ్య, కోశాధికారి నూతి తిరుమలేష్, మాజీ అధ్యక్షుడు బైరగొని బిక్షం, నూతి వెంకటేష్, మోర సత్యం, మూర సత్తయ్య, నూతి సతీష్, యాదయ్య, దేశగోని గోపాల్, స్వామి, నరసింహ పాల్గొన్నారు

## చిట్యాలలో గొర్రెలు అపహరణ


చిట్యాల (నవంబర్ 5) అక్షర కలం ,



నల్గొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వెంకటాపురంలో గొర్రెలు చోరీకి గురయ్యాయి. బాధితుడు బాధితుడు చిర్రబోయిన శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రోజున ఉదయం రోజువారీగా తనకున్న 16 గొర్రెలను మేపటానికి అడవికి తీసుకెళ్లి అదేరోజు సాయంత్రం 6 గంటలకు వెంకటాపురం వద్ద ఉన్న తన గొర్రెల షెడ్డులో పంపాడు. తెల్లవారుజామున తన గొర్రెలను మేపటానికి షెడ్డు దగ్గరికి వెళ్లి చూసేసరికి తన 16 గొర్రెలలో 4 గొర్రెపిల్లలు , 4 పెద్ద గొర్రెలను మొత్తం 8 గొర్రెలు కనిపించకుండా పోయాయని, సుమారు వాటి విలువ 80000 వరకు ఉంటుందని తెలియజేశాడు. శ్రీరాములు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని, తనకు ప్రభుత్వం తరపున న్యాయం చేయాలని చిరబోయిన శ్రీరాములు వేడుకున్నాడు

# జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి

# నవీన్ యాదవ్ విజయం తథ్యం





### -రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల నవీన్ యాదవ్ గెలుపుకై కొత్వాలతో పాటు పాల్వంచ సుజాతనగర్ కాంగ్రెస్ నాయకులు ప్రచారం

**అక్షర కలం/ హైదరాబాద్:**

జూబ్లీహిల్స్ అసెంబ్లీలి నియోజకవర్గానికి జరగనున్న ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వి నవీన్ యాదవ్ విజయం తథ్యం అని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్,డి సి ఎం ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. నవీన్ యాదవ్ విజయాన్ని కాంక్షిస్తూ రెవిన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస రెడ్డి ఆదేశాల మేరకు కొత్తగూడెం నియోజకవర్గంలోని పాల్వంచ, సుజాతనగర్ మండలాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు హైదరాబాదులో ప్రచారానికి వెళ్లారు.బుధవారం జూబ్లీహిల్స్ లోని నియోజకవర్గ పరిధిలో బోరబండ,రాజు నగర్ డివిజన్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ను కొత్వాలతో పాటు కాంగ్రెస్ నాయకులు కలిసి ప్రచారంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలతో కాంగ్రెస్ గెలుపు ఖాయం అన్నారు. ఈ కార్యక్రమాల్లో పాల్వంచ మాజీ జడ్పిటిసి ఎర్రం శెట్టి ముత్తయ్య,కొత్తగూడెం సొసైటీ అధ్యక్షులు మండే వీర హనుమంతరావు,పాల్వంచ సుజాతనగర్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న గౌడ్, చింతలపూడి శేఖర్,ఆర్టీఏ నెంబర్ బాదర్ల జోషి,కాంగ్రెస్ నాయకులు వై వెంకటేశ్వరరావు, కొత్తగూడెం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య రాంబాబు, నాయకులు కాపా శ్రీనివాసరావు, ఎస్ కే అబీద్,చిమట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎకరాకు 30 వేల రూ. నష్టం చెల్లించాలి:



**అక్షర కలం/మక్తల్, నవంబర్,05**

ఉట్కూర్: అధిక వర్షాల కారణంగా పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని.. అందుకు ఎకరాకు 30 వేల రూ. నష్టం చెల్లించాలని సామాజిక కార్యకర్త నరసింహ డిమాండ్ చేశారు. బుధవారం ఉట్కూర్ మండల పరిధిలోని బిజ్వార్ గ్రామం లోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద ఒక్కరోజు నిరసన దీక్ష ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది అధిక వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాల ప్రభావం ఎకరాకు పత్తి కేవలం ఐదు క్వింటాల్ కి మాత్రమే దిగుబడి వచ్చిందని తెలిపారు. కేంద్ర ఆర్థిక, గుణాంక శాఖ డైరెక్టర్ రేట్ పత్తి దిగుబడి తగ్గిందని నివేదిక జారీ చేసినట్లు తెలిపారు. ఎకరాకు కొత్తగా ఏడు క్వింటాళ్ల పత్తి మాత్రమే కొంటాం అనే నిబంధన ఎత్తివేసి 12 క్వింటాళ్ల పత్తి చేయాలని కోరారు. రైతులకు పూటకు ఒక కొత్త నిబంధనలు పెట్టి రైతులను ఇబ్బంది పెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. జరిగింది.సీసీఐ అధికారులు రైతులకు ఇబ్బంది పెట్టకుండా స్లాట్ ద్వారా బుక్ చేసుక ్నన్న మొత్తం పత్తి మద్దతు ధరకు కొనాలని డిమాండ్ చేశారువర్షాలతో పాటు పత్తి దిగుబడి తగ్గడంతో 20% తేమ ఉన్న పత్తి ను సిసిఐ మద్దతు ధర కొనే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

# ఘనంగా కార్తీక పౌర్ణమి ఉత్సవాలు...



**అక్షర కలం/మక్తల్, నవంబర్,05**

మాగనూర్: మాగనూర్ మండల కేంద్రంలోనీ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో బుధవారం కార్తీక్ పౌర్ణమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు అశేషంగా తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.దేవుని దివ్య అనుగ్రహంతో పాటి మీది సంధ్య బలరాం దంపతులు భక్తిశ్రద్ధలతో అభిషేక పూజ కార్యక్రమం నిర్వహించారు.అలాగే జగదేవి,డాక్టర్ సురేష్ కుమార్ దంపతులు అన్నప్రసాద కార్యక్రమం పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.సాయంత్రం స్వామివారి పల్లకి సేవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం లో కిష్టయ్య చారి,పూజారి రాకేష్ ఆలయ కమిటీ చైర్మన్ రమేష్ గౌడ్,కోశాధికారి కే కృష్ణయ్య,కార్యదర్శి భరత్ కుమార్,గ్రామ పెద్దలు ఆనంద్ గౌడ్,ముష్టి వెంకటయ్య,చెన్నప్ప చాకలి లింగప్ప,కడేచూర్ తిమ్మయ్య,సుదర్శన్ రెడ్డి, కోమటి వాబయ్య,దాసరి వాబయ్య,బొంబాయి మురళి తదితరులు పాల్గొన్నారు.

# నీటిలో మునిగి వృద్ధుడు మృతి

**చిట్యాల: ( నవంబర్ 5) అక్షర కలం,**

నల్గొండ జిల్లా నార్కట్ పల్లి పట్టణ కేంద్రంలో వృద్ధుడు నీటిలో మునిగి మృతి చెందాడు. నార్కట్ పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రోజున మధ్యాహ్నం రెండు గంటల 30 నిమిషాల సమయంలో నార్కట్ పల్లి. పట్టణంలోనీ వడ్డెర కాలనీలో ఒక వృద్ధుడు నీటిలో పడిపోయి చనిపోయినట్లు సమాచారం రావడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వృద్ధుని మృతదేహాన్ని బయటకి తీశారు. చనిపోయిన మృతుడు నార్కట్ పల్లి చెందిన జాల మల్లయ్య (70) గా గుర్తించామని తెలియజేశారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం



అందించి మృతదేహాన్ని నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నార్కట్ పల్లి సీఐ డి క్రాంతి కుమార్ తెలియజేశారు.

# మార్కెట్ ఆధునీకరణ పనులు సత్వరం పూర్తి చేయండి

### -మార్కెట్ను సందర్శించిన సిపిఐ బృందం

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం : ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆధునీకరణ పనులు సత్వరం పూర్తి చేయాలని సిపిఐ డిమాండ్ చేసింది. బుధవారం సిపిఐ -నాయకులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో జరుగుతున్న ఆధునీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి ఎస్ కె



జానిమియా మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తుల క్రయ, విక్రయాలు జరిగే సమయం కాబట్టి వీలైనంత తొందరగా నాణ్యతతో పనులను పూర్తి చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రెండవ పెద్ద వ్యవసాయ మార్కెట్గా ఖమ్మం ఉందని తెలంగాణలోని ఖమ్మం, వరంగల్, నల్లగొండతో పాటు ఆంధ్రా నుంచి కూడా వచ్చి ఇక్కడ వ్యవసాయ ఉత్పత్తులను రైతులు విక్రయిస్తారని ఆయన తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ మార్కెట్ పనులను పూర్తి చేయాలని జానిమియా కోరారు. మిర్చి సీజన్ త్వరలో ప్రారంభం కానుందని రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరు వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టేవిధంగా ఉందని పత్తి కొనుగోలుపై విధించిన ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ -సలాం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, జిల్లా సమితి సభ్యులు నూనె శశిధర్, వరదా నర్సింహారావు, నాయకులు భూక్యా రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల తొమ్మిదిన నిర్వహించే కార్తీక వనభోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### జిల్లా అధ్యక్షులు దంతూరి సైదులు గౌడ్

**నల్గొండ నవంబర్ 5( అక్షర కలం ):**

ఈ నెల 9న రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాదులోని సంజీవయ్య పార్కులు జరగబోయే కార్తిక వనభోజనాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దంతూరి సైదులు గౌడ్ గౌడ కుటుంబ సభ్యులకు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ (గోపా) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జరగబోయే కార్తీక వనభోజన కార్యక్రమం గౌడ సమాజ ఐక్యతకు,సాంస్కృతిక పరంపరలకు ప్రతీకగా నిలవాలని జిల్లా నుండి అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఘనవిజయం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశం లో జిల్లా ఆర్గనైసింగ్ సెక్రటరీ గా పాలకూరి యాదగిరి గౌడ్, జాయింట్ సెక్రటరీలుగా కొల్లు బాలకృష్ణ గౌడ్,పెద్ది రమేష్ గౌడ్,ఎక్జిక్యూటివ్ మెంబర్లుగా బోయపల్లి వెంకటేశ్వర్లు గౌడ్, కట్టంగూరి శ్రీను గౌడ్ లను కమిటీ కార్యవర్గం లోకి తీసుకోవడం జరిగిందని



తెలిపారు.కమిటీ సమావేశంలో సభ్యత్వ విస్తరణ కార్యక్రమం కొత్త సభ్యుల చేరికల పురోగతి,యువత భాగస్వామ్యం వంటి అంశాలపై చర్చించడం జరిగిందన్నారు.అలాగే 2026 క్యాలెండర్ కోసం కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని క్వాలిటీ తో క్యాలెండర్ తీసుకు వచ్చే విదంగా కమిటీ కృషి చేస్తుందని తెలిపారు.సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నేలపట్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి పోలగాని వెంకటేశ్వర్లు గౌడ్, గోపా నల్గొండ టౌన్ అధ్యక్షులు బోయపల్లి వెంకటేశ్వర్లు గౌడ్, ఉపాధ్యక్షులు నర్సింగ్ వెంకటేశ్వర్లు గౌడ్, వట్టికూటి గురుమూర్తి గౌడ్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు పంతంగి కరుణాకర్ గౌడ్,సభ్యులు పెద్ది రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

# రెచ్చుతున్న రేషన్ దందా..!

. అర్ధ రాత్రి రేషన్ అక్రమ రవాణా

. రేషన్ డీలర్లదే కీ రోల్ అంటున్న పేద ప్రజలు

. రేషన్ డీలర్లతో రేషన్ అక్రమార్కుల కుమ్మక్కు

. రేషన్ రావు ఆంధ్ర, తెలంగాణ లో కాకుండా ఇతర రాష్ట్రంలో ఉండి మరీ దందా..





అక్షర కలం/ ఖమ్మం బ్యూరో:

ఖమ్మం: ఉండేది ఇతర రాష్ట్రం లో.. ఆయనిది ఆంధ్ర ..రేషన్ దందా తెలంగాణ రాష్ట్రం లో. దర్జాగా దళాలు ఏర్పాటు చేసుకొని మరీ రేషన్ దందా. ఆయనే... రేషన్ రావు. పేదల కోసం. సన్న బియ్యం అందించి మరీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల పొట్ట నింపుతుంటే.. ఇదే అదనుగా రేషన్ అక్రమ వ్యాపారం చేస్తూ పేదల బియ్యమే ఆర్థిక వనరులు గా భావించి ఇతర రాష్ట్రంలో ఉండి ఒక దళాన్ని ఏర్పాటు చేసుకొని మరీ పేదల పొట్టలు కొడుతూ.. సంపాధిస్తూ దర్జాగా రేషన్ దందా చేస్తున్నారు. పేదల కోసమే ఏర్పాటు చేసిన సన్న బియ్యం తో వ్యాపారం చేస్తూ తనకంటూ ఒక బృందాన్ని ఏర్పాటు చేసి దర్జాగా రేషన్ దందాకు తెరలేపి మరీ అక్రమ వ్యాపారం చేస్తున్నారు. ఇదే అదనుగా పలువురు డీలర్లు సైతం కుమ్మక్కై ఈ అక్రమ రేషన్ వ్యాపారం లో పాలు పంచుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే రేషన్ దందాకు పేదలకు ఇవ్వాల్సిన ప్రభుత్వ సన్న రేషన్ బియ్యాన్ని వ్యాపారంగా మార్చి డీలర్లే కీలక పాత్ర వహిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దందా పై ఉక్కుపాదం వేస్తామని, పీడీ యాక్టు పెడతామని హెచ్చరించినప్పటి కీ రేషన్ దందాను అరికట లేకపోయేందుకు ముఖ్య కారణం కంచె చేను మేస్తోంది అన్న చందంగా డీలర్లు పాత్ర ఉందని, అటువంటి వారిపై కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం చూస్తోందని తెలుస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి నియోజకవర్గంలో కల్లూరు, పెనుబల్లి, తల్లాడ, మండలాల్లో ఇటువంటి రేషన్ దందా సాగుతోందని వార్తలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇటువంటి పేదల పొట్ట కొట్టి సాగిస్తున్న రేషన్ దందాను అరికట్టాలని పేద ప్రజలు కోరుతున్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత..- మంత్రి వాకిటి శ్రీహరి.



నర్వ : నారాయణపేట జిల్లా నర్వ మండలంలోని కల్వాల గ్రామానికి చెందిన ఖాజా హుసేన్ లబ్ధిదారునికి ముఖ్యమంత్రి సహాయని నిధి చెక్కు అందజేశారు. నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ , నర్వ మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల మరియు కల్వల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఈ చెక్కుని అందజేయడం జరిగింది..

## క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుంది



అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

ఖమ్మం: మేరా యువ భారత్ ( మినిస్ట్రీ అఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ ) వారి సహకారంతో పువ్వాడ నగర్ జాగృతి యూత్ అసోసియేషన్ వారు బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం నందు ఘనంగా నిర్వహించడం జరిగింది. అబ్బాయిలకు కబడ్డీ, బ్యాడ్మింటన్ (షటిల్), పరుగు వంటి క్రీడలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా ఖమ్మం జిల్లా డివైఎస్ఓ ( జిల్లా యువజన మరియు క్రీడా సంస్థ ) అధికారి టీ. సునీల్ రెడ్డి విద్యార్థులతో మాట్లాడుతూ క్రీడలు ఆడడం వల్ల జ్ఞాపకశక్తి పెంపొందించడం, మానసిక ఒత్తిడి తగ్గించుకోవడం, మరియు చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉండడం వంటి మానసిక ఉల్లాసం ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందని టి. సునీల్ రెడ్డి అన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు టీ. సునీల్ రెడ్డి మరియు యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ షారుఖ్ ఇమ్రాన్ వారి చేతుల మీదుగా మొదటి మరియు ద్వితీయ బహుమతులు మెడల్స్, సర్టిఫికెట్స్, షీల్డ్ ఇవ్వడం జరిగింది.

## అన్నం సేవా ఫౌండేషన్ లో అఖండ హరినామ సంకీర్తనపరులు 25 మందికి మరియు అన్నం శ్రీనివాసరావుకు ఘన సన్మానం





అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

ఖమ్మం : కార్తీక పౌర్ణమి పర్వదినము అన్నం శ్రీనివాసరావు జన్మదిన సందర్భంగా శ్రీశ్రీశ్రీ అవధూతేంద్ర భక్తమండలి సమాజం శ్రీ మాన్ గొట్టిపర్తి శివాజీ గురువు భక్త బృందం అధ్వర్యంలో అన్నం సేవా ఫౌండేషన్ లో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా అఖండ హరినామ సంకీర్తనపరులు 25 మందిని మరియు అన్నం శ్రీనివాసరావును ఘన సన్మానించుకోవడం జరిగింది . ఈ కార్యక్రమంలో షేక్ నాగుల్ మీరా , పోతుగంటి వెంకటేశ్వర్లు , ఎకో క్లబ్ ఎన్విరాన్మెంటల్ సొసైటీ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ డాక్టర్ కడవెండి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు

## కార్తీక పౌర్ణమి ఆలయాల్లో ప్రత్యేక పూజలు.

అక్షర కలం నారాయణపేట జిల్లా ప్రతినిధి నవంబర్,05.

ధన్వాడ: నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో ఎన్టీఆర్ కాలనీలో సాంబట్ల తోటలో వృద్ధ మల్లికార్జునస్వామి శివాలయంలోకార్తీక పౌర్ణమి సందర్భంగా గువ్వలపల్లి కొండన్న, ఉమదేవి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పాలాభిషేకం చేస్తూ పూజలు నిర్వహించారు.కార్తీక మాసంలో 365 వత్తుల దీపం వెలిగించడం వల్ల ఏడాది పొడవునా దీపారాధన చేసినంత పుణ్యం లభిస్తుందని ఆలయ అర్చకులు పటేల్ నరసింహులు చెబుతున్నారు.ఈ దీపాన్ని సంవత్సర దీపం అని కూడా అంటారు.ఇది జ్ఞానానికి లక్ష్మీ కటాక్షానికి పాప నివారణకు మోక్ష ప్రాప్తికి దోహదపడుతుందని విశ్వసిస్తారు.ఉద్యోగ వ్యాపార రీత్యా ప్రతిరోజూ దీపం వెలిగించలేని వారికి ఇది అనుకూలమైనది.పౌర్ణమి నాడు శివకేశవుల నామాలను జపిస్తూ, ఆవు నెయ్యి, నువ్వుల నూనెతో ఈ దీపాన్ని వెలిగిస్తారు అని తెలిపారు.ఈ ఆలయంలో16 సంవత్సరాల నుండి ప్రతి కార్తీక మాసంలో 2116 దీపాలు వెలిగిస్తారు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## శివనామ స్మరణతో మారుమోగిన శివాలయాలు







అక్షర కలం /భద్రాచలం

ఈరోజు శివ కేశవులను ఆరాధించే మాసం కార్తీక మాసం లో వచ్చే కార్తీక పౌర్ణమిని భక్తులు అత్యంత పవిత్రమైన రోజుగా భావిస్తారు ఈరోజు అనగా బుధవారం రోజున కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి పవిత్ర గోదావరిలో పుణ్య స్థానాలు ఆచరించడానికి వేలాది మంది భక్తులు, భద్రాద్రి తరలివచ్చారు గోదావరిలో స్థానమాచరించిన అనంతరం నేతిలో ముంచిన మూడువందల అరవై ఐదు వత్తుల దీపాలను పసుపు కుంకుమలతో అలంకరించి గోదావరిలో వదిలారు గోదావరి తీరాన శివ నామ స్మరణతో గోదావరి నది భక్తులతో పులకరించిపోయింది తదుపరి శివాలయంలో పూజలు నిర్వహించారు మరియు రామయ్య దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారుఈ యొక్క కార్యక్రమాన్ని సాంప్రదాయభ ద్ధంగా నిర్వహించడం జరిగినది.

## మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో పొదేం వీరయ్య కు శుభాకాంక్షలు

అక్షర కలం/ భద్రాచలం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య ను భద్రాచలం ఆయన క్యాంప్ కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిసి జాతీయ ఆదివాసీ కాంగ్రెస్ సలహా మండలి ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించబడిన సందర్భంగా పోదేం వీరయ్య ని శాలువా. పూలబొకే తో సన్మానించి శుభాకాంక్షలు తెలియపరచడం జరిగింది.ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మహిమూద్ ఖాన్. భద్రాచలం పట్టణ కాంగ్రెస్ పార్టీ మైనార్టీసెల్ అధ్యక్షులు ఎస్.కె అలీమ్,గౌరవ అధ్యక్షులు ఎస్కే ఉస్మాన్, ప్రధాన కార్యదర్శి ఎస్.కె కాసిం పాషా, ఉపాధ్యక్షులు ఎండి. అలీ, సైరుద్దీన్, సీనియర్ నాయకులు ఎస్ కె.మస్తాన్, యం డి.బాబాజీ,మైనార్టీ సెల్ మహిళా విభాగం ముంతాజ్ బేగం, ఎస్.కె సహిర, రిజ్వానా, తదితరులు పాల్గొన్నారు.



## జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థి అఖండ విజయం ఖాయమని ధీమా





అక్షర కలం/ హైదరాబాద్:

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి బుధవారం..కొల్లూరు డబల్ బెడ్రుమ్ ఏరియాలో కార్నర్ మీటింగ్ లలో పాల్గొన్నారు. ప్రజల వద్దకు వెళ్లి.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాల సంక్షేమానికి తగిన ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒకటేనని విమర్శించారు. అర్హులందరికీ రేషన్ కార్డులిచ్చి సన్న బియ్యం అందజేస్తున్నామని, ఉచిత విద్యుత్.. తదితర పథకాలతో ఎంతో లబ్ధి కలుగుతోందని ప్రజలకు వివరించారు. జూబ్లీహిల్స్ ప్రజల మద్దతు కాంగ్రెస్ అభ్యర్థికే ఉందని.. ఇక్కడ నవీన్ యాదవ్ అఖండ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, సీనియర్ నేత సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 9న న్యాయ సేవల దినోత్సవం.

అక్షర కలం/నారాయణపేట జిల్లా ప్రతినిధి,నవంబర్,05.

గౌరవ న్యాయ సేవా సేవాధికార సంస్థ లీగల్ సర్వీసెస్ సెక్రెటరీ వింధ్య నాయక్ గారి ఆదేశాల మేరకు నారాయణపేట టౌన్ పళ్ళ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ విజ్ఞాన సదస్సును చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కె. లక్ష్మిపతి గౌడ్ గారు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.సమాజంలోని పేద మరియు బలహీన వర్గాలకు సహాయం మరియు మద్దతు అందించడానికి 1987లో చట్టపరమైన సేవల అధికారుల చట్టంప్రారంభమైన జ్ఞాపకార్థం భారతదేశంలో ప్రతి సంవత్సరం నవంబర్ 9న న్యాయ సేవల దినోత్సవాన్ని జరుపుకుంటారు. దేశవ్యాప్తంగా న్యాయ సేవల అధికారులు నిర్వహించే వివిధ ప్రచారాలు మరియు కార్యక్రమాల ద్వారా, ముఖ్యంగా అణగారిన మరియు బలహీన వర్గాలకు, ఉచిత న్యాయ సహాయం లభ్యత గురించి అవగాహన పెంచడానికి మరియు న్యాయం కోసం సమాన ప్రాప్యతను ప్రోత్సహించడానికి ఈ రోజు ఉపయోగించబడుతుంది . న్యాయ సేవల దినోత్సవం గురించి ముఖ్య విషయాలు:ఉద్దేశ్యం: ఉచిత న్యాయ సహాయం గురించి అవగాహన పెంచడం మరియు అన్ని పౌరులకు, ముఖ్యంగా పేదలు మరియు అణగారిన వర్గాలకు న్యాయం లభించేలా చూడటం.స్మారకోత్సవం: ఇది లీగల్ సర్వీసెస్ అథారిటీస్ చట్టం, 1987 ప్రారంభాన్ని సూచిస్తుంది.కార్యకలాపాలు: జాతీయ న్యాయ సేవల ప్రదాత (%చీూూూూ%) మరియు దాని రాష్ట్ర స్థాయి ప్రతిరూపాలు చట్టపరమైన అవగాహన శిబిరాలు, వర్క్‌షాప్‌లు మరియు ఇతర కార్యక్రమాలను నిర్వహిస్తాయి.ప్రాముఖ్యత: “అందరికీ సమాన న్యాయం” అనే లక్ష్యానికి మద్దతు ఇస్తూ, వాటిని పొందలేని వారికి చట్టపరమైన సేవలను అందించడం యొక్క ప్రాముఖ్యతను తెలిపారు.



# వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి....





## - జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

కొల్చారం, నవంబర్ 05( అక్షరకలం):-

బుధవారం జిల్లా కలెక్టర్ కొల్చారం మండల పరిధిలోని సంగయ్య పేట గ్రామా పరిధిలో ఏర్పాటు చేసిన పిఏసిఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. జిల్లాలో ఇప్పటివరకు 34,520 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిర్దేశించిన రిజిస్టర్లు నిర్వహిస్తున్నారా లేదా అని పరిశీలించారు. అదేవిధంగా కలెక్టర్ స్వయంగా తేమశాతాన్ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చిన వెంటనే సీరియల్ నెంబర్ల వారీగా ఎంత ధాన్యం తెచ్చారు, ధాన్యం తేమ తెచ్చిన రోజు ఎంత ఉంది అనే వివరాలు రిజిస్టర్లలో నమోదు చేసుకోవాలని తెలిపారు. నిర్దేశించిన తేమ శాతం వచ్చిన వెంటనే కేటాయించిన మిల్లుకు ధాన్యాన్ని వెంటనే లోడ్ చేసి పంపించేయాలని సూచించారు. ఇక వరి కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు సన్న రకం వరి ధాన్యాన్ని, దొడ్డు రకం వరి ధాన్యాన్ని గుర్తించడంలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గతంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇచ్చిన శిక్షణ కార్యక్రమానికి హాజరైన వారు మాత్రమే కొనుగోళ్ళ ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు.

# వైభవంగా కార్తీక పౌర్ణమి.....

### సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు......

### అన్న ప్రసాద వితరణ కార్యక్రమం.....

### ఘనంగా జ్వాలాతోరణం......

అక్షర కలం నాగార్జునసాగర్



నందికొండ మున్సిపాలిటీ నాగార్జునసాగర్ లో బుధవారం కార్తీక మాసం కార్తీక పౌర్ణమి పండుగను వైభవంగా నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా స్థానిక భక్తులు శివాలయాలలో కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక అభిషేకాలు,పూజలు నిర్వహించారు. పవిత్ర కృష్ణా నదిలో కార్తీకదీపాలు వదిలారు. కార్తీక మాసం కార్తీక పౌర్ణమి సందర్భముగా హిల్ కాలనీ సత్యనారాయణ స్వామి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు రాధాకృష్ణమాచార్యులు, రామాంజనేయచార్యుల ు,వెంకటాచార్యులు ఆధ్వర్యంలో ఎంతో



ఘనంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. సుమారు 300 మంది పైగా పుణ్య దంపతులు ఈ సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలలో పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని స్థానిక ఎస్ ఐ ముత్తయ్య దంపతులు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మంచి కంటి కిషోర్,, నిర్వహణ కార్యదర్శి కృష్ణ, సీతారాములు తదితరులు పాల్గొన్నారు. హిల్ కాలనీలోని కాత్యాయని సమేత ఏలేశ్వరం మల్లికార్జున స్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి ఆలయ పూజారి పవన్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన జ్వాలాతోరణం కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరైనారు.

# దీపం... దేదీప్యమానం



### మొక్కులు చెల్లించుకున్న యువత

### భక్తులతో కిటకిటలాడిన దేవాలయాల

### మార్మోగిన శివ నామస్మరణ

### ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఘనంగా కార్తీక పౌర్ణమి



### వేడుకలు

### హర హరుని దర్శించుకునేందుకు క్యూ కట్టిన భక్తులు

అక్షరకలం ప్రతినిధి, నల్గొండ

కార్తీక పౌర్ణిమ పర్వదినం రాకతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఆలయాలు జ్వాలాదీప తోరణాల నడుమ కళకళలాడాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా శివాలయాలు, కిటకిటలాడాయి. ప్రధానంగా నల్గొండ జిల్లా కేంద్రంలోని ఛాయా సోమేశ్వర ఆలయం, పచ్చల సోమేశ్వరాలయం లో కోటి దీపోత్సవం, అన్నదాన కారక్రమాలు జరిగాయి. భక్తులు అంగరంగ వైభవం గా కార్తీక దీపారాధన చేపట్టారు. వందలాది మంది మహిళలు బారులు తీరి దీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మహేశ్వరుడికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అర్చన, రుద్రం, చమకం, సామూహిక బిల్వార్చన చేశారు. అన్ని ఆలయలలో కార్తీక పౌర్ణమి సందడి నెలకొంది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు మహాశివుడి నామస్మ రణతో మార్మోగాయి. అనంతరం ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించారు. కోటి దీపోత్సవం, జ్వాలా తోరణ మహోత్సవం నిర్వహించారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించుకున్నారు.

### ఆధ్యాత్మిక శోభ....

యాదగిరిగుట్ట, కొలనుపాక శివాలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు చేశారు. పానగల్ ఛాయా, పచ్చల సోమేశ్వర ఆలయాల్లో భక్తుల అభిషేకాలు చేసి.. కార్తీక దీపాలు వెలిగించారు. చెర్వుగట్టు, వాడపల్లి త్రివేణి సంగమంలో భక్తులు పుణ్య స్నానాలు.. నదీ తీరంలో కార్తీక దీపాలు వెలిగించి అగస్తేశ్వర స్వామి దేవాలయంలో పూజలు చేశారు. నాగార్జునసాగర్ సత్యనారాయణ స్వామి గుడిలో సత్యనారాయణ స్వామి వ్రతం కుటుంబ సభ్యులతో కలిసి భక్తులు భారీగా పాల్గొన్నారు. కృష్ణా నది తీరాన ఉన్న శ్రీ గంగా పర్వత వర్ధిని రామలింగేశ్వర దేవాలయంలో కిక్కిరించిన భక్తులు, మహిళలు, అయ్యప్ప స్వాములు, ఆంజనేయ స్వాములు నది స్నానం చేసి కార్తీక దీపాలు వెలిగించారు. సూర్యాపేట జిల్లా ప్రాచీన పిల్లలమర్రి శివాలయంలో విశేషంగా పూజలు జరిగాయి.

# జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన సమీర్ ఖాన్




అక్షరకలం నల్గొండ టౌన్

69వ ఎస్ జి ఎఫ్ ఐ ఇంటర్ డిస్టిక్ తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలు నల్లగొండ పట్టణంలో స్కూల్ గేమ్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ పోటీల్లో త్రిపురారం ఆల్ఫా స్కూల్ విద్యార్థి ఎండి. సమీర్ ఖాన్ అండర్17 విభాగం తైక్వాండో లో అద్భుత ప్రతిభ కనబరచి గోల్డ్ మెడల్ సాధించాడు. అరుణాచల్ ప్రదేశ్ లో జరిగే జాతీయ స్థాయి గేమ్స్‌కు అర్హత పొందాడు. విజేత సమీర్ ను ఆల్ఫా స్కూల్ ప్రిన్సిపాల్ ఎండి సలీం, డైరెక్టర్లు ఖయ్యూం, సోహెల్, కోచ్ యూనుస్ కమల్ అభినందించారు. తల్లిదండ్రుల ఆశీర్వాదం, కోచ్, ఉపాధ్యాయుల ప్రోత్సాహం వల్లే విజయం సాధించానని సమీర్ తెలిపాడు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాల్గొన్న క్రీడాకారులలో నల్లగొండ క్రీడాకారుడు సమీర్ ఖాన్ కీర్తి పతాకాన్ని ఎగురవేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. విజేతకు ఎస్ జి ఎఫ్ ఐ డిస్టిక్ సెక్రటరీ విమల చేతుల మీదుగా పతకం ప్రదానం చేశారు.

# హైదరాబాద్ ఏబీవీపీ కార్యవర్గ సభ్యుడిగా శివ



అక్షర కలం, ఆమనగలు :

గ్రేటర్ హైదరాబాద్ ఏబీవీపీ కార్యవర్గ సభ్యుడిగా ఆమనగల్లు కు చెందిన శివ నియమితులయ్యారు. మంగళవారం చైతన్యపురి లో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయనను కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి పృథ్వీ తేజ ప్రకటించారు.విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని,ఏబీవీపీని మరింత పటిష్ట పరుస్తానని నియమితులైన శివ చెప్పారు.

# షీ టీమ్స్ తో మహిళలకు మరింత భరోసా

### ఇబ్బందులు ఎదురైతే షీ టీంను సంప్రదించాలి

### రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 05:

రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిదిలోని మహిళలు, బాలికలు, విద్యార్థిని విద్యార్థుల భద్రతే షీ టీం లక్ష్యంగా పనిచేస్తున్నాయని, మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలు ఉన్న నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చునని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం ప్రకటనలో తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ లో రెండు షీ టీం బృందాలు పని చేస్తున్నాయని షీ టీం ఆధ్వర్యంలో వివిధ ప్రదేశాలు, పాఠశాలలు, కళాశాలలో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఆత్మహత్యలు, డ్రగ్స్, బాల్య వివాహాలు, వరకట్నం చట్టాలపై, నూతన మహిళా చట్టాలపై, డయాల్ 100, టి సేఫ్ యాప్ మహిళ భద్రత, రక్షణ చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తునట్లు తెలిపారు. షీ టీమ్ సభ్యులు ప్రత్యక్షంగా ఫిర్యాదులు తీసుకుంటారని, ఆన్లైన్, క్యూఆర్ కోడ్, వాట్సప్ లలో సైతం ఫిర్యాదులు స్వీకరిస్తున్నారన్నారు. మహిళలు, బాలికలపై ఆన్లైన్లో అసభ్యకర పోస్టులు పెట్టే వారు, సైబర్ నేరగాళ్లపై సైబర్, షీ టీమ్ సమన్వయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళలు, బాలికలు, విద్యార్థులు షీ టీం సేవలు ఉపయోగించుకోవాలని సూచిస్తూ, ఎల్లవేళలా అందుబాటులో ఉండి, సేవలు అందిస్తామని తెలిపారు. ఎవరైనా వేధించిన, రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడిన, ఉద్దేశపూర్వకంగా వెంబడించిన, అసభ్యకరంగా ప్రవర్తించిన, మాట్లాడిన విద్యార్థినిలు, మహిళలు అత్యవసర పరిస్థితులలో రామగుండం పోలీస్ కమిషనరేట్ షీ టీం నెంబర్ 6303923700, పెద్దపల్లి జోన్ షీ టీమ్ నెంబర్ 8712659386, మంచిర్యాల జోన్ షీ టీమ్ నెంబర్ 8712659386 కి కాల్ చేసి, వాట్సాప్ లలో సందేశం పంపించి లేదా డయల్ 100 కు ఫోన్ చేసి, తక్షణ పోలీస్ సహాయం పొందాలని సూచించారు. అక్టోబర్ నెలలో రామగుండం పోలీస్ కమిషనరేట్ షీ టీమ్స్ కి మొత్తం 69 పిర్యాదులు రావడం జరిగిందని. ఈ ఫిర్యాదుల్లో 12 ఫిర్యాదులు నేరుగా షీ టీమ్స్ రామగుండం కార్యాలయాలకు (పెద్దపల్లి జిల్లా, మంచిర్యాల జిల్లా షీ టీమ్స్) అందాయన్నారు. 57 కేసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాయని వివరించారు. మొత్తం 12 ఫిర్యాదులు అందగా 57 కేసులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డాయని, ఈ 12 ఫిర్యాదులలో 04 ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరిగిందని, వీటిలో చిన్న కేసులు 03, కౌన్సిలింగ్ ఇచ్చిన 01, కౌన్సిలింగ్ నిర్వహించి, హెచ్చరించి, విడిచిపెట్టిన కేసులు 02, సంబంధిత పోలీస్ స్టేషన్ పంపిన కేసులు 01, విచారణలో 01 కేసు కలవని వివరించారు. షీ టీమ్స్ పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో పబ్లిక్ ప్రదేశాలు, పార్కులు, షాపింగ్ మాల్ ప్రాంతాల్లో డేకాయ్ ఆపరేషన్స్ నిర్వహించాయని, ఈ ఆపరేషన్ లో మొత్తం 60 మంది నిందితులను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని, వారిపై ఈ పెట్టీ కేసులు నమోదు చేసి, వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ చేసి, హెచ్చరించి పంపించడం జరిగిందన్నారు. ఈ 57 రెడ్ హ్యాండెడ్ కేసుల్లో 06 పెట్టీ కేసులు నమోదు కాగా, కౌన్సెలింగ్ చేసినవి 08, హెచ్చరించి విడిచిన కేసులు 43 కలవని తెలిపారు. షీ టీమ్స్ అక్టోబర్-2025 నెలలో పెద్దపల్లి జోన్ పరిధిలో 28, మంచిర్యాల జోన్ పరిధిలో 25, మొత్తం 53 అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. అదేవిధంగా షీ టీమ్స్ అక్టోబర్-2025లో పెద్దపల్లి జోన్ పరిధిలో 117, మంచిర్యాల జోన్ పరిధిలో 126, మొత్తం 243 హాట్‌స్పాట్లను సందర్శించారని తెలిపారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955